ప్రజల కోసం.. ప్రకృతి కోసం.. సామాన్యుల గొంతుగా.. సామాజిక సమరంగా..

# ధర్మఘంటి

TELTEL/2012/47103

జాతీయ తెలుగు దిన పత్రిక

నల్లగొండ | సంపుటి : 12 | సంచిక : 316 | ఎడిటర్ : మేడే శాంతికుమార్ | గురువారం 12 ఫిబ్రవరి 2026 | పేజీలు : 12 | వెల : 3

**Circulated by:** Nalgonda, Hyderabad, Warangal, Ranga Reddy, Medak, Khammam, Adilabad, Nizamabad, Mahabub Nagar, Karimnagar


### ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించాల్సిన బకాయి రూ. 1.77 లక్షల కోట్లు

2024-25 ఆర్థిక సంవత్సరం నాటికి భారత ప్రభుత్వానికి టెలికాం కంపెనీలు చెల్లించా ల్సిన సర్దుబాటు చేసిన స్థూల రాబడి(ఏజీఆర్) బకాయిలు రూ. 1.77 లక్షల కోట్లకు పైగా ఉన్నాయి. ఈ మేరకు అధికారి క డేటా వివరాలను ప్రభుత్వం పార్లమెంటుకు

### వాణిజ్య ఒప్పంద ప్రభావం పడొచ్చు

మధ్యంతర వాణిజ్య ఒప్పందంపై వెలువడిన భారత్-అమెరికా సంయుక్త ప్రకటన ప్రభావం ఈవారం మన స్టాక్ మార్కెట్లపై ఉంటుంది. మన వస్తువులపై అమెరికా టారిఫ్‌లు 50% నుంచి 18 శాతానికి తగ్గుతాయి. సముద్ర ఉత్పత్తులు, జౌళి, ఇతర కార్మిక ఆధారిత రంగాలకు ప్రయోజనం కలగనుంది. సాంకేతికంగా చూస్తే నిఫ్టీ-50కి 25,500 పాయింట్ల వద్ద మద్దతు, 25,750 వద్ద నిరోధం కనిపించొచ్చు.



## భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది

- హోల్‌సేల్‌గా అమెరికాకు సరెండర్
- లోక్‌సభలో రాహుల్ గాంధీ
- లోక్‌సభలో అమెరికా, భారత్ ట్రేడ్ డీల్‌పై రాహుల్ గాంధీ విమర్శలు
- ఒప్పందంలో అమెరికా ప్రయోజనాలకే ప్రాధాన్యం ఇచ్చారని ఆరోపణలు
- కేంద్రం తీరుపై కాంగ్రెస్ అగ్రనేత ఘాటు వ్యాఖ్యలు

# మున్సిపల్ హస్తందే!

- తెలంగాణ మున్సిపల్ ఎన్నికలుపై ఎగ్జిట్ పోల్స్
- తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు భారీ విజయం అంచనా
- దాదాపు 70 నుంచి 85 మున్సిపాలిటీలు గెలుచుకోనున్న అధికార పార్టీ
- బీఆర్ఎస్, బీజేపీలు చాలా వెనుకబడి ఉన్నాయని తేల్చిన సర్వేలు
- నిజామాబాద్, కరీంనగర్‌లలో బీజేపీకి, మిగిలిన కార్పొరేషన్లలో కాంగ్రెస్‌కు ఆధిక్యం
- ఫిబ్రవరి 13న వెలువడనున్న అధికారిక ఫలితాలపై సర్వత్రా ఉత్కంఠ

హైదరాబాద్

తెలంగాణలో బుధవారం ముగిసిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ప్రభంజనం సృష్టించనుందని పలు ఎగ్జిట్ పోల్స్ అంచనా వేశాయి. రాష్ట్రంలోని 116 మున్సిపాలిటీలు, 7 మున్సిపల్ కార్పొరేషన్లకు జరిగిన ఈ ఎన్నికల పోలింగ్ అనంతరం విడుదలైన సర్వేలన్నీ కాంగ్రెస్‌కే పట్టం కట్టాయి. ప్రధాన ప్రతిపక్షాలైన బీఆర్ఎస్, బీజేపీలు ఓటర్లను ఆకట్టుకోవడంలో విఫలమైనట్లు ఈ అంచనాలు స్పష్టం చేస్తున్నాయి. వివిధ సర్వే సంస్థల అంచనాలను పరిశీలిస్తే, కాంగ్రెస్ పార్టీ స్పష్టమైన మెజారిటీ దిశగా పయనిస్తున్నట్లు కనిపిస్తోంది. పీపుల్స్ పల్స్ సర్వే - మిగతా3లో



## కొడంగల్‌లో ఓటేసిన సీఎం.. మధిరలో డిప్యూటీ సీఎం

- మున్సిపల్ ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగించుకున్న ప్రముఖులు
- మంచిర్యాలలో మంత్రి వివేక్ వెంకటస్వామి
- కేంద్రమంత్రి బండి సంజయ్, కామారెడ్డిలో షబ్బీర్ అలీ..
- నల్గొండలో కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి, నిజామాబాద్‌లో మహేశ్ కుమార్ గౌడ్




## భారీ ఉగ్ర కుట్ర భగ్నం

- పాక్ ప్రేరేపిత ఉగ్రవాది అరెస్ట్
- పంజాబ్, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో దాడులకు ప్లాన్
- ఐఈడీ, పిస్టల్, మందుగుండు సీజ్
- పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉగ్రవాది సహకారంతో నిందితుడు భారత్‌లో ఉగ్రదాడులకు ప్రణాళిక రచించాడని దర్యాప్తులో గుర్తింపు

## 'వాయు శక్తి-2026'లో ఆపరేషన్ సిందూర్ విన్యాసాలు

- ఆపరేషన్ సిందూర్‌లో రాఫెలే హీరో, మరిన్ని మల్టీ రోల్ యుద్ధ విమానాలు కొంటాం: వాయుసేన
- ఎయిర్ మార్షల్ నగేష్ కపూర్ వెల్లడి



## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

- మహాశివరాత్రి భక్తులకు ఇబ్బంది లేకుండా ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు
- రాష్ట్రంలోని 43 శైవక్షేత్రాలకు 2,243 ప్రత్యేక బస్సులు
- ప్రభుత్వ ఆదేశాల ప్రకారం మహిళలకు ఉచిత రవాణా సదుపాయం




హైదరాబాద్

మహాశివరాత్రికి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా తెలంగాణ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. రాష్ట్రంలోని వివిధ శైవక్షేత్రాలకు టీజీఎస్ఆర్టీసీ 2243 ప్రత్యేక బస్సులు నడపాలని నిర్ణయించింది. శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249 స్పెషల్ సర్వీసులు నడిపిస్తోంది. ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అదనపు చార్జీలు ఉంటాయని ఆర్టీసీ - మిగతా3లో



## కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్

- బ్యాంకులు, స్కూల్స్, కాలేజీలు తెరిచే ఉంటాయా?
- కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక, కర్షక విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్
- సమ్మెకు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు
- 30కోట్ల మంది పాల్గొనే ఛాన్స్
- కేరళ, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో భారత్ బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం
- ఈ భారత్ బంద్ వల్ల బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు, రవాణా సేవలు ప్రభావితం అయ్యే ఛాన్స్

వివరాలు 2లో..

### సీఎం రేవంత్‌కు మున్సిపల్ ఎన్నికల్లో

## ఓటమి భయం పట్టుకుంది

- రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్యకాండకు దిగారు
- కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు.

హైదరాబాద్

తెలంగాణ మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతో సీఎం రేవంత్‌రెడ్డి ఇంతటి దౌర్జన్యకాండకు దిగారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ముగిసిన తరుణంలో బీఆర్ఎస్ శ్రేణులకు కృతజ్ఞతలు తెలుపుతూ ఆయన ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు. ఆ ట్వీట్‌లో మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఎన్ని అరాచకాలు చేసినా వీరోచితంగా పోరాడిన గులాబీ సైనికులందరికీ పేరుపేరునా హృదయపూర్వక అభినందనలు. ఆదిలాబాద్ నుంచి ఆలంపూర్ వరకూ పురపాలక సమరంలో మీరు కనబరిచిన పోరాట - మిగతా3లో





## దేశం అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోంది

- లోక్‌సభలో రాహుల్‌గాంధీ వ్యాఖ్యలపై కేంద్రమంత్రి ఫైర్
- అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గింది
- ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారు
- భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మాత్రమే మేలు చేసేలా ఉందనేందుకు ఆధారాలు చూపాలి

# ప్రశాంతంగా పోలింగ్

- పలుచోట్ల స్వల్ప ఘర్షణలు
- రాష్ట్రవ్యాప్తంగా 116 పుర, 7 కార్పొరేషన్లలో ముగిసిన పోలింగ్
- పలుచోట్ల స్వల్ప ఘర్షణలు
- ఉదయం మందకొడిగా సాగినా మధ్యాహ్నం తరువాత ఊపందుకున్న పోలింగ్
- వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ పర్యవేక్షించిన ఈసీ
- నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు
- 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనా



హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో పుర, నగరపాలక ఎన్నికల్లో ఓటరు చైతన్యం వెల్లివిరిసింది. 116 మున్సిపాల్టీలు, 7 కార్పొరేషన్లలోని 2,981 వార్డుల్లో పోలింగ్ నిర్వహించగా అక్కడక్కడ చెదురు మదురు ఘటనలు మినహా ఓటింగ్ ప్రశాంతంగా సాగింది. సాయంత్రం 5 గంటల లోపు క్యూలైన్లలో ఉన్నవారికి ఓటు వేసే అవకాశం కల్పించారు. నాయకులు, యువత, వృద్ధులు, మహిళలు ఉత్సాహంగా పోలింగ్ కేంద్రాలకు తరలివచ్చి తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 60 శాతానికి మించి పోలింగ్ నమోదైనట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. ఫిబ్రవరి 13వ తేదీన ఓట్ల లెక్కింపు అనంతరం అభ్యర్థుల భవితవ్యం తేలనుంది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లకు నిర్వహించిన ఎన్నికలు చెదురుమదురు ఘటనల మధ్య ప్రశాంతంగా ముగిసింది. పోలింగ్ కోసం రాష్ట్రవ్యాప్తంగా 8,203 పోలింగ్ కేంద్రాలు, 16,031 బ్యాలెట్ బాక్సులను ఎస్ఈసీ ఏర్పాటు చేసింది. ఉదయం - మిగతా3లో

## సంపాదకీయం

# ఆలోచించే పౌరుడు ఎందుకు అవసరం?

మనిషి జీవితం కేవలం జీవించడానికే పరిమితమైతే సమాజం ముందుకు కదలదు. ఆలోచన మొదలైన చోటే సమాజానికి దిశ ఏర్పడుతుంది. ఆలోచన ఆగిపోయిన చోటే సమాజం యాంత్రికంగా మారుతుంది. నేటికాలం మనకు అపారమైన అవకాశాలను ఇచ్చింది; అదే సమయంలో అపారమైన గందరగోళాన్ని కూడా ఇచ్చింది. వినిపిస్తున్న ప్రతి మాటను నిజమని నమ్మే స్థితి, కనిపిస్తున్న ప్రతి దృశ్యానికి వెంటనే స్పందించే అలవాటు ఇవన్నీ మనిషిని ఆలోచననుంచి దూరం చేస్తున్నాయి. ఇలాంటి సమయంలో సమాజానికి అత్యంత అవసరమైనది బలమైన శరీరాలు కాదు, స్పష్టమైన ఆలోచనలు. సంఖ్యలో ఎంత మంది ఉన్నామన్నది కాదు, ఆ సంఖ్యలో ఎంత మంది ఆలోచించగలుగుతున్నారన్నదే అసలు ప్రశ్న. ఎందుకంటే ఆలోచించగలిగిన పౌరుడే తన జీవితం మాత్రమే కాదు, తన చుట్టూ ఉన్న ప్రపంచాన్ని కూడా అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ఆ ప్రయత్నమే సమాజాన్ని నిలబెడుతుంది, ముందుకు నడిపిస్తుంది. సమాజం ముందుకు సాగాలంటే సంఖ్యలే కాదు చైతన్యమూ కావాలి. జనాభా పెరగడం ఒక అంశమైతే, ఆ జనంలో ఆలోచించే మనుషులు పెరగడం మరో అంశం. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించలేని సమాజం బలంగా కనిపించినా లోపల ఖాళీగా ఉంటుంది. అందుకే ఆలోచించే పౌరుడు ఎందుకు అవసరం? అన్న ప్రశ్న నేటి కాలానికి అత్యంత ప్రాసంగికమైనది. పౌరుడు అనగానే కేవలం ఒక గుర్తింపు మాత్రమే కాదు. అతడు జీవిస్తున్న సమాజంతో, చుట్టూ ఉన్న పరిణామాలతో, తన చర్యల ప్రభావంతో అనుసంధానమై ఉండే మనిషి. ఈ అనుసంధానం ఆలోచన లేకుండా సాధ్యం కాదు. ఆలోచించని పౌరుడు తన జీవితాన్ని మాత్రమే చూస్తాడు. ఆలోచించే పౌరుడు తన జీవితంతోపాటు సమాజాన్ని కూడా చూస్తాడు. ఈ దృష్టి తేడానే సమాజ దిశను నిర్ణయిస్తుంది. నేటి కాలంలో సమాచారం విపరీతంగా పెరిగింది. ప్రతి మనిషి చేతిలో సమాచారం ఉంది. కానీ సమాచారం ఉండటం ఆలోచనకు హామీ కాదు. ఆలోచన అనేది తెలిసిన దాన్ని ప్రశ్నించగలగడం, విన్నదాన్ని తూకం వేయగలగడం, చూసినదాన్ని అర్థం చేసుకునే ప్రయత్నం చేయడం. ఈ సామర్థ్యం లేకపోతే మనిషి స్పందిస్తాడు కానీ ఆలోచించడు. స్పందన తక్షణమే వస్తుంది; ఆలోచన మాత్రం సమయం కోరుతుంది. ఆలోచించే పౌరుడు సమాజానికి ఒక సమతుల్యతను ఇస్తాడు. అతడు ఏ విషయాన్నైనా అతి ఉత్సాహంతో గాని, అతి నిర్లక్ష్యంతో గాని చూడడు. వినే ఓర్పు ఉంటుంది. అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తాడు. ప్రతి విషయాన్ని వెంటనే తీర్పుగా మార్చడు. ఈ స్వభావమే సమాజంలో ఉద్రిక్తతను తగ్గిస్తుంది, సంభాషణకు స్థలం కల్పిస్తుంది. సమాజంలో మార్పు రావాలంటే గొంతులు పెద్దగా ఉండాల్సిన అవసరం లేదు; ఆలోచనలు లోతుగా ఉండాలి. ఆలోచించే పౌరుడు తన అభిప్రాయాన్ని ప్రకటించే ముందు తన బాధ్యతను గుర్తిస్తాడు. తన మాట మరొకరిపై ఎలాంటి ప్రభావం చూపుతుందో ఆలోచిస్తాడు. ఈ బాధ్యత భావనే సమాజానికి నిజమైన బలం. చదువు ఆలోచనకు దారితీయాలి. కానీ చదువు కేవలం అక్షరాలకే పరిమితమైతే, ఆలోచన అక్కడే ఆగిపోతుంది. చదివినదాన్ని జీవితం మీద ప్రయోగించగలిగినప్పుడే పౌరుడు ఆలోచించే స్థాయికి చేరుకుంటాడు. ఈ ప్రక్రియ వ్యక్తిగత ప్రయోజనాన్ని మించి, సామూహిక మేలుకు దారితీస్తుంది. ఆలోచించే పౌరుడు ఎప్పుడూ సంపూర్ణంగా సరైనవాడే కావాల్సిన అవసరం లేదు. అతడు తప్పు చేయవచ్చు. కానీ ఆ తప్పును గుర్తించే శక్తి అతడిలో ఉంటుంది. అదే అతడిని మెరుగైన పౌరుడిగా మలుస్తుంది. ఆలోచన అంటే తప్పులేని స్థితి కాదు; తప్పుల నుంచి నేర్చుకునే స్థితి. నేటి సమాజానికి అవసరమైనది ఎక్కువ మంది మాట్లాడే పౌరులు కాదు; ఎక్కువ మంది ఆలోచించే పౌరులు. మాటలు సమాజాన్ని కదిలిస్తాయి; ఆలోచనలు సమాజాన్ని దారిలో పెడతాయి. ఈ తేడాను గుర్తించినప్పుడు మాత్రమే సమాజం స్థిరంగా, సుస్థిరంగా ముందుకు సాగుతుంది. చివరికి ఆలోచించే పౌరుడు సమాజానికి ఒక కాపలాదారుడిలాంటి వాడు. అతడు నియంత్రించడు; గుర్తు చేస్తాడు. ఆలోచనను ఆపడు; ప్రశ్నలను కొనసాగిస్తాడు. ఈ కొనసాగింపే సమాజాన్ని జీవవంతంగా ఉంచుతుంది. అందుకే ఆలోచించే పౌరుడు నేటికే కాదు, ప్రతి కాలానికీ అవసరం. ఆలోచించే పౌరుడు రూపుదిద్దుకోవడం ఒక రోజు జరిగే ప్రక్రియ కాదు. అది కుటుంబంలో మొదలై, విద్యలో పెరిగి, అనుభవాల్లో పక్వతకు చేరుతుంది. చిన్నప్పటి నుంచే ప్రశ్న అడగడానికి ఇచ్చే స్వేచ్ఛ, భిన్న అభిప్రాయాలను వినే అలవాటు, తప్పును ఒప్పుకునే సంస్కారం ఇవన్నీ కలిసినప్పుడే ఆలోచన ఒక స్వభావంగా మారుతుంది. ఆలోచనను భయపడే వాతావరణంలో పౌరుడు విధేయుడిగా మారవచ్చు కానీ బాధ్యతగలవాడిగా మారలేడు. సామాజిక జీవనంలో ఆలోచించే పౌరుడి పాత్ర మౌనంగా ఉంటుంది కానీ ప్రభావం లోతుగా ఉంటుంది. అతడు ప్రతి విషయంపై అభిప్రాయం చెప్పాల్సిందే అన్న ఆతృతకు లోనుకాడు. అవసరమైన చోట మాత్రమే మాట్లాడతాడు. మాట్లాడనప్పుడు కూడా గమనిస్తూనే ఉంటాడు. ఈ గమనమే సమాజానికి అవసరమైన సమతుల్యతను కాపాడుతుంది. ఎందుకంటే ప్రతి మాటకు ప్రతిమాట రావడం సంభాషణ కాదు; ఆలోచన ఆగిపోవడమే. ఆలోచించే పౌరుడు తన హక్కుల గురించి మాత్రమే కాదు, తన కర్తవ్యాల గురించి కూడా అంతే స్పష్టంగా ఆలోచిస్తాడు. హక్కులు కోరడం సులభం; బాధ్యతను మోసుకోవడం కష్టం. కానీ సమాజం నిలబడేది ఈ కష్టమైన దారిపైనే. ఆలోచన ఈ దారిని చూపిస్తుంది. ఆ దారిలో నడవడం పౌరుడి పరిపక్వతను తెలియజేస్తుంది. ఈ ప్రక్రియలో సాహిత్యం, పుస్తకాలు, ఆలోచనాత్మక చర్చలు కీలక పాత్ర పోషిస్తాయి. అవి సిద్ధాంతాలను బోధించవు; మనిషిని తనతో తాను మాట్లాడేలా చేస్తాయి. ఆ అంతర్ముఖ సంభాషణ నుంచే ఆలోచించే పౌరుడు బయటకు వస్తాడు. బయట కనిపించే చర్యలకు ముందుగా లోపల ఏర్పడే ఈ సంభాషణే నిజమైన చైతన్యం. చివరికి ఆలోచించే పౌరుడు సమాజానికి నాయకుడిగా ఉండాల్సిన అవసరం లేదు. అతడు ఒక సాధారణ మనిషిగా ఉండవచ్చు. కానీ అతడి ఆలోచనల ప్రభావం అసాధారణంగా ఉంటుంది. ఎందుకంటే సమాజాన్ని మార్చేది ఒక్కొక్కరి ఆలోచనలే. ఆలోచించే పౌరులు పెరిగినప్పుడు సమాజం మారుతుంది. ఆ మార్పే నిశ్శబ్దంగా, కానీ స్థిరంగా కొనసాగుతుంది. ఆలోచించే పౌరుడు ఎక్కడా గొడవ కోరడు; కానీ అవసరమైన చోట ఆలోచనను ఆపనివ్వడు. ఈ ఆలోచనలే సమాజానికి దిక్సూచి. అవే సమాజాన్ని చీకటి నుంచి వెలుగులోకి నడిపించే నిశ్శబ్ద శక్తి. అందుకే ఆలోచించే పౌరుడి అవసరం నినాదంగా కాదు, జీవనశైలిగా

# విశాఖ ఉక్కు ఉద్యమానికి ఐదేళ్లు



విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు నినాదంతో పెద్ద ఎత్తున ఉద్యమించి సాధించుకున్న విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు సిద్ధమైన నేపథ్యంలో, కేంద్ర ప్రభుత్వ వైఖరికి, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా మరో ఉద్యమానికి తెర లేచి ఐదేళ్లు అయింది.విశాఖ పట్టణంలో ఉక్కు పరిశ్రమ కోసం జరిగిన ఉద్యమం.... ఈ ఉద్యమాన్ని తెన్నేటి విశ్వనాథం నాయకుడై ముందుండి నడిపించారు. తాటికొండ ఎమ్మెల్యే టి. అమృత రావు, ప్రత్తి శేషయ్య లాంటి నాయకులు ఈ ఉద్యమంలో పాల్గొ న్నారు. ఈ ఉద్యమంలో భాగంగా 32 మంది ప్రాణాలర్పించారు. విశాఖ ఉక్కు - ఆంధ్రుల హక్కు అంటూ తెన్నేటి విశ్వనాథం నడిపిన ఉద్యమ ఫలితంగా, నాటి దేశ ప్రధాని ఇందిరా గాంధీ 1970 ఏప్రిల్ 10 విశాఖ పట్నంలో ఉక్కు కర్మాగారాన్ని నెలకొల్ప నున్నట్లు పార్లమెంటు లో ప్రకటించింది. కర్మాగారం కోసం కురుపాం జమీందారులు 6000 ఎకరాలను 1970లో దానం చేసారు. 1970 జూన్ లో ఏర్పాటు చేసిన స్థల పరిశీలన కమిటీతో కర్మాగారపు ప్రణాళికలు మొదల య్యాయి. 1971 జనవరి 20న ఇందిరా గాంధీ చేత కర్మాగారం యొక్క శంకు స్థాపన కార్యక్రమం జరిగింది. 26 వేల ఎకరాల విస్తీర్ణంలో ఈ కర్మాగారం ఏర్పాటు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి 10వేల కోట్ల రూపాయలతో 20 ఎకరాల భూమి నిచ్చి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సహకరించింది. 1977 లో నిర్మాణం మొదలైంది. 1979లో రష్యాతో ఒప్పందం కుదుర్చు కున్నారు. రూ.3897.28 కోట్ల అంచనా తో 3.4 మిలియన్ టన్నుల సామర్థ్యం గల కర్మాగార నిర్మాణం ప్రారంభించారు. కానీ నిర్మాణంలో ఎన్నో అడ్డంకులు ఎదురు కావడం, ప్రభుత్వాలు మారడం వలన ఇది పూర్తవ డానికి 20 ఏళ్లు పట్టింది. పూర్వ సంయుక్త రష్యా సహకారంతో నివేదికలో అనేక మార్పులు చేర్పులు జరిగాయి. నాటి సీఎం బ్రహ్మానంద రెడ్డి కృషికి 1980లో ఇందిరా గాంధీ చొరవ తోడై, ఫలితంగా 80 నుండి 1983 వరకు విశాఖ ఉక్కు కర్మాగారం వేగం పుంజుకుంది. రష్యాతో సాంకేతిక ఒప్పందం చేశారు. 1980 నవంబరులో దస్తూర్ ఉ కో సమగ్ర నివేదిక సమర్పిం చింది. కోక్ ఒవెన్, సెగ కొలిమి, సింటర్ ప్లాంట్ల రూప కల్పనకై పూర్వపు రష్యా దేశంతో 1981 ఫిబ్రవరిలో ఒప్పందం కుదిరింది. 1982 జనవరిలో సెగ కొలిమి నిర్మాణానికి, ఉద్యోగస్థుల పట్టణానికి శంకు స్థాపన జరిగింది. 1982 ఫిబ్రవరిలో రాష్ట్రీయ ఇస్పాత్ నిగం లిమిటెడ్ (ఖీఎఔఒ) ఏర్పడింది. 1982 ఏప్రిల్ నెలలో వైజాగ్ స్టీల్, భారతీయ ఉక్కు సంస్థ (ూంఎఒ) నుండి విడివడి ఖీఎఔఒ గా గుర్తింపు పొందినది. వైజాగ్ స్టీల్ గా ప్రసిద్ధమైన విశాఖ ఉక్కు కర్మాగారం భారతదేశం లోని అత్యాధునిక మైన ప్రభుత్వరంగ ఉక్కు తయారీ దారు. ఇది, విశాఖ పట్టణం నగరానికి దాదాపు 26 కిలోమీటర్ల దూరంలో, జర్మనీ, సోవియ ట్ రష్యాల సాంకేతిక సహకారంతో నిర్మించ బడింది. 1987 డిసెంబరు నాటికి కర్మాగారం నిర్మాణం పూర్తయ్యింది. 1990 సెప్టెంబరులో ఉత్పత్తి ప్రారంభ మైంది. అప్పటికి నిర్మాణ వ్యయం రూ.9 వేల కోట్లకు చేరుకుంది. 1992 ఆగస్టు 8న అప్పటి ప్రధాని పి.వి. నరసింహా రావు విశాఖ ఉక్కు కర్మాగారాన్ని జాతికి అంకితం చేశారు. మొదట్లో ఉక్కు ఉత్పత్తిలో దేశంలోనే మొదటగా నిలిచింది. 1994లో మొదటి సారిగా రూ.50 కోట్ల నికర లాభాలను ఆర్జించింది. కానీ కర్మాగారం నిర్మాణం కోసం నిధులు లేక పోవడంతో ఇతర సంస్థలపై ఆధార పడటంతో 1998-2000 సంవత్సరంలో ఖాయిలా పరిశ్రమగా మిగిలింది. ఈ సందర్భంగా ఉక్కు కార్మిక సంఘాలు అనేక ఉద్యమాలు చేపట్టడంతో కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి ఉక్కు వడ్డీలను ఈక్విటీగా మార్చడం జరిగింది. ఆ తర్వాత ఉక్కు ఉత్పత్తిలో అగ్రగామిగా ఉంటూ ప్రపంచ శ్రేణి ఉక్కు కర్మాగారంగా నిలబడింది. కర్మాగారం యొక్క ఉత్పత్తులు మన్నిక కలిగినవిగా దేశ విదేశాలలో పేరుగన్నవి. సంస్థ రాబడిలో 80% జపాన్, జర్మనీ, అమెరికా సంయుక్త రాష్ట్రాలు, దుబాయ్, సింగపూర్, ఆస్ట్రేలియా, దక్షిణ అమెరికా దేశాలకు చేయ బడుతున్న ఎగుమతుల ద్వారానే వస్తున్నది. 33వేల ఎకరాలలో విస్తరించి ఉన్న వైజాగ్ స్టీల్, భారత దేశంలో తీర ప్రాంతంలో ఉన్న ఏకైక ఉక్కు కర్మాగారం. 3.6 ఎం. టి గా ఉన్న ఉత్పత్తి సామర్థ్యాన్ని 6.3ఎం. టి కి పెంచే రూ. 8,692 కోట్ల విస్తరణ ప్రాజెక్టును నాటి ప్రధాని మన్మోహన్ సింగ్ 2009 మే 29న ప్రారంభించారు. మన్మోహన్ సింగ్ ప్రధాన మంత్రి పాలనలో దాని ఉత్పత్తి సామర్థ్యం పెంచారు. 2010 నవంబరు 10న నవరత్న హోదా పొందినది. కర్మాగారం విస్తరించి ఉన్న ప్రాంతం, భారత దేశం, ఆసియా మైనర్ లలోనే అతి పెద్దది. సంవత్సరానికి 21 మిలియన్ టన్నుల సామర్థ్యం ఉన్నప్పటికీ, విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ముడి పదార్థాల కొరత, కొవిద్ 19 మహమ్మారి, మార్కెట్ తిరోగ మన కారణాల వల్ల 7.3 మిలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంకు తగ్గింది. విశాఖ స్టీల్ ప్లాంట్ కు స్వంత ఇనుప ఖనిజం గనులు లేక పోవడం వల్ల ఏటా విశాఖ స్టీల్ సుమారు మూడు వేల కోట్లు ఇనుప ఖనిజం కోసం అదనంగా ఖర్చు చేస్తున్నది. టాటా స్టీల్, స్టీల్ అథారిటీ ఆఫ్ ఇండియా, జిందాల్ స్టీల్, ఇతర ప్లాంట్లకు... స్వీయ ముడి సరుకు సమకూర్పు లేకుండా, నేషనల్ మినరల్ కార్పొరేషన్ నిర్వహణ లో బైలాదిలా గనులు, ఆస్ట్రియా నుండి ముడి బొగ్గు సరఫరాపై విశాఖ ప్లాంట్ ఆధార పడి ఉండడం వల్ల సమస్యలు ఎదురవు తున్నాయి. ఇలా మరో రెండేళ్ల పాటు నష్టాలు రావడం తథ్యమనే భావనతో, కేంద్రం ప్రైవేటీకరణ నిర్ణయం తీసుకుంది.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సీమాంధ్ర, తెలంగాణకు చెందిన నేతలు పోరాటాలు, కొందరి ప్రాణ త్యాగంతో పోరాడి సాధించుకున్న విశాఖ ఉక్కు సంస్థ నేడు ప్రైవేటు పరం కావడాన్ని ప్రజలు జీర్ణించు కోలేకపోతున్నారు. వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ అంశం విషయంలో అన్ని రాజకీయ పార్టీలు ఏకతాటిపైకి వచ్చాయి. "విశాఖ ఉక్కు ఆంధ్ర ప్రదేశ్ ప్రజల హక్కు" అనే నినాదం రాష్ట్ర వ్యాప్తంగా వినిపిస్తోంది. వైజాగ్ స్టీల్ ను ప్రైవేటీకరణ చేయవద్దంటూ అధికార వైఎస్ఆర్సీపీ తో పాటు టీడీపీ, వామపక్షాలు గళమెత్తాయి. సెంటర్ ఫర్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సిఐటియు), ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఎఐటియుసి), ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ (ఐఎన్‌టియుసి) లతో కూడిన ఉమ్మడి కార్యాచరణ కమిటీ (జెఏసి) పేరిట ఉద్యోగులు ప్రైవేటీకరణ చర్యకు వ్యతిరేకంగా ఆందోళనను ఉధృతం చేసే కార్యాచరణ చేపట్టారు. విశాఖ స్టీలు కర్మాగారాన్ని అమ్మాలనే కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలను మూడేళ్ల కాలంగా ఎదిరిస్తునే ఉన్నారు.. నిరసన గళాలు ప్రకటిస్తూనే ఉన్నారు. ఆంధ్రుల ఆత్మ గౌరవం పేరిట అన్ని ప్రాంతాలలో అఖిల పక్ష సమావేశాలు, కోటి సంతకాల సేకరణ ఉద్యమాల లాంటివి నానాటికీ ఉద్ధృతం అవుతున్నాయి. విశాఖ ఉక్కు కర్మాగారం ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా ఉద్యమం పురుడు పోసుకుని, ఫిబ్రవరి 12వ తేదీ నాటికి ఐదేళ్లు పూర్తి అయింది. కేంద్ర ప్రభుత్వం ప్రైవేటీకరణ నిర్ణయం వాపసు తీసుకో వాలని, తీసుకునే వరకూ దీర్ఘకాలిక పోరాటం కొనసాగు తుందని ఆందోళన కారులు స్పష్టం చేస్తూ, ధృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నారు.

# జీవపరిణామ సిద్ధాంత కర్త డార్విన్




డార్విన్ పేరును తలుచుకుంటే ఎవరికైనా వెనువెంటనే గుర్తుకు వచ్చేది పరిణామ సిద్ధాంతం. భూమిపై జీవజాలము ఏ విధంగా పరిణామక్రమం చెందినది అనే విషయముపై పరిశోధనలు చేసి, జీవ పరిణామ సిద్ధాంతాన్ని ప్రతిపాదిం చాడు అయన. ప్రకృతిలో జీవజాతులు వేటికవే ఏక కాలంలో రూపొందినట్లు ఎంతో కాలం నుండి నమ్ముతూ వస్తున్న ప్రజానీకానికి - అదంతా వాస్తవం కాదని ఒక మాతృక నుంచి సకల జీవరాశులు క్రమానుగతంగా పరిణామం చెందుతూ ఏర్పడతాయని, ఈ చర్య అనంతంగా కొనసాగుతూ ఉంటుం దని మొట్ట మొదటి సారిగా వివరించినవాడు చార్లెస్ డార్విన్ మాత్రమే. వానరుని నుంచి నరవానరుడు, నరవానరుని నుంచి నరుడు పరిణామ పరంగా ఉద్భవించాడని తెలిపి సంచలనం రేపిన ప్రకృతి శాస్త్రవేత్త చార్లెస్ డార్విన్. చార్లెస్ రాబర్ట్ డార్విన్ (ఫిబ్రవరి 12, 1809 ? ఏప్రిల్ 19, 1882) ఇంగ్లాండుకు చెందిన ప్రకృతివాది.డార్విన్ 1809 ఫిబ్రవరి 12న ఇంగ్లండులోని ష్రూస్‌బరీలో జన్మించాడు. వైద్యుడైన తండ్రి అన్ని సదుపాయాలూ సమకూర్చినా చదువులో రాణించలేదు. ఆయనను మంద బుద్ధిగా ఉపాధ్యాయులు భావించేవారు. ఆయన చిన్ననాటి నుండి కీటకాలను, ఖనిజాలను సేకరిస్తూ రసాయనిక శాస్త్రంలో పరిశోధనలు చేస్తూ ఉండేవాడు. 16 యేండ్ల వయస్సులో వైద్య విద్యను చదవటం కోసం ఆయనను ఎడిన్ బర్గ్ విశ్వ విద్యాలయంలో చేర్పించారు. కాని మత్తు మందులు లేకుండా చేస్తున్న ఆపరేషన్లను చూచి, ఆ చిత్రహింసకు ఆయన కలత చెంది వైద్య విద్యపై మనసు పెట్టి చదవలేక పోయాడు. ఏదో ఒక డిగ్రీ సంపాదించాలనే తండ్రి కోరికపై కేంబ్రిడ్జ్‌లో తత్త్వశాస్త్ర అధ్య అధ్యయనంలో చేరినా అక్కడా అదే పరిస్థితి. అక్కడి ప్రొఫెసర్ ఓసారి అతడికి 'బీగల్' అనే ఓ నౌక కెప్టెన్ కు పరిచయం చేశాడు. వివిధ దేశాల్లో, దీవుల్లో ఉండే జీవుల పరిశీలనకు అవకాశం ఉంటుందనే ఆలోచనతో డార్విన్ తన తండ్రి వద్దంటున్నా వినకుండా ఆ ఓడ ఎక్కేశాడు. ఆ నౌకాయానంలో డార్విన్ అనేక ప్రాంతాల్లో మొక్కలు, రాళ్ళు, శిలాజాలు, కీటకాలు, జంతువులను పరిశీలించి చాలా నమూనాలను సేకరించి ఇంటికి పంపుతూ వచ్చాడు. ఆ పరిశీలనల ఆధారంగానే జీవజాతుల పరిణామ క్రమంపై పుస్తకం రాశాడు. 150 సంవత్సరాల క్రితం రాసిన ఈ గ్రంథం ఇప్పటికీ ప్రామాణికంగా నిలిచి ఉంది. జీవుల్ని ఏదో అతీత శక్తి ఏకకాలంలో సృష్టించ.లేదని, అవి వివిధ దశల్లో స్వాభావిక ఎంపిక ద్వారా పరిణామం చెందాయని డార్విన్ సిద్ధాంతం చెబుతుంది. ఇది ఇప్పటి మైక్రో బయాలజీ, జెనిటిక్స్, మాలిక్యులర్ బయాలజీలను సంఘటిత పరచడంలోనూ, డీఎన్ఏ పరీక్షల్లోనూ ప్రముఖ పాత్ర వహిస్తోంది. చార్లెస్ డార్విన్ ప్రతిపాదించిన డార్విన్ జీవపరిణామ సిద్ధాంతం భూమి మీది జీవుల పరిణామ క్రమాన్ని తెలియజేస్తుంది. ఆధునిక జీవ శాస్త్రంలో "డార్వినిజం" చాలా మార్పు తెచ్చింది. మూఢ నమ్మకాలను విభేదించడంలో కూడా డార్వినిజం కీలక పాత్ర పోషించింది. మనిషి ఒక రకమైన కోతి జాతి నుంచి పరిణామం చెందుకుంటూ వచ్చాడని, మనిషిని దేవుడు సృష్టించలేదన్న సిద్ధాంతాన్ని తెర మీదకు తెచ్చింది. ఇప్పుడు కూడా సృష్టివాదం పేరుతో డార్వినిజాన్ని వ్యతిరేకించే వాళ్ళు ఉన్నారు. డార్విన్ జీవ పరిణామ సిద్ధాంతం మార్క్సిస్ట్ చారిత్రక భౌతికవాద రచనలకి కూడా ఊపిరి పోసింది. మలేషియా నుంచి రసెల్ వాలేస్ (1823-1913) అనే వ్యక్తి పంపిన సిద్ధాంత వ్యాసం డార్విన్ వ్యాసం ఒకే విధంగా ఉన్నాయి. డార్విన్ 1844లో తన రచనను, వాలేస్ పంపిన వ్యాసాన్ని లియన్ సొసైటీ జర్నల్‌కు అందచేశాడు. 1858 జూలై 15న శాస్త్రవేత్తల సమావేశం జరిగింది. ఇరువురి వ్యాసాలు పరిశీలించారు. 1844లో డార్విన్ మొదలు పెట్టగా, వాలేస్ 1858లో రాశాడు. కనుక డార్విన్ ముందు రాసినట్టు నిర్ధారించారు. ప్రస్తుతం ప్రపంచంలో కనబడుతున్న రకరకాల ప్రాణులు మొదటి నుంచీ లేవనేది ఈ సిద్ధాంతం యొక్క ప్రధానమైన వాదన. కుక్కలూ, నక్కలూ, తోడేళ్ళూ ఒక జాతివనీ, పిల్లులూ, చిరత పులులూ, పెద్ద పులులూ, సింహాలూ మరొక జాతికి చెందినవనీ, గుర్రాలూ, గాడిదలూ, జీబ్రాలూ ఒకలాంటివే. గతంలో వీటికి తలొక "పూర్వీకుడూ" ఉండి ఉండాలి. ఇంకా వెనక్కెళితే ఈ "ఆదిమ" శునకానికీ, మార్జాలానికీ, అశ్వానికీ జన్మనిచ్చిన మరేదో మృగం ఉండి ఉంటుంది. ఇంకా ప్రాచీన యుగంలో ఈ క్షీరదాలకీ, తక్కిన చేపలూ, తాబేళ్ళూ, జలచరాలూ, పక్షులూ అన్నిటి ఆవిర్భావానికీ దారితీసిన ప్రాణి ఏదో ఉండే ఉంటుంది. వీటిలో కొన్ని శాకాహారులుగా, మరికొన్ని మాంసాహారులుగా రూపొందడానికి భౌతిక ప్రేరణలూ, పర్యావరణ పరిస్థితులే కారణాలు అయి ఉంటాయి. ఇన్నిరకాల ప్రాణులు "వాటంతట అవే" ఎలా ఉద్భవిస్తాయని వీరి వాదన సాగిపోతుంది. ఉదాహరణకు ఆఫ్రికాలో పుట్టుకొచ్చిన మానవ జాతి క్రమంగా ఉత్తర దిశగానూ, తక్కిన ప్రాంతాలకీ విస్తరించిందని శాస్త్రవేత్తలు ఊహిస్తున్నారు. ఉష్ణోగ్రత దృష్ట్యా తొలి మానవులు నల్లని రంగులో ఉండి ఉంటారని అనుకోవచ్చు. ఉత్తరాన ఎండపొడ తక్కువగా పడే ప్రాంతాలకు వెళ్ళినవారి చర్మం తెల్లగా మారక తప్పలేదు. పూర్తిగా నల్లరంగులో ఉన్న ఒక మానవ సమూహం తెల్లగా మారి పోవడానికి 20 వేల సంవత్సరాలు సరిపోతాయని అంచనా. తక్కిన జంతువుల సంగతి ఎలా ఉన్నా, ఒక్క మనిషి జాతినే తీసుకుంటే, చర్మం రంగూ, ముఖ కవళికలూ అన్నీ మెల్ల మెల్లగా మారడానికి జీవపరిణామ ప్రక్రియలే కారణమని రుజువు అవుతోంది. సరిగ్గా ఆ సమయంలోనేఆల్ఫ్రెడ్ రస్సెల్ వాలెస్ అనే మరో శాస్త్రవేత్త కూడా డార్విన్ చెప్పిన సిద్ధాంతాన్నే వెలువరించాడు. డార్విన్ కు ఉత్తరం కూడా రాసాడు. 1858 లో వీరిద్దరూ సంయుక్తంగా ఒక పరిశోధనా పత్రాన్ని సమర్పించారు. కూడా! 1859 లో ప్రపంచ ప్రసిద్ధి పొందిన "ది ఆరిజన్ ఆఫ్ స్పీసిస్ ఆఫ్ నేచురల్ సెలక్షన్" పుస్తకాన్ని చార్లెస్ డార్విన్ వెలువరించాడు. ఈ పుస్తకం విడుదలైన రోజునె అన్ని ప్రతులూ అమ్ముడు పోయి సరికొత్త రికార్డును సృష్టించింది. పరిణామ సిద్ధాంతం జీవజాతుల మధ్య సంఘర్షణ ఉంటుంది. సజాతి సంఘర్షణ, విజాతి సంఘర్షణ, ప్రకృతిలో సంఘర్షణ. ఈ సంఘర్షణలో నెగ్గినవే ప్రకృతి ఎన్నిక చేసిన సార్థకమ జీవులు. ఇవే మనుగడను సాగిస్తాయి. ఈ జీవులలోని వైవిధ్యాలే తరాలు మారుతూ పోగా కొత్త జాతుల ఉత్పన్నానికి మూలాధారాలు అవుతాయి. ఇది సంక్షిప్తంగా డార్విన్ పరిణామ వాదం. అయితే సృష్టి సిద్ధాంత వాదులు ఈయన వాదనను సమర్థించరు. అయితే బైబిల్ లో చెప్పినట్లు ఏడు రోజుల లోనే సమస్త సృష్టి, సకల జీవ జలాలు రూపొందించ బడినాయని చెబితే మాత్రం నమ్మడం కష్టం.చార్లెస్ డార్విన్ స్వంత దేశమైన బ్రిటన్ లో డార్వినిజం ఎన్నో ప్రశంశలు అందుకుంది. డార్వినిజం ప్రపంచంలో ఎంతో మంది భౌతిక శాస్త్రవేత్తలని, జీవ శాస్త్రవేత్తలని ప్రభావితం చేసి అధునిక భౌతిక శాస్త్ర విజ్ఞానాన్ని ఎన్నో మలుపులు తిప్పింది. అయితే కొన్ని క్రైస్తవ, ఇస్లామిక్ దేశాలలో డార్వినిజం చాలా వివాదాస్పద మయ్యింది. సృష్టి వాదాన్ని వ్యతిరేకించడం దైవ ద్రోహం అని మతవాదుల వాదన. కొన్ని ఇస్లామిక్ దేశాలలో ఈ సిద్ధాంతాన్ని నిషేదించారు. ఈ సిద్ధాంతం తప్పని, జీవ పరిణామక్రమం జరగలేదని వాదించే వారు కూడా ఉన్నారు. ఈయన 74 యేండ్ల వయస్సులో మృతి చెందాడు. సర్ ఐజాక్ న్యూటన్ సమాధి దగ్గరే ఆయన కూడా సమాధి చేయ బడింది. డార్విన్ లేకపోయినా ఆయన ప్రతిపాదించిన జీవ పరిణామ సిద్దాంతం ఎప్పటికీ నిలిచే ఉంటుంది.

# కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా భారత్ బంద్



కార్మికులు, రైతులకు వ్యతిరేకంగా కేంద్ర ప్రభుత్వ తీసుకుంటున్న విధానాలకు నిరసిస్తూ రైతు సంఘాలతో పాటు అనేక కార్మిక సంఘాలు గురువారం (ఫిబ్రవరి 12) భారత్ బంద్‌కు పిలుపునిచ్చాయి. ఈ క్రమంలో గురువారం తెల్లవారుజాము నుంచి సాయంత్రం వరకు జరిగే దేశవ్యాప్త సమ్మెలో 30 కోట్ల మంది కార్మికులు పాల్గొంటారని అంచనా. ఈ భారత్ బంద్ వల్ల బ్యాంకులు, పాఠశాలలు, కళాశాలలు, రవాణా సేవలు ప్రభావితం అయ్యే ఛాన్స్ ఉంది.

**బంద్‌కు పిలుపునిచ్చిన కార్మిక సంఘాలు**

భారత్ బంద్‌కు కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్ ఆల్ ఇండియా ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్ ఇండియన్ నేషనల్ ట్రేడ్ యూనియన్ కాంగ్రెస్, హింద్ మజ్దూర్ సభ, అనేక ఇతర ప్రధాన కార్మిక సంఘాలు సంయుక్తంగా పిలుపునిచ్చాయి. భారత్-అమెరికా తాత్కాలిక వాణిజ్య ఒప్పందాన్ని నిరసిస్తూ సంయుక్త కిసాన్ మోర్చా (రాఖవీ), ఇతర రైతు సంఘాలు కూడా బంద్‌కు సంపూర్ణ మద్దతును ప్రకటించాయి. ఈ ట్రేడ్ డీల్ ప్రకారం అమెరికా ఉత్పత్తులు చౌకగా భారత్ మార్కెట్లలోకి వస్తాయని, దీంతో మనదేశంలోని అన్నదాతలు తీవ్రంగా నష్టపోతారని రైతు సంఘాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. అలాగే వామపక్ష పార్టీలు, తమిళనాడుకు చెందిన వీసీకే (విదుతలై చిరుతైగల్ కట్చి), డీఎంకే వంటి రాజకీయ పార్టీలు కూడా భారత్ బంద్‌కు సంఘీభావం ప్రకటించాయి. ఈ బంద్‌లో ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొనాలని కోరాయి.

**కేంద్ర విధానాలకు వ్యతిరేకంగా బంద్**

సమ్మె కేవలం భారత్-అమెరికా వాణిజ్య ఒప్పందం గురించి మాత్రమే కాదని, కేంద్ర ప్రభుత్వ విధానాల గురించి కూడా అని యూనియన్ నాయకులు తెలిపారు. నాలుగు కొత్త కార్మిక కోడ్‌లను రద్దు చేయాలని, అవి కార్మికుల హక్కులను బలహీనపరుస్తున్నాయని ఆరోపించారు. విత్తన బిల్లు, విద్యుత్ సవరణ బిల్లులను కేంద్రం ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎంజీనరేగా స్కీమ్‌ను పునరుద్ధరించాలని కోరుతున్నారు. ప్రైవేటీకరణను ఆపాలని, కార్పొరేట్ అనుకూల సంస్కరణలను తీసుకురావొచ్చని డిమాండ్ చేస్తున్నారు.

**బంద్ ప్రభావం ఎంత?**

భారత్ బంద్ నేపథ్యంలో దేశంలోని పలు ప్రాంతాల్లో బస్సులు, ఆటోలు, ట్రక్కులు సహా ప్రజా రవాణా సేవలు పూర్తిగా నిలిచిపోయే అవకాశం ఉంది. దుకాణాలు, మార్కెట్లు, వాణిజ్య కేంద్రాలు, స్కూల్స్, కాలేజీలు, ప్రభుత్వ కార్యాలయాలు మూతపడే ఛాన్స్ ఉంది. అయితే ఆస్పత్రులు, అంబులెన్స్‌లు వంటి అత్యవసర సేవలకు ఎటువంటి అంతరాయం ఉండకపోవచ్చు.

అలాగే ఆల్ ఇండియా బ్యాంక్ ఎంప్లాయీస్ అసోసియేషన్ , ఆల్ ఇండియా బ్యాంక్ ఆఫీసర్స్ అసోసియేషన్ , బ్యాంక్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా వంటి యూనియన్లు కూడా భారత్ బంద్‌కు మద్దతు ప్రకటించాయి. అందువల్ల నగదు లావాదేవీలు, చెక్ క్లియరింగ్ వంటి కీలక సేవలు ఆలస్యం కావచ్చు. అయితే ఆర్‌బీఐ అధికారికంగా ఫిబ్రవరి 12 (గురువారం) బ్యాంకులకు ఎటువంటి సెలవు ప్రకటించలేదు. బంద్ ప్రభావంతో బ్యాంకింగ్ సేవలు కొంత మేర ప్రభావితం అయ్యే అవకాశం ఉంది.

కేరళ, ఒడిశా, కర్ణాటక వంటి రాష్ట్రాల్లో భారత్ బంద్ ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. ప్రజలందరూ సమ్మెలో పాల్గొని బంద్‌ను జయప్రదం చేయాలని ఒడిశాలోని వామపక్ష పార్టీలు కోరాయి. కార్మికులు, రైతులు, ప్రజలు ఈ బంద్‌లో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు. భువనేశ్వర్‌లో ఉమ్మడి విలేకరుల సమావేశం నిర్వహించి ఈ మేరకు వామపక్ష నేతలు వ్యాఖ్యానించారు.

**మహిళ భద్రత విషయంలో బీజేపీ విఫలం : వామపక్షాలు**

ఒడిశాలోని బీజేపీ సర్కార్ మహిళలకు నైట్ డ్యూటీలు వేస్తుందని, కానీ వారికి భద్రత కల్పించడంలో విఫలమైందని వామపక్ష పార్టీలు ఆరోపించాయి. ధాన్యం సేకరణ విషయంలోనూ ప్రభుత్వం అక్రమాలకు పాల్పడుతోందని విమర్శించాయి. ప్రభుత్వ ఉద్యోగాల నియామక పరీక్షల్లో విస్తృతంగా అవినీతి జరుగుతోందని పేర్కొన్నాయి. మోటారు వాహన సవరణ చట్టంతో ప్రజలను వేధిస్తోందని మండిపడ్డాయి. ఒడిశాలో శాంతిభద్రతలు దెబ్బతింటున్నాయని, నేరస్థులు రాజకీయ నాయకుల రక్షణలో ఉన్నారని విమర్శించాయి. "ఒడిశాలో దళితులు, గిరిజనులు, మహిళలపై దౌర్జన్యాలు పెరిగిపోయాయి. ప్రభుత్వం ఒడిశా ఖనిజ వనరులను ప్రైవేట్ సంస్థలకు అప్పగిస్తోంది. లక్షలాది మంది గిరిజనులు, దళితులు మరియు రైతులను నిర్వాసితులను చేస్తోంది. ఈ సమస్యలను లేవనెత్తడానికి అందరూ వీధుల్లోకి రావాలి." అని సీపీఐ నాయకుడు జనార్దన్ పాటి తెలిపారు.

# భారతమాతను మోదీ సర్కార్ అమ్మేసింది



భారత్ - అమెరికా మధ్యంతర ట్రేడ్ డీల్ ద్వారా భారతమాతను కేంద్ర ప్రభుత్వం అమ్మేసిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ విమర్శించారు. భారతదేశ ఇంధన భద్రతను అమెరికా చేతుల్లో పెట్టి, రైతుల ప్రయోజనాలను ఫణంగా పెట్టి సర్కారు హోల్‌సేల్‌గా సరెండర్ అయిపోయిందని ఆయన ఆరోపించారు. బుధవారం లోక్‌సభలో కేంద్ర బడ్జెట్‌పై చర్చ సందర్భంగా రాహుల్ మాట్లాడారు. భారత్ - అమెరికా మధ్యంతర వాణిజ్య ఒప్పందం ఏకపక్షంగా ఉందని, దీనివల్ల భారత రైతుల ప్రయోజనాలు దెబ్బతింటాయన్నారు. ఈ ట్రేడ్ డీల్ అమల్లోకి వస్తే, భారత మార్కెట్‌లోకి అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ప్రవాహం భారీగా పెరుగుతుందని రాహుల్ తెలిపారు.

అమెరికా వ్యవసాయ ఉత్పత్తుల ధాటికి భారత రైతులు విలవిలలాడాల్సిన దుస్థితి వస్తుందన్నారు. ఇక భారతదేశ వస్త్ర పరిశ్రమ పని అయిపోయినట్టేనని ఆయన వ్యాఖ్యానించారు. అమెరికాతో ట్రేడ్ డీల్ ఫలితంగా ఇంధన భద్రతను భారత్ కోల్పోయిందన్నారు. ఇకపై భారత్ ఎవరి నుంచి చమురును కొనాలో అమెరికాయే చెబుతుందని రాహుల్ పేర్కొన్నారు. ట్రేడ్ డీల్‌పై చర్చల సందర్భంగా, భారత్‌ను సరిసమాన భాగస్వామిగా పరిగణించాలని అమెరికా ప్రెసిడెంట్ ట్రంప్‌ను కేంద్ర ప్రభుత్వం కోరి ఉండాల్సిందన్నారు. "మీ ప్రభుత్వం భారతదేశాన్ని అమ్మేసింది. దేశాన్ని అమ్ముతున్నందుకు సిగ్గుగా లేదా ? మీరు భారత మాతను అమ్మేశారు" అని రాహుల్ కామెంట్ చేశారు.

ఎప్‌స్టీన్ ఫైల్స్ ప్రభావం మోదీపై పడి ఉండొచ్చు: రాహుల్

"అంత సాధారణంగా భారత్‌ను ప్రధాని మోదీ అమ్మేస్తారంటే నేను నమ్మను. బహుశా, ఆయనపై ఏదో బయటి ఒత్తిడి ప్రభావం పడి ఉండొచ్చు. ఎప్‌స్టీన్ ఫైల్స్ రిలీజ్ అయ్యాయని తెలిసినప్పటి నుంచి ప్రధాని మోదీ కళ్లలో భయం స్పష్టంగా కనిపిస్తోంది. వాటితో ముడిపడిన ఒత్తిడి ప్రభావం ప్రధానిపై పడిందేమో. వాళ్లు ప్రధాని మోదీని ఉక్కిరిబిక్కిరి చేసి ఉండొచ్చు. బెదిరించి ఉండొచ్చు. ఇంకో 30 లక్షలకుపైగా ఎప్‌స్టీన్ ఫైల్స్ తదుపరి విడతల్లో రిలీజ్ కావాల్సి ఉంది. గతంలో భారత వస్తు,ఉత్పత్తులపై అమెరికా 3 శాతం సుంకాన్నే విధించేది. కానీ ఇక నుంచి ఆరు రెట్లు అదనంగా 18 శాతం సుంకాన్ని విధిస్తుందట. ఇక ఇదే సమయంలో అమెరికా సరుకులపై భారత్ విధించే 16 శాతం సుంకాన్ని, సున్నాకు తగ్గిస్తారట. ఎందుకోసం ప్రధాని మోదీ ఇలాంటివన్నీ ఒప్పుకున్నారు ? ప్రస్తుతం అమెరికా నుంచి భారత్ ఏటా 46 బిలియన్ డాలర్లు విలువైన వస్తు, ఉత్పత్తులను దిగుమతి చేసుకుంటోంది. దీన్ని ఏకంగా 100 బిలియన్ డాలర్లు దాటిస్తామని ట్రంప్‌కు మోదీ ఎందుకు హామీ ఇచ్చారు ?" అని రాహుల్ గాంధీ సంచలన ఆరోపణలు చేశారు.

**మోదీ, దోవల్ చెప్పిన దానికి రివర్స్‌లో ప్రపంచం పోకడ**

"ప్రపంచంలో ఇక యుద్ధాల శకం ముగిసిందని గతంలో ప్రధాని మోదీ, జాతీయ భద్రతా సలహాదారు (ఎన్ఎస్ఏ) అజిత్ దోవల్ చెప్పారు. కానీ ప్రస్తుత పరిస్థితులు అందుకు పూర్తి భిన్నంగా ఉన్నాయి. ఆపరేషన్ సిందూర్‌ను గత సంవత్సరమే మనం చూశాం. రష్యా - ఉక్రెయిన్ యుద్ధం గత మూడేళ్లుగా జరుగుతోంది. ఇజ్రాయెల్ - గాజా సైనిక ఘర్షణను యావత్ ప్రపంచం చూసింది. ఇరాన్ లక్ష్యంగా అమెరికా కుట్రలను ఇప్పుడు చూస్తున్నాం. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలుచుకొని ప్రపంచ దేశాలపై అమెరికా ఒత్తిడిని పెంచుతోంది. అమెరికా ఆధిపత్యాన్ని, దాని డాలరు పెత్తనాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు వ్యతిరేకిస్తున్నాయి. అంటే మనం ఏకధ్రువ ప్రపంచం నుంచి బహుళ ధ్రువ ప్రపంచం దిశగా పయనిస్తున్నాం" అని రాహుల్ గాంధీ తెలిపారు.

**అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని సవాల్ చేయాలి**

"భారత ప్రభుత్వ తాజా ఆర్థిక సర్వే నివేదికలో రెండు ముఖ్యమైన పాయింట్లను ప్రస్తావించారు. అవి నాకు నచ్చాయి. ప్రపంచ దేశాల నడుమ ఉద్రిక్తతలు పెరుగుతున్నాయని, అమెరికా ఆధిపత్యాన్ని చైనా, రష్యా లాంటి దేశాలు సవాల్ చేస్తున్నాయి అనేది తొలి పాయింట్. ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి దేశాలపై దాడి చేసే పరిస్థితులు ప్రపంచంలో ఏర్పడుతున్నాయి అనేది రెండో పాయింట్. అందుకే అమెరికా ఆధిపత్యాన్ని, డాలరు పెత్తనాన్ని మనం సవాల్ చేయాలి. సింగిల్ సూపర్ పవర్ కాన్సెప్ట్‌ను ఒప్పుకోకూడదు. కానీ ఇంధన వనరులు, ఆర్థిక వనరులను ఆయుధాలుగా మలిచి భారత్‌పైకి ప్రయోగించే అవకాశాన్ని అమెరికాకు మోదీ సర్కారు ఇచ్చింది. భారత్ ఎవరి నుంచి ముడి చమురును కొనాలి అనేది, మరో దేశం(అమెరికా) వాళ్లు నిర్ణయించాలా ? భారత ప్రయోజనాలను దెబ్బతీసే ఇలాంటి నిర్ణయాలు తీసుకుంటున్నందుకు సిగ్గుగా లేదా ? " అని రాహుల్ గాంధీ మండిపడ్డారు.

**అనిల్ అంబానీని ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు ?**

"జెఫ్రీ ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో పారిశ్రామికవేత్త అనిల్ అంబానీ పేరు కూడా వచ్చింది. ఇప్పటిదాకా ఆయన్ను ఎందుకు జైలులో పెట్టలేదు ? అనిల్ అంబానీని జెఫ్రీ ఎప్‌స్టీన్‌కు పరిచయం చేసింది ఎవరు ? దీనికి కేంద్ర మంత్రి హర్దీప్ సింగ్ పురి సమాధానం చెప్పాలి. ఎప్‌స్టీన్‌కు అనిల్ అంబానీని ఎవరు పరిచయం చేశారో నాకు తెలుసు. ఈవిషయం హర్దీప్ సింగ్ పురికి కూడా తెలుసు. భారతదేశ రక్షణ రంగ బడ్జెట్‌లో కేంద్ర బిందువుగా అదానీ కంపెనీ ఉంది. ఆ కంపెనీ చెప్పినట్టుగానే రక్షణ రంగ బడ్జెట్‌ను కూర్చారు" అని రాహుల్ గాంధీ పేర్కొన్నారు.

**డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ ఫణంగా పెట్టారు**

"భారత్‌ను పాకిస్థాన్‌తో అమెరికా పోల్చి చూడటానికి వీల్లేదు. పాకిస్థాన్ ఆర్మీ చీఫ్ తనతో బ్రేక్ ఫాస్ట్ చేయాలని అమెరికా ప్రెసిడెంట్ కోరుకుంటే, అది జరిగిపోయింది. కానీ భారత్ విషయంలో అలా జరగలేదు. మేం మరోలా జవాబు ఇచ్చాం. కానీ ఇప్పుడు అదే అమెరికాతో అన్యాయమైన ట్రేడ్ డీల్‌ను మోదీ ప్రభుత్వం కుదుర్చుకుంది. చివరకు డిజిటల్ ట్రేడ్ రూల్స్‌నూ అమెరికా కోసం ఫణంగా పెట్టేందుకు కేంద్ర సర్కారు రెడీ అయిపోయింది. అమెరికా కంపెనీలు భారత్‌లో డేటా లోకలైజేషన్ చేయాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకు ఓకే చెప్పారు. భారత్ నుంచి అమెరికాకు పూర్తి ఉచితంగా డేటా బదిలీకి అనుమతులు ఇస్తామని మోదీ హామీ ఇచ్చారు. అమెరికా కంపెనీలపై విధించే డిజిటల్ ట్యాక్స్‌నూ తగ్గించేందుకు అంగీకరించారు. అమెరికా డిజిటల్ కంపెనీలు ఇకపై సోర్స్ కోడ్‌ను భారత సర్కారుకు బహిర్గతపర్చాల్సిన అవసరం లేని రూల్‌ను తెచ్చేందుకూ కేంద్ర ప్రభుత్వం రెడీ అయింది. ఆర్థిక మంత్రి నిర్మల బాగా నవ్వుతున్నారు. ఆమెకు నవ్వడం అంటే ఇష్టం. అమెరికా ప్రభుత్వం సూచించే కంపెనీలకు 20 ఏళ్ల ట్యాక్స్ హాలిడేను ఇచ్చేందుకూ కేంద్రం ఒప్పుకుంది" అని రాహుల్ గాంధీ ఫైర్ అయ్యారు.

# 'వాయు శక్తి-2026'లో ఆపరేషన్ సిందూర్ విన్యాసాలు

ఆపరేషన్ సిందూర్‌లో రాఫెల్ మల్టీ రోల్ యుద్ధ విమానాలు(ఎంఆర్ఎఫ్ఏ) హీరోల్లా పనిచేశాయని భారత ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్, ఎయిర్ మార్షల్ నగేశ్ కపూర్ కొనియాడారు. అందుకే మరిన్ని మల్టీ రోల్ యుద్ధ విమానాలను కొనాలని భారత వాయుసేన భావిస్తోందన్నారు. అయితే మళ్లీ రాఫెల్‌లనే కొనాలా, ఇతర రకాల మల్టీ రోల్ ఫైటర్ జెట్లను తీసుకోవాలా అనే దానిపై ప్రస్తుతం చర్చలు జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు. దీనిపై తుది నిర్ణయాన్ని తీసుకోవాల్సి ఉందన్నారు. రాజస్థాన్‌లోని జైసల్మీర్ సమీపంలో ఉన్న పోఖ్రాన్ ఫీల్డ్ ఫైరింగ్ రేంజ్ వద్ద ఫిబ్రవరి 27న వాయుశక్తి -2026 పేరుతో భారత వాయుసేన భారీ సైనిక విన్యాసాలు చేయబోతోంది. బుధవారం రోజు న్యూఢిల్లీలో విలేకరుల సమావేశం వేదికగా ఆ కార్యక్రమం వివరాలను నగేశ్ కపూర్ వెల్లడించారు. వాయుశక్తి విన్యాసాల్లో భాగంగా ఆపరేషన్ సిందూర్ వేళ భారత యుద్ధ విమానాలు చేసిన పలు పోరాట ఘట్టాలనూ ప్రజల కోసం ప్రదర్శిస్తామని ఆయన తెలిపారు. "ఉగ్రవాదాన్ని ఉపేక్షించేది లేదు అనే స్పష్టమైన సందేశాన్ని ఆపరేషన్ సిందూర్ ద్వారా ఇచ్చాం. భారత గడ్డపై జరిగే ప్రతీ ఉగ్రదాడికి బదులిచ్చి తీరుతాం. ఉగ్రదాదులకు తప్పకుండా తగిన మూల్యాన్ని చెల్లించుకోవాల్సి ఉంటుంది. ఆపరేషన్ సిందూర్ వేళ అత్యంత కచ్చితత్వంతో పాకిస్థాన్‌లోని ఉగ్రవాద శిబిరాలను భారత్ ఎలా ధ్వంసం చేసింది అనేది ఫిబ్రవరి 27న జరగనున్న వాయుశక్తి విన్యాసాల్లో చూపిస్తాం. ఇందుకోసం యుద్ధ విమానాల నుంచి నిర్దిష్ట ప్రదేశాల్లో బాంబులను జార విడుస్తాం. లక్ష్యంగా చేసుకున్న ప్రదేశాలను ధ్వంసం చేస్తాం. సైనిక విన్యాసాలు చేయడం మా పని. వీటి నుంచి ఎలాంటి సందేశాన్ని తీసుకోవాలి అనేది చూసేవారి ఇష్టం" అని భారత ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ నగేశ్ కపూర్ తెలిపారు.

**120 రకాల రక్షణ ఉత్పత్తులను ప్రదర్శిస్తాం**

"రాజస్థాన్‌లో నిర్వహించనున్న వాయుశక్తి విన్యాసాల్లో భాగంగా యుద్ధ విమానాలు, ట్రాన్స్‌పోర్ట్ విమానాలు, సైనిక హెలికాప్టర్ల వంటి దాదాపు 120 రకాల రక్షణ రంగ ఉత్పత్తులను ప్రదర్శించబోతున్నాం. ఆపరేషన్ సిందూర్‌లో బ్రహ్మోస్ సహా పలు లాంగ్ రేంజ్ మిస్సైళ్లను వినియోగించాం. కానీ ఫిబ్రవరి 27న జరిగే సైనిక విన్యాసాల్లో వాటిని ఉపయోగించం. ఎందుకంటే సైనిక విన్యాసాలు జరిగే ప్రదేశానికి దగ్గరలోనే సందర్శకులు కూర్చొని ఉంటారు. ఈసారి రెండు కొత్త ఆయుధాలను ప్రజలకు చూపించబోతున్నాం. మేం ప్రదర్శించనున్న ఆయుధాల్లో చాలావరకు భారత్‌లో తయారైనవే ఉంటాయి" అని భారత ఆర్మీ వైస్ చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ నగేశ్ కపూర్ చెప్పారు.

**77 యుద్ధ విమానాలు, 43 హెలికాప్టర్లు, 8 ట్రాన్స్‌పోర్ట్ విమానాలు**

"ఫిబ్రవరి 27న వాయుశక్తి విన్యాసాల్లో ప్రదర్శించనున్న రక్షణ రంగ ఉత్పత్తుల జాబితాలో 77 యుద్ధ విమానాలు, 43 హెలికాప్టర్లు, 8 ట్రాన్స్‌పోర్ట్ విమానాలు ఉంటాయి. రాఫెల్, తేజస్, సుఖోయ్ 30 ఎంకేఐ, మిగ్ 29, మిరాజ్ 2000 యుద్ధ విమానాలను ప్రదర్శిస్తాం. అపాచీ, ఎంఐ 17, ఎంఐ 17 వీ5, చినూక్, ఎల్‌సీహెచ్, ఏఎల్‌హెచ్ రకాల హెలికాప్టర్లతో సైనిక విన్యాసాలు చేస్తాం. సీ-17, సీ- 295, సీ-130జే లాంటి ట్రాన్స్‌పోర్ట్ విమానాలను ఈ విన్యాసాల్లో చూడొచ్చు. ఆకాశ్, స్పైడర్, ఎల్-70, ప్రత్యేక భద్రతా బలగాల సత్తాను చూసే అవకాశం సందర్శకులకు లభిస్తుంది"

## దేశం అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతోంది..



భారతదేశ అభివృద్ధిని కాంగ్రెస్ పార్టీ ఓర్వలేకపోతున్నదని కేంద్రమంత్రి కిరెణ్ రిజిజు మండిపడ్డారు. అమెరికా ప్రభుత్వానికి భారత్ తలొగ్గిందని లోక్‌సభలో ప్రధాన ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తంచేశారు. దేశం అభివృద్ధిపథంలో ఉండడాన్ని చూసి కాంగ్రెస్ ఓర్చుకోలేకపోతోందని, అందుకే ఆ పార్టీ నేతలు ఆధారాలు లేకుండా ప్రభుత్వంపై తప్పుడు విమర్శలు చేస్తున్నారన్నారని ఆరోపించారు. భారత్-అమెరికా దేశాల మధ్య కుదిరిన వాణిజ్య ఒప్పందం అమెరికాకు మాత్రమే మేలు చేసేలా ఉందనేందుకు ఆధారాలు చూపాలని రాహుల్‌గాంధీకి రిజిజు సవాల్ విసిరారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడి స్థానానికి తగిన నేత కాంగ్రెస్ పార్టీలో లేకపోవడం దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. రాహుల్ ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే కేంద్రమంత్రి హర్దీప్‌సింగ్ పురీపై లోక్‌సభలో తీవ్ర ఆరోపణలు చేశారని ఆగ్రహం వ్యక్తంచేశారు. పార్లమెంట్ హక్కులను ఉల్లంఘిస్తూ.. కేంద్రమంత్రిపై చేసిన ఆరోపణలకుగానూ విపక్ష నేతపై సభా హక్కుల ఉల్లంఘన నోటీసులు జారీ చేస్తామని రిజిజు హెచ్చరించారు. లోక్‌సభలో ప్రతిపక్ష నేత హోదాలో ఉన్నప్పటికీ రాహుల్‌గాంధీ.. తన ప్రశ్నలకు ఇతరులు చెప్పే సమాధానాలు వినకుండానే సభ నుంచి వెళ్లిపోతారని మండిపడ్డారు. ఒక సభ్యుడు ప్రసంగం చేసిన వెంటనే సభ నుంచి బయటకు వెళ్లకూడదనే నియమం ఉందని, ఈ విషయం ఆయనకు తెలియదా..? అని రిజిజు ప్రశ్నించారు.

## భారీ ఉగ్ర కుట్ర భగ్నం




భారీ ఉగ్ర కుట్రను పంజాబ్ పోలీసుకు చెందిన స్పెషల్ ఆపరేషన్స్ విభాగం భగ్నం చేసింది. పంజాబ్, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉగ్రదాడులకు ప్లాన్ చేసిన పాకిస్థాన్ ప్రేరేపిత ఉగ్రవాదిని అరెస్టు చేసింది. అతడి నుంచి రిమోట్ కంట్రోల్‌తో ఆపరేట్ చేసే ఇంప్రూవైజ్డ్ ఎక్స్‌ప్లోజివ్ డివైజ్ (ఐఈడీ), విదేశీ పిస్టల్, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకుంది. ఈ ఉగ్ర కుట్రపై పంజాబ్‌లోని అమృత్‌సర్ కేంద్రంగా పనిచేసే స్పెషల్ ఆపరేషన్స్ విభాగానికి నిఘా వర్గాల నుంచి పక్కా సమాచారం అందింది. దాని ప్రకారం పకడ్బందీ ప్లాన్‌తో ఆపరేషన్‌ను నిర్వహించి నిందితుడిని అదుపులోకి తీసుకున్నామని తెలుపుతూ పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ ఎక్స్ వేదికగా ట్వీట్ చేశారు.

**పాక్ ఉగ్రవాది సహకారంతో దాడులకు ప్లాన్**

పాకిస్థాన్‌కు చెందిన ఓ ఉగ్రవాది సహకారంతో నిందితుడు భారత్‌లో ఉగ్రదాడులకు ప్రణాళిక రచించాడని దర్యాప్తులో గుర్తించామని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. ఎన్‌క్రిప్టెడ్ మెసేజింగ్ యాప్‌ల ద్వారా పాక్ ఉగ్రవాదితో నిందితుడు నిత్యం ఛాటింగ్ చేసే వాడన్నారు. ఉగ్రదాడికి అవసరమైన పేలుడు సామగ్రిని పాక్ బార్డర్ మీదుగా భారత్‌లోకి పంపించారని చెప్పారు. అమృత్‌సర్ నగర శివారులోని కిర్టోవాల్ ఆటో కేర్ పరిసరాల్లో ఈ సామగ్రిని నిందితుడికి అందించారని ఆయన తెలిపారు. భారత్‌లోని పంజాబ్, ఢిల్లీ సహా పలు రాష్ట్రాల్లో ఉగ్రదాడులు చేసేందుకు ఈ ఐఈడీ, మందుగుండు సామగ్రి, పిస్టల్‌లను వినియోగించాలని నిందితుడు భావించాడని డీజీపీ పేర్కొన్నారు. దీనిపై అమృత్‌సర్‌లోని స్టేట్ స్పెషల్ ఆపరేషన్స్ సెల్ (ఎస్ఎస్ఓసీ) పోలీసు స్టేషనులో ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశామన్నారు. ఈ ఉగ్ర నెట్‌వర్క్‌లోని మిగతా వారిని గుర్తించేందుకు ప్రస్తుతం ముమ్మర దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు. ఉగ్ర దాడులకు లక్ష్యంగా ఎంచుకున్న నగరాల నిర్దిష్ట సమాచారాన్నీ సేకరిస్తున్నట్లు చెప్పారు. ఇందుకోసం నిందితుడిని లోతుగా ప్రశ్నిస్తున్నట్లు పేర్కొన్నారు.

**పాక్ నుంచి ఆయుధాల స్మగ్లింగ్: మరో ఇద్దరు అరెస్ట్**

పాకిస్థాన్ సరిహద్దు నుంచి భారత్‌లోకి ఆయుధాలు, మందుగుండు సామగ్రిని చేరవేస్తున్న ఇద్దరు వ్యక్తులను ఇటీవలే పంజాబ్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి గ్లోక్ 9ఎంఎం, పాయింట్ 30 బోర్ పిస్టల్స్‌ను స్వాధీనం చేసుకున్నారు. ఇవి అత్యంత ప్రమాదకర ఆయుధాలు అని పంజాబ్ డీజీపీ గౌరవ్ యాదవ్ తెలిపారు. పిస్టల్స్‌తో దొరికిపోయిన ఈ ఇద్దరు వ్యక్తులు కూడా పాకిస్థాన్‌కు చెందిన పలువురు ఆయుధ స్మగ్లర్లతో సోషల్ మీడియా ద్వారా టచ్‌లో ఉండేవారని గుర్తించామన్నారు. తుపాకుల ధరను చెల్లించడం దగ్గరి నుంచి దాన్ని పాక్ సరిహద్దు మీదుగా భారత్‌లోకి చేరవేయడం దాకా అన్ని విషయాల గురించి వీరంతా సోషల్ మీడియాలో డిస్కస్ చేసుకునే వారని డీజీపీ చెప్పారు. ఈ ఇద్దరిపై అమృత్‌సర్‌లోని హకీమా గేట్ పోలీసు స్టేషన్‌లో ఆర్మ్స్ యాక్ట్ కింద ఎఫ్ఐఆర్‌ను నమోదు చేశామన్నారు. పాక్ అక్రమ ఆయుధాల కోసం ఎవరు ఆర్డర్లు ఇస్తున్నారు? పాక్ నుంచి ఎవరు సప్లై చేస్తున్నారు? మధ్యవర్తులుగా ఎవరెవరు వ్యవహరిస్తున్నారు? అనే సమాచారాన్ని సేకరించే దిశగా ప్రస్తుతం దర్యాప్తు జరుగుతోందని డీజీపీ గౌరవ్ యాదవ్ వెల్లడించారు. అక్రమ ఆయుధాల సప్లై, వ్యవస్థీకృత నేరాలను కట్టడి చేసే విషయంలో ఎలాంటి రాజీ పడేది లేదని ఆయన తేల్చి చెప్పారు.

**డబ్బు ఎరగా వేసి స్మగ్లింగ్ చేయించాడు**

"పాకిస్థాన్ తుపాకుల స్మగ్లింగ్ కేసులో తాజాగా అరెస్టయిన ఇద్దరు నిందితుల్లో ఓ వ్యక్తి అమృత్‌సర్‌లోని ఒక సెలూన్‌లో అసిస్టెంట్‌గా పనిచేసేవాడు. 2022లో అమృత్‌సర్ పర్యటనకు వచ్చిన ఓ విదేశీయుడితో అతడికి పరిచయం ఏర్పడింది. ఆ విదేశీయుడితో 2022 నుంచి నిందితుడు టచ్‌లో ఉండేవాడు. తొలుత పలుమార్లు కొంత డబ్బును నిందితుడి బ్యాంకు ఖాతాలో ఆ విదేశీయుడు వేశాడు. అనంతరం ఆయుధాల స్మగ్లింగ్ అసైన్‌మెంట్లు ఇవ్వడం మొదలుపెట్టాడు" అని పంజాబ్ స్టేట్ స్పెషల్ ఆపరేషన్స్ సెల్ ఏఐజీ సుఖ్మీందర్ సింగ్ మాన్ మంగళవారం రోజు మీడియాకు తెలిపారు.

## 'రైట్ టూ రీకాల్'పై ఆప్ ఎంపీ రాఘవ్ చద్దా కీలక వ్యాఖ్యలు

**ఢిల్లీ:** దేశంలో పనితీరు లేని ఎంపీలు,ఎమ్మెల్యేలను తొలగించే అధికారం ఓటర్లకు కల్పించాలని ఆమ్‌ఆద్మీ పార్టీ(ఆప్) రాజ్యసభ సభ్యుడు రాఘవ్ చద్దా డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆయన రాజ్యసభలో మాట్లాడారు. రాజ్యసభ జీరో అవర్‌లో రాఘవ్ చద్దా ఓ ముఖ్యమైన అంశాన్ని ప్రస్తావించారు. ఆయన ప్రజలకు తమ ఎంపీలు, ఎమ్మెల్యేలు పనితీరు బాగలేకపోతే వారిని తొలగించుకునే హక్కు కల్పించాలని కోరారు. ప్రస్తుతం భారత రాజ్యాంగం ప్రజలకు ఎన్నిక చేసే హక్కు ఇస్తుంది

# కొడంగల్‌లో ఓటేసిన సీఎం.. మధిరలో డిప్యూటీ సీఎం

తెలంగాణలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల్లో పలువురు ప్రముఖులు తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. సీఎం రేవంత్ రెడ్డి తన నియోజకవర్గం కొడంగల్‌లోని జడ్పీ బాలుర ఉన్నత పాఠశాలలో ఓటు వేశారు. అనంతరం అక్కడి నుంచి హైదరాబాద్ చేరుకుని, శంషాబాద్ నుంచి దిల్లీకి బయలుదేరారు. ఖమ్మం జిల్లా మధిరలోని 9వ వార్డులో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ఓటు హక్కు వినియోగించుకున్నారు. ఇంకా ఎవరెవరు, ఎక్కడెక్కడ ఓటు వేశారంటే?

**ప్రణాళిక వేసుకుని వెళ్తున్నాం**

ఓటు వేసిన అనంతరం ఉపముఖ్యమంత్రి భట్టి మాట్లాడుతూ ప్రపంచీకరణ తరువాత గ్రామాలు పట్టణాలుగా రూపాంతరం చెందుతున్నాయన్నారు. ఈ పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రజా ప్రభుత్వం పట్టణాల్లో మౌలిక వసతుల కల్పనకు ప్రణాళికాబద్ధంగా ముందుకు పోతుందని తెలిపారు. 2047 కల్లా 3 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా రాష్ట్రాన్ని తీర్చిదిదెందుకు క్యూర్, ప్యూర్, రేర్ విభాగాలుగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని ముందుకు పోతున్నామని వెల్లడించారు. చెరువులను ఆక్రమణదారుల నుంచి విముక్తి కల్పించి పార్కులు, చెరువులను టూరిజం ప్రాంతాలుగా అభివృద్ధి చేస్తున్నామని వివరించారు. తమ ప్రభుత్వంలో 70 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేశామన్న భట్టి గ్రామీణ ప్రాంతాల యువత పోటీ పరీక్షల కోసం హైదరాబాద్ వెళ్లకుండా నియోజకవర్గ కేంద్రాల్లోని ఆన్లైన్లో ఉచితంగా శిక్షణ పొందేందుకు అంబేడ్కర్ నాలెడ్జ్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు.

ప్రజాస్వామ్యంలో ఓటు ఆయుధం : సిద్దిపేట జిల్లా హుస్నాబాద్‌లో రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ఒక ఆయుధమని, ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలని పొన్నం అన్నారు. సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ మున్సిపాలిటిలోని 3వ వార్డులోని నవభారత్ పబ్లిక్ స్కూల్‌లో కుటుంబ సమేతంగా మంత్రి ఓటు హక్కును వినియోగించుకున్నారు. హుస్నాబాద్‌లో రెండుచోట్ల బీఆర్ఎస్ అభ్యర్థుల భర్తలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. 15వ వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి మంజుల భర్త శ్రీనివాస్, ఒకటో వార్డు బీఆర్ఎస్ అభ్యర్థి స్వప్న భర్త విజయ్ భాస్కర్ ఉన్నారు. ఓటర్లకు డబ్బులు పంచుతున్నారని అదుపులోకి తీసుకున్నట్లు పోలీసులు తెలిపారు. శ్రీనివాస్ వద్ద రూ.6 వేలు, విజయ్‌భాస్కర్ వద్ద రూ.5 వేలు స్వాధీనం చేసుకున్నారు.

సూర్యాపేటలో మాజీ మంత్రి జగదీశ్ రెడ్డి ఓటు వేశారు. బీఆర్ఎస్ నాయకులతో కలిసి పోలింగ్ కేంద్రంలో ఫోటో దిగారు.

నల్గొండ పబ్లిక్ స్కూల్‌లో మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి తన ఓటు వేశారు.

నిజామాబాద్‌లో పీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ ఓటు హక్కును వినియోగించుకున్నారు.

కరీంనగర్ 50వ డివిజన్ జ్యోతినగర్‌లో కేంద్రమంత్రి బండి సంజయ్ కుటుంబసభ్యులతో కలిసి ఓటు వేశారు.

సంగారెడ్డి జిల్లా జోగిపేట 9వ వార్డులో వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ ఓటు వేశారు

జనగామలో ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి ఓటు హక్కును వినియోగించుకున్నారు.

ఓటు వేసిన జానారెడ్డి : నందికొండ మున్సిపాలిటీ ప్రభుత్వ జూనియర్ కళాశాల 5 వార్డులో మాజీ మంత్రి జానారెడ్డి కుటుంబ సభ్యులతో వచ్చి ఓటు వేశారు. నల్గొండ ఎంపీ రఘువీర్ రెడ్డి, నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి ఉన్నారు. జానారెడ్డి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటు హక్కును వినియోగించుకోవాలన్నారు. హాలియా మున్సిపాలిటీ పరిధిలో నిర్మలా పాఠశాల నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నేత నోముల భగత్ ఓటు వేశారు.

జిల్లాల్లో ఆయా కలెక్టర్లు పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తూ సిబ్బందికి పలు సూచనలు చేస్తున్నారు. హనుమకొండ కలెక్టర్ స్నేహ శబరీష్ పలు మున్సిపాలిటీలను పరిశీలించారు. భువనగిరి కలెక్టర్ హనుమంతరావు మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో పోలింగ్ కొనసాగుతుందని తెలిపారు. ఏవైనా సమస్యలు తెలెత్తితే వెంటనే పరిష్కరిస్తున్నట్లు చెప్పారు.

## 'సీఎం రేవంత్‌కు మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయం పట్టుకుంది'

-మొదటిపేజీ తరువాయి

స్ఫూర్తి బీఆర్ఎస్ కొండంత బలాన్నిచ్చింది, పార్టీలో ఆకాశమంత ఆత్మవిశ్వాసాన్ని నింపింది.

రెండేళ్ల పాలనలో ఘోరమైన పరిపాలనా వైఫల్యాలను మూటగట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్ ఓటమి భయంతోనే ఈ ఎన్నికల్లో ఇంతటి దౌర్జన్యకాండకు దిగారు. కాంగ్రెస్ పార్టీకి పంచాయతీ ఎన్నికల్లో మొదలైన పరాభవం, పట్టణాల్లోనూ తప్పదనే ఆందోళనతోనే అడుగడుగునా రేవంత్ రెడ్డి అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. అక్రమంగా లూటీచేసిన వేలకోట్ల ప్రజాధనంతో, ప్రజాతీర్పునే మార్చాలన్న ఈ కుట్రలను తెలంగాణ సమాజం చూస్తూ ఊరుకునే ప్రసక్తే లేదు. పోలీసుశాఖను అడ్డం పెట్టుకుని బీఆర్ఎస్ శ్రేణులపై సాగించిన వేధింపుల పర్వానికి, దాడులకు రేవంత్ రెడ్డి భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. ప్రజలకిచ్చిన హామీలను, మొత్తంగా పరిపాలనను గాలికి వదిలేసి రాష్ట్రాన్ని సంక్షోభంలోకి నెట్టిన పాపం రేవంత్ రెడ్డిని ప్రతినిత్యం వెంటాడుతూనే ఉంటది' అని పేర్కొన్నారు.

## తగ్గిన చికెన్, మటన్ ధరలు

**హైదరాబాద్ :** పండుగల సీజన్, మేడారం జాతర ఉండటంతో తెలుగు రాష్ట్రాల్లో చికెన్ ధరలు కొండెక్కగా.. ఇప్పుడు పండుగ సీజన్ ముగియడంతో ధరలు ఇప్పుడిప్పుడే దిగొస్తున్నాయి. గత ఏడాది డిసెంబర్‌లో క్రిస్మస్ ఉండటం, ఆ తర్వాత కొత్త ఏడాది జనవరిలో సంక్రాంతి పండుగ రావడం, మేడారం జాతర జరగడంతో ధరలు ఒక్కసారిగా పెరిగాయి. కేజీ చికెన్ రూ.350 వరకు తెలుగు రాష్ట్రాల్లో చేరుకుంది. కానీ ఇప్పుడు మెల్లమెల్లగా ధరలు తగ్గుతుండటంతో నాన్ వెజ్ ప్రియులు ఉపశమనం పొందుతున్నారు. జనవరి 8న సండే కావడంతో చికెన్‌కు డిమాండ్ ఉంటుంది. సెలవు కాకడంతో చికెన్ తినేందుకు చాలామంది ఆసక్తి చూపిస్తారు. ధరలు తగ్గడం వీరికి కాస్త రిలీఫ్ ఇచ్చిందిప్రస్తుతం కేజీ స్కిన్‌లెస్ చికెన్ ధర రూ. 240 నుంచి రూ.250 వరకు పలుకుతోంది. ఇక డ్రెస్డ్ చికెన్ కిలో రూ.220 నుంచి రూ.230 వరకు ఉండగా.. లైవ్ చికెన్ రూ.118 నుంచి రూ.120కే లభిస్తుంది. మేడారం జాతర సమయంలో డిమాండ్ కారణంగా స్కిన్‌లెస్ చికెన్ రూ.350నుంచి రూ.380 వరకు కూడా వ్యాపారులు విక్రయించారు. ఇక డ్రెస్డ్ చికెన్‌ను రూ.350కు, లైవ్ కోడిని రూ.200 వరకు విక్రయించారు. జాతర ముగిసిన తర్వాత చికెన్ ధరలు ఢమాల్ అంటూ పడిపోయాయి. వారం రోజుల వ్యవధిలోనే రూ.100 తగ్గడంతో నాన్‌వెజ్ ప్రియులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. పండుగ సీజన్ ముగియడంతో కోళ్లకు డిమాండ్ పడిపోయిందని, ధరలు తగ్గడానికి ఇదే కారణమని వ్యాపారుల చెబుతున్నారు. అలాగే కోళ్ల ఉత్పత్తి కూడా పెరగడం వల్ల ధరలు పడిపోతున్నాయని అంటున్నారు.తెలుగు రాష్ట్రాల్లో కోళ్ల ఫామ్స్‌లో ఉత్పత్తి బాగా పెరిగింది. ప్రస్తుత పరిస్థితుల్లో డిమాండ్ లేకపోవడంతో తక్కువ ధరలకే విక్రయిస్తున్నారు. ఇక చికెన్ ధరలతో పాటు కోడిగుడ్ల ధరలు కూడా భారీగా పెరిగాయి. గత నెలలో ఏకంగా ఒక్కో కోడిగుడ్డు ధర రూ.10కు చేరుకుంది. రిటైల్ షాపుల్లో రూ.10కి విక్రయించారు.

# స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలు

**హైదరాబాద్ :** తెలంగాణలో కొత్తగా 12 లాజిస్టిక్ పార్కులు ఏర్పాటు చేసేందుకు రేవంత్ సర్కార్ ప్రణాళికలు రచిస్తోంది. రోడ్డు, రైలు, విమాన మార్గాలతో వీటిని కనెక్ట్ చేయనున్నారు. ఈ మేరకు సర్కార్ మాస్టర్ ప్లాన్ సిద్ధం చేస్తోంది. కొన్ని ప్రాంతాల్లో డ్రై పోర్టులు, గిడ్డంగులుగా ఏర్పాటు చేసి స్మార్ట్ డిజిటల్ లాజిస్టిక్ కేంద్రాలుగా అభివృద్ధి చేయనున్నారు. తెలంగాణను అన్నిరంగాల్లో అగ్రగామిగా నిలిపేందుకు రేవంత్ సర్కార్ 'తెలంగాణ రైజింగ్ 2047' నినాదంతో ముందుకెళ్తోంది. అందులో భాగంగా.. రాష్ట్రాన్ని దేశంలోనే ప్రధాన లాజిస్టిక్ హబ్‌గా మార్చే దిశగా భారీ ప్రణాళికలు రచిస్తోంది. అందులో భాగంగా.. తెలంగాణ లాజిస్టిక్ పాలసీ 2.0 సమగ్ర మాస్టర్‌ప్లాన్ రూపొందుతోంది. 2047 నాటికి రాష్ట్రాన్ని 3 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలనే లక్ష్యంతో.. రవాణా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకురావాలని ప్రయత్నిస్తోంది. ఈ మేరకు రాష్ట్రవ్యాప్తంగా 12 కొత్త లాజిస్టిక్ పార్కులు , అవసరమైన చోట్ల డ్రై పోర్టులు, అత్యాధునిక గిడ్డంగులను నిర్మించేందుకు రెడీ అవుతున్నారు.ప్రధానంగా పరిశ్రమలను ఆకర్షించడం, ఎగుమతులను ప్రోత్సహించడం, రవాణా ఖర్చులను తగ్గించడంపై ప్రభుత్వం దృష్టి సారిస్తుంది. రోడ్డు, ట్రైన్, విమాన విమాన మార్గాలను కనెక్ట్ చేస్తూ ఒక పకడ్బందీ సరఫరా వ్యవస్థను నిర్మించనున్నారు. వ్యవసాయా ధారిత పరిశ్రమలకు, పారిశ్రామిక క్లస్టర్లకు, ఈ–కామర్స్ సంస్థలకు ఈ మాస్టర్‌ప్లాన్ బ్యాక్‌బోన్‌గా నిలవనుంది. పర్యావరణహిత విధానాలు, ఆటోమేషన్ ద్వారా లాజిస్టిక్ రంగాన్ని అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా తీర్చిదిద్దనున్నారు. ఇప్పటికే మనోహరాబాద్ సమీపంలో మెగా మల్టీమోడల్ లాజిస్టిక్ పార్క్ పనులు జరుగుతున్నాయి. త్వరలోనే హైదరాబాద్ శివారులోని మంగళపల్లి, బాటసింగారం తరహాలో మరిన్ని పార్కులను విస్తరించాలని



ప్రభుత్వం నిర్ణయించింది.హైదరాబాద్ ఔటర్ రింగు రోడ్డు, రీజినల్ రింగు రోడ్డు మధ్య ఉన్న ప్రాంతాన్ని పెరి అర్బన్ రీజియన్ ఎకానమీ' (ప్యూర్) జోన్‌గా ప్రభుత్వం గుర్తించింది. ఇక్కడ తయారీ యూనిట్లు, ఎంఎస్ఎంఈ క్లస్టర్లు, లాజిస్టిక్ హబ్‌లను ఏర్పాటు చేయటం ద్వారా గ్రామీణ, పట్టణ ఆర్థిక వ్యవస్థలను వేగంగా కనెక్ట్ చేయనున్నారు. దీనివల్ల భారీస్థాయిలో ఉపాధి అవకాశాలు పెరగడమే కాకుండా.. సరుకు రవాణాకు అత్యంత అనుకూలమైన వాతావరణం ఏర్పడుతుంది. అలాగే, ఫ్యూచర్ సిటీ నుంచి బందరు పోర్టు వరకు ప్రతిపాదించిన 297 కిలోమీటర్ల గ్రీన్‌ఫీల్డ్ ఎక్స్‌ప్రెస్‌వే, రైల్వే లైన్, ఈ డ్రై పోర్టులను కనెక్ట్ చేస్తూ రాష్ట్ర ఎగుమతులను ప్రోత్సహించనున్నారు. ఎయిర్ కార్గో రంగాన్ని కూడా మరింత బలోపేతం చేసేందుకు ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఇప్పటికే శంషాబాద్ విమానాశ్రయం ఔషధాలు, ఎలక్ట్రానిక్స్ వంటి విలువైన సరుకు రవాణాలో దేశంలోనే ప్రముఖ కేంద్రంగా ఉంది. ఈ ఎయిర్ కార్గో సేవలను రోడ్డు, రైలు మార్గాలతో సమన్వయం చేయడం ద్వారా 'మల్టీ–మోడల్ కనెక్టివిటీ'ని సాధించాలని అధికారులు భావిస్తున్నారు. ఈ సమగ్ర లాజిస్టిక్ విధానం అమల్లోకి వస్తే.. తెలంగాణ పారిశ్రామిక రంగంలో అగ్రగామిగా నిలవటం ఖాయం.

# పేద రోగులకు రోబోటిక్ విధానంలో ఫ్రీగా సర్జరీలు

**హైదరాబాద్ :** క్యాన్సర్ వ్యాధితో బాధపడుతున్న పేద రోగులకు ఎంఎన్‌జే ఆసుపత్రిలో ఉచితంగా సర్జరీలు చేస్తున్నారు. రోబోటిక్ విధానంలో రోగులకు ఆరోగ్యశ్రీ పథకం కింద శస్త్రచికిత్సలు చేస్తున్నారు. గత రెండున్నరేళ్లలో ఆసుపత్రిలో రూ.12.5 కోట్ల విలువైన సర్జరీలు చేసినట్లు వైద్యులు వెల్లడించారు.పేద రోగులకు నిజంగా ఇది వరమనే చెప్పాలి. హైదరాబాద్ నగరంలోని ప్రభుత్వ ఎంఎన్‌జే క్యాన్సర్ ఆసుపత్రిలో పేద రోగులకు రోబోటిక్ విధానంలో అత్యాధునిక వైద్య సేవలు అందిస్తున్నారు. అవి కూడా ఉచితంగా. గడిచిన 30 నెలల వ్యవధిలో దాదాపు రూ.12.5 కోట్ల విలువైన రోబోటిక్ సర్జరీలు విజయవంతంగా పూర్తి చేశారు. ఈ సేవలను ఆరోగ్యశ్రీ కింద పూర్తి ఉచితంగా పేద రోగులకు అందిస్తున్నారు. గత రెండున్నరేళ్లలో రికార్డు స్థాయిలో 250 వరకు రోబోటిక్ సర్జరీలు చేశారు. హైదరాబాద్ నగరం నుంచే కాకుండా ఇతర జిల్లాలు, సరిహద్దు రాష్ట్రాల నుంచి ప్రతి రోజూ 700–800 వరకు రోగులు క్యాన్సర్ చికిత్సల కోసం ఆసుపత్రిని ఆశ్రయిస్తుంటారు. చేతిలో చిల్లిగవ్వ లేకుండా చాలామంది రోగులు వస్తుంటారు. సాధారణంగా



ఒక రోబో సర్జరీకి ప్రైవేటు ఆసుపత్రిలో అయితే రూ.5 లక్షల వరకు వసూలు చేస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకం కింద ప్రభుత్వం ఎంఎన్‌జేకు ఒక్కో రోబో సర్జరీకి రూ.1.5 లక్షల వరకు చెల్లిస్తోంది.కిడ్నీ, పెద్దపేగు, గ్యాస్ట్రిక్, గర్భసంచి, అన్నవాహిక, ప్రొస్టేట్ క్యాన్సర్లకు గతంలో కోత పెట్టి క్యాన్సర్ గడ్డలను తొలగించే వారు. అయితే అతి చిన్న క్యాన్సర్ గడ్డలను తొలగించడానికి డాక్టర్లకు కొన్నిసార్లు సాధ్యమయ్యేది కాదు. అధిక రక్త స్రావంతో పేషెంట్లు ఎక్కువ రోజులు హాస్పిటల్స్‌లోనే ఉండాల్సి వచ్చేది. ప్రస్తుతం అత్యాధునిక సర్జికల్ రోబోతో అతి చిన్న కణతులను చాలా ఈజీగా తొలగిస్తున్నారు. ఎలాంటి కోత లేకుండానే.. నాలుగు రంధ్రాలతో రోబో చేతులు లోపలకు వెళ్లి క్యాన్సర్ గడ్డలను పూర్తిగా తొలగిస్తున్నాయి. డాక్టర్లకు చేతులు వణుకు సమస్య ఉంటే ఈ శస్త్రచికిత్సలు చాలా కష్టమయ్యేవి. ప్రస్తుతం రోబోలతో సర్జరీలు చేస్తుండటంతో ఆ పరిస్థితి లేదు. ఇన్‌ఫెక్షన్లకు ఆస్కారం కూడా చాలా తక్కువ. మహిళల్లో వచ్చే గర్భాశయ క్యాన్సర్‌కు రోబోటిక్ సహాయ శస్త్ర చికిత్స మంచి ఫలితాలు అందిస్తోంది.ఇక తెలంగాణలో వైద్యారోగ్యశాఖ బలోపేతానికి సర్కార్ కీలక చర్యలు తీసుకుంటుంది. ఆసుపత్రుల్లో వైద్యులతో పాటు ఇతర సిబ్బంది నియామకానికి ఆదేశాలు ఇచ్చింది. దాంతో పాటుగా కొత్తగా ఆసుపత్రుల నిర్మాణం.. ఇప్పటికే ఉన్న ఆసుపత్రులను అప్‌గ్రేడ్ చేస్తున్నారు. జిల్లాల్లోనూ డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేసి కిడ్నీ రోగులకు ఉపశమనం కలిగించేలా చర్యలు తీసుకుంటున్నారు.

## ప్రశాంతంగా పోలింగ్

-మొదటిపేజీ తరువాయి

మందకొడిగా సాగిన పోలింగ్ ఆ తర్వాత పుంజుకుంది. పెద్దసంఖ్యలో పోలింగ్ కేంద్రాలకు ఓటర్లు తరలివచ్చి తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. తమ నిర్ణయాన్ని బ్యాలెట్ బాక్సుల్లో నిక్షిప్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాల్టీలు 2,582 వార్డుల్లో కౌన్సిలర్ల ఎన్నిక కోసం ఓటింగ్ నిర్వహించారు. ఇప్పటికే తొమ్మిది పురపాలికల్లోని 12 వార్డుల్లో పోటీ లేకుండా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మక్తల్ మున్సిపాల్టీలోని ఆరో వార్డులో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడటంతో అక్కడ ఎన్నిక నిర్వహించలేదు. అన్ని మున్సిపాల్టీల్లో కలిపి 10,719 మంది అభ్యర్థులు బరిలో నిలిచారు. పుర ఎన్నికలకు సంబంధించి 6,017 పోలింగ్ కేంద్రాలను ఎన్నికల సంఘం ఏర్పాటు చేసింది.

**21174 పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు**

రాష్ట్రంలోని 7 కార్పొరేషన్లకు ఎన్నికలను నిర్వహించారు. మొత్తం 414 వార్డులకు గాను రెండుచోట్ల ఏకగ్రీవం కావడంతో 412 డివిజన్లలో ఎన్నికల కోసం 21,174 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. కరీంనగర్, రామగుండం, నిజామాబాద్, మహబూబ్‌నగర్, కొత్తగూడెం, మంచిర్యాల, నల్గొండ కార్పొరేషన్లలో 2,225 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. కాంగ్రెస్ 410, బీఆర్ఎస్ 401, బీజేపీ 382 అభ్యర్థులు పోటీలో నిలిచారు. ఆమ్‌ఆద్మీ పార్టీ 12, బీఎస్పీ 44, సీపీఎం 10, ఎంఐఎం 62, ఫార్వర్డ్ బ్లాక్ 122, సీపీఐ 65, జనసేన 81, ఇతర పార్టీలు 55 స్థానాల్లో పోటీ చేయగా 578 మంది ఇండిపెండెంట్లు బరిలో నిలిచారు. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలోని ఒక్కో వార్డుల్లో ఏకగ్రీవంగా ఎన్నిక జరిగింది. మున్సిపాల్టీలు, కార్పొరేషన్లలో కలిపి 52 లక్షల 17వేల 413 మంది ఓటర్లు ఉన్నారు.

**వెబ్‌కాస్టింగ్ ద్వారా ఓటింగ్ పర్యవేక్షించిన ఈసీ**

రాష్ట్రంలోని 8,191 పోలింగ్ కేంద్రాల నుంచి ఓటింగ్ ప్రక్రియను వెబ్ కాస్టింగ్ ద్వారా ఎన్నికల అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. పోలింగ్ పూర్తి కావడంతో బ్యాలెట్ బాక్సులను భద్రపరిచేందుకు 137 స్ట్రాంగ్ రూంలు సిద్ధం చేశారు. ఎక్కడైనా రీపోలింగ్ అవసరమైతే గురువారం నిర్వహించనున్నట్లుగా తెలిసింది. శుక్రవారం ఉదయం 8గంటల నుంచి 136 కేంద్రాల్లో ఓట్లు లెక్కించి ఫలితాలను ప్రకటిస్తారు. ఈనెల 16వ తేదీన మున్సిపాల్టీల్లో ఛైర్మన్, వైస్ ఛైర్మన్ కార్పొరేషన్లలో మేయర్, డిప్యూటీ మేయర్ ఎన్నిక జరగనుంది.

**పలుచోట్ల స్వల్ప ఘర్షణలు**

పురపాలక ఎన్నికల సందర్భంగా పలుచోట్ల స్వల్ప ఘర్షణలు చోటుచేసుకున్నాయి. ఉమ్మడి మెదక్ జిల్లాలో చెదురుమదురు ఘటనల మినహా పురపాలిక పోలింగ్ సజావుగా సాగింది. సంగారెడ్డిలో 34 వార్డు పోలింగ్ కేంద్రం వద్ద ఉద్రిక్తత చోటుచేసుకుంది. కాంగ్రెస్ అభ్యర్థి చౌక్కాను సీఐ పట్టుకోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసిన కాంగ్రెస్ నేత జగ్గారెడ్డి పోలింగ్ బూత్ వద్దకు చేరుకున్నారు. పోలింగ్ ఆపేస్తామని బూత్‌లోకి దూసుకెళ్లడంతో ఉద్రిక్తత నెలకొంది. ఈ క్రమంలో పోలీసులు–జగ్గారెడ్డికి మధ్య వాగ్వాదం, తోపులాట జరిగింది. బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్‌కి సీఐ సహకరిస్తున్నారని జగ్గారెడ్డి ఆరోపించారు. నర్సాపూర్ మున్సిపాలిటీ 15వ వార్డులో బీఆర్ఎస్, బీజేపీ కార్యకర్తల మధ్య ఘర్షణ చెలరేగింది. ఈ క్రమంలోనే పరస్పర దాడులకు దిగారు. పోలీసులు జోక్యం చేసుకుని ఇరువర్గాలను చెదరగొట్టారు. రామాయంపేట ఏడో వార్డులో బీజేపీ, కాంగ్రెస్ వర్గాల మధ్య స్వల్ప ఘర్షణ చోటుచేసుకుంది.

## మున్సిపల్ హస్తందే!

-మొదటిపేజీ తరువాయి

ప్రకారం కాంగ్రెస్ 68 నుంచి 76 మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటుందని వెల్లడించగా, బీకాన్ సర్వే ఏకంగా 80–85 పీఠాలు గెలుచుకుంటుందని పేర్కొంది. ఇదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ 8 నుంచి 36 స్థానాలకు, బీజేపీ 3 నుంచి 6 స్థానాలకు పరిమితం కావచ్చని ఈ సర్వేలు అంచనా వేశాయి. వార్డుల వారీగా చూస్తే, ఆపరేషన్ చాణక్య సర్వే మరింత లోతైన విశ్లేషణ అందించింది. మొత్తం మున్సిపల్ వార్డుల్లో కాంగ్రెస్‌కు 1400–1449 వార్డులు (48% ఓట్లు), బీఆర్ఎస్‌కు 745–793 వార్డులు (26% ఓట్లు), బీజేపీకి 358–399 వార్డులు (13% ఓట్లు) దక్కే అవకాశం ఉందని తెలిపింది. ఆశ్చర్యకరంగా జనసేన పార్టీ 30–35 వార్డులు గెలుచుకునే అవకాశం ఉందని పేర్కొనడం గమనార్హం. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోనూ కాంగ్రెస్ హవా స్పష్టంగా కనిపిస్తోంది. అయితే, ఉత్తర తెలంగాణలోని నిజామాబాద్, కరీంనగర్ కార్పొరేషన్లలో బీజేపీ ఆధిక్యం ప్రదర్శించవచ్చని పీపుల్స్ పల్స్ అంచనా వేసింది. మహబూబ్‌నగర్, మంచిర్యాల, రామగుండం, నల్గొండ కార్పొరేషన్లలో కాంగ్రెస్ ఏకపక్ష విజయం సాధిస్తుందని తెలిపింది. కొత్తగూడెంలో కాంగ్రెస్‌కు, సీపీఐకి మధ్య గట్టిపోటీ ఉండగా, బీఆర్ఎస్ మూడో స్థానానికే పరిమితం కావచ్చని సర్వేలు చెబుతున్నాయి. సామాజిక వర్గాల వారీగా ఎస్సీ, ముస్లిం మైనారిటీ ఓటర్లు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపినట్లు తెలుస్తోంది. మొత్తం మీద, ఈ ఎగ్జిట్ పోల్స్ అంచనాలు నిజమైతే తెలంగాణ పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ తన పట్టును మరింత బలోపేతం చేసుకున్నట్లే. అయితే ఇవి కేవలం అంచనాలు మాత్రమేనని, అసలు ఫలితాలు ఫిబ్రవరి 13న జరిగే ఓట్ల లెక్కింపు తర్వాతే వెల్లడవుతాయి. ఈ ఫలితాలపై రాష్ట్రవ్యాప్తంగా రాజకీయ వర్గాల్లో తీవ్ర ఉత్కంఠ నెలకొంది.

## శివరాత్రికి ప్రత్యేక బస్సులు

-మొదటిపేజీ తరువాయి

యాజమాన్యం వెల్లడించింది. మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులకు రవాణా పరమైన అసౌకర్యం కలగకుండా టీజీఎస్‌ఆర్టీసీ అన్ని ఏర్పాట్లు చేసింది. భక్తుల సౌకర్యార్థం రాష్ట్రంలోని పలు ప్రాంతాల నుంచి 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను నడపాలని యాజమాన్యం నిర్ణయించింది. ఈ నెల 15న మహా శివరాత్రి కాగా, ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు ఈ ప్రత్యేక బస్సులను సంస్థ నడపనుంది. ప్రధానంగా శ్రీశైలానికి 781, వేములవాడకు 416, ఏడుపాయలకు 249, కీసరగుట్టకు 326, వేలాలకు 127, కాళేశ్వరానికి 71తో పాటు రాష్ట్రంలోని కొమురవెల్లి, అలంపూర్, ఉమామహేశ్వరం, పాలకుర్తి, రామప్ప, తదితర ఆలయాలకు 273 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది.

హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్, జేబీఎస్, సీబీఎస్, ఐఎస్ సదన్, కేపీహెచ్‌బీ, బీహెచ్‌ఈఎల్ నుంచి శ్రీశైలం పుణ్యక్షేత్రానికి ప్రత్యేక బస్సులు భక్తులకు అందుబాటులో ఉంటాయి. ఆయా ప్రాంతాల్లో షామియానాలు, చైర్లు, తాగునీరుతో పాటు పబ్లిక్ అడ్రస్ సిస్టంను సంస్థ ఏర్పాటు చేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం శివరాత్రికి నడిచే స్పెషల్ బస్సుల్లో టికెట్ ధరలను సంస్థ సవరించింది. ప్రత్యేక బస్సుల్లో 50 శాతం అధిక టికెట్ ధరలను వసూలు చేయనుంది. రెగ్యులర్ సర్వీస్ టికెట్ ఛార్జీల్లో ఎలాంటి మార్పు ఉండదు. ఈ నెల 14 నుంచి 16వ తేది వరకు (మూడు రోజులు) నడిచే ప్రత్యేక బస్సులకు మాత్రమే సవరణ టికెట్ ఛార్జీలు అమల్లో ఉంటాయి. ఏడు పాయలకు తిరిగే స్పెషల్ బస్సుల్లో 15వ తేదీ నుంచి 17వ తేది వరకు (మూడు రోజులు) సవరణ చార్జీలు వర్తిస్తాయి. ప్రయాణికులకు సమాచార నిమిత్తం స్పెషల్ సర్వీసులకు బస్సు ముందు భాగంలో డిస్ ప్లే బోర్డులను సంస్థ ఏర్పాటు చేస్తోంది. శివరాత్రి ఆపరేషన్స్‌పై ఉన్నతాధికారులతో సంస్థ ఎండీ వై.నాగిరెడ్డి ఇప్పటికే సమీక్ష నిర్వహించారు.

శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ : శివరాత్రి పండుగకు శైవక్షేత్రాలకు వెళ్లే భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ నేపథ్యంలో టీజీఎస్‌ఆర్టీసీ పకడ్బందీ ఏర్పాట్లను చేస్తోంది. 43 శైవక్షేత్రాలకు 2243 ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. గత శివరాత్రి కన్నా ఈ సారి 208 బస్సులను అదనంగా సంస్థ నడపనుంది. భక్తుల రద్దీకి అనుగుణంగా మరిన్ని ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయాలని క్షేత్ర స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మహాశివరాత్రి స్పెషల్ బస్సుల్లో రాష్ట్ర ప్రభుత్వ జీవో ప్రకారం పల్లె వెలుగు, ఎక్స్ ప్రెస్, సిటీ ఆర్డీనరీ, మెట్రో ఎక్స్ ప్రెస్ బస్సుల్లో మహిళలకు రాష్ట్రంలో ప్రయాణానికి ఉచిత బస్సు రవాణా సదుపాయం యధావిధిగా అమల్లో ఉంటుందని స్పష్టం చేశారు. తమ ప్రయాణ సమయంలో మహిళలు విధిగా జీరో టికెట్లను తీసుకోవా లని సూచించారు. హైదరాబాద్ నుంచి శ్రీశైలంకు వెళ్లే ప్రత్యేక బస్సులకు ముందస్తు రిజర్వేషన్ సదుపాయాన్ని కల్పించామని, టికెట్ల బుకింగ్‌ను ఉఉఉ.ఞ్ట్ఛౌn ్ఛ.ఛిౌఝ వెబ్సైట్లో బుక్ చేసుకోవచ్చని, మహా శివరాత్రి స్పెషల్ బస్సులకు సంబంధించిన సమాచారం కోసం టీజీఎస్‌ఆర్టీసీ కాల్ సెంటర్ నంబర్లు 040-69440000, 040-234500332లలో సంప్రదించవచ్చని సంబంధిత అధికారులు తెలిపారు.

ధర్మఘంట

# వేపాకు.. రోగాలకు దివ్యౌషధం



ఆయుర్వేద సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించడానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. ఆయుర్వేద సంప్రదాయం నుండి ఆధునిక సైన్స్ వరకు.. భారతీయ సంస్కృతిలో వేప చెట్టుకు ఎంతో ప్రాముఖ్యత ఉంది. మన ఋషులు వేపలో దాగి ఉన్న అద్భుత ఔషధ గుణాలను ప్రాచీన కాలంలోనే గుర్తించారు. పంటలకు పురుగు మందుగా, బియ్యంలో పురుగు పట్టకుండా, క్రిమికీటకాలను నివారించడానికి వేపను ఉపయోగించేవారు. ఆధునిక శాస్త్ర పరిశోధనలు కూడా ఈ ప్రయోజనాలను నిర్ధారించాయి. అంతేకాకుండా పురాతన కాలం నుంచి వేప చెట్టుకు పూజలు కూడా చేస్తారు. వేప చెట్టుకు పసుపు రాసి, బొట్లు పెట్టి ప్రదక్షిణలు కూడా చేస్తారు. వేపాకులు అద్భుతమైన ఔషధ గుణాలు.. పోషకాల గని. ఇందులో ప్రొటీన్లు, కార్బోహైడ్రేట్లు, ఖనిజాలు (కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం, భాస్వరం, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉన్నాయి. ఇవి రోగనిరోధక శక్తిని పెంచడం, చర్మ వ్యాధులు, మధుమేహం, జీర్ణ సమస్యలను తగ్గించడంలో అద్భుతంగా సహాయపడతాయి. వేపలో దాగి ఉన్న అద్భుతమైన ప్రయోజనాలను శాస్త్రవేత్తలు నాలుగు ముఖ్యమైన పరిశోధనల ద్వారా నిరూపించారు. 2015వ సంవత్సరంలో భారతదేశంలోని వెల్లూరు ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శాస్త్రవేత్తలు వేపలో నింబల్ ఫ్లేవోన్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ వైరస్ గుణాలను కలిగి ఉంటుందని, క్రిములను సమర్థవంతంగా చంపుతుందని వారు స్పష్టంగా నిరూపించారు. జర్మనీలోని యూనివర్సిటీ ఆఫ్ హెన్రిచ్ కు చెందిన శాస్త్రవేత్తలు 2011వ సంవత్సరంలో వేపలో అజాదిరచిటిన్ అనే రసాయనం ఉందని కనుగొన్నారు. వేప నూనెలో ఉండే ఈ రసాయనం తలకు అప్లై చేసిన 10 నుండి 15 నిమిషాల్లో తలలోని పేలను పూర్తిగా నిర్మూలిస్తుందని వారి పరిశోధనలు నిరూపించాయి. 2014వ సంవత్సరంలో ఇండోనేషియాలోని యూనివర్సిటీ ఆఫ్ గడ్జా మడ శాస్త్రవేత్తలు వేపలో నింబిడిన్ అనే రసాయనాన్ని కనుగొన్నారు. ఈ నింబిడిన్ ప్యాంక్రియాస్ గ్రంథిలోని బీటా కణాలను ఉత్తేజపరిచి, ఇన్సులిన్ రెసిస్టెన్స్ ను తగ్గిస్తుందని, తద్వారా షుగర్ స్థాయిలను నియంత్రించడానికి సహాయపడుతుందని వెల్లడించారు. ఈ రసాయనం ఇన్సులిన్ ఉత్పత్తికి కూడా దోహదపడుతుంది. అమెరికాలోని రోస్వెల్ పార్క్ క్యాన్సర్ ఇన్స్టిట్యూషన్ శాస్త్రవేత్తలు 2014లో వేపలో నింబిడాల్ అనే రసాయనాన్ని గుర్తించారు. ఈ రసాయనం క్యాన్సర్ కణాలు వాటంతట అవే చనిపోయేలా (అపోప్టోసిస్) ప్రేరణ కలిగిస్తుందని, క్యాన్సర్ వృద్ధిని అదుపు చేయడానికి, తగ్గించడానికి బాగా ఉపయోగపడుతుందని వారు నిరూపించారు. ఈ నాలుగు రకాల పరిశోధనలు వేపలో ఉన్న ఔషధ గుణాలను, శక్తివంతమైన మెడిసిన్స్ లాగా ఇవి జబ్బులను తగ్గించడానికి పనికొస్తున్నాయని రుజువు చేశాయి.

# బొప్పాయి గింజలు.. తిన్నారంటే గంపెడు లాభాలు?



ఆరోగ్యానికి మేలు చేసే పండ్ల విషయానికి వస్తే బొప్పాయి అగ్రస్థానంలో ఉంటుంది. ఇది కేవలం ఒక సాధారణ పండు మాత్రమే కాదు, శరీరాన్ని లోపలి నుండి సంరక్షించే సహజ ఔషధం. ఆయుర్వేదంలో దీనిని అమృతఫలం అని పిలుస్తారు. ఎందుకంటే బొప్పాయిలోని ప్రతి భాగం కాయ, పండు, ఆకులు, గింజలు కూడా అద్భుత లక్షణాలతో నిండి ఉంటాయి. ప్రతి పండు దాని సొంత ప్రత్యేక లక్షణాలను కలిగి ఉంటుంది. బొప్పాయి జ్వరాలను నయం చేసే, రక్తాన్ని శుద్ధి చేసే, చర్మాన్ని మెరుగుపరిచే శక్తిని కలిగి ఉంటుంది. బొప్పాయి,దాని ఆకులు చాలా శక్తివంతమైనవి. అవి శరీరంలోని మూడు దోషాలను సమతుల్యం చేయడంలో, జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడతాయి. బొప్పాయి మాత్రమే కాదు, దాని గింజలు, ఆకులు కూడా అమృతంగా పరిగణిస్తారు. బొప్పాయి గింజలను సాధారణంగా కొత్త మొక్కలను పెంచడానికి ఉపయోగిస్తారు. కానీ, దీన్ని తినడం వల్ల మన శరీరం ఎన్ని ప్రయోజనాలను పొందుతుందో తెలిస్తే మీరు షాక్ అవుతారు. బొప్పాయిలోని పపైన్ ఎంజైమ్ కడుపు, పేగులకు ప్రయోజనకరంగా ఉంటుంది. ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో, శరీరాన్ని శుద్ధి చేయడంలో, పోషకాలను గ్రహించడంలో ముఖ్యమైన పాత్ర పోషిస్తుంది. బొప్పాయి ఆకులు, గింజలు ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగించబడతాయి. ఆకులు, గింజలు కొద్దిగా చేదు రుచిని కలిగి ఉన్నప్పటికీ, అవి శరీర మూలంలోని అనేక సమస్యలను నయం చేయడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజల్లో విటమిన్ సి కూడా పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడానికి, శరీరాన్ని అనేక వ్యాధుల నుండి రక్షించడానికి సహాయపడుతుంది. భారతదేశంలో గుండె జబ్బులు ఎక్కువగా ఉన్నాయి. చిన్న పెద్ద తేడాలేకుండా చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. ఈ పరిస్థితికి బొప్పాయి గింజలు దివ్యౌషధం. బొప్పాయి గింజలలో ఉండే యాంటీఆక్సిడెంట్లు మన శరీరాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టం నుండి రక్షిస్తాయి. ఈ విత్తనాలు రక్తపోటును నియంత్రించడంలో సహాయపడతాయి. ఇంకా, ఈ విత్తనాలలో ఒలీక్ ఆమ్లం, మోనోశాచురేటెడ్ కొవ్వు ఆమ్లాలు ఉంటాయి. ఇవి చెడు కొలెస్ట్రాల్‌ను నియంత్రించడంలో సహాయపడతాయి. బొప్పాయి గింజలు వాపును తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా ఉంటాయి. ఈ విత్తనాలలో ఆల్కలాయిడ్స్, ఫ్లేవనాయిడ్లు, విటమిన్ సి పుష్కలంగా ఉంటాయి. ఇది శరీరంలో మంటను తగ్గించడంలో సహాయపడుతుంది. బొప్పాయి గింజలు క్యాన్సర్ నిరోధక లక్షణాలను కలిగి ఉంటాయి. ఈ విత్తనాలలో కనిపించే ఐసోథియోసైనేట్స్ వంటి సమ్మేళనాలు క్యాన్సర్ కణాల పెరుగుదలను నిరోధిస్తాయి. బొప్పాయి గింజలు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్లు, ఖనిజాలతో సమృద్ధిగా ఉంటాయి. ఇవి చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడతాయి. ఈ విత్తనాలు జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తాయి. మీరు చర్మం, జుట్టు కోసం బొప్పాయి గింజల సారం లేదా నూనెను ఉపయోగించవచ్చు. మీరు చర్మ సమస్యలతో పోరాడుతుంటే, బొప్పాయి గింజలు ప్రయోజనకరంగా ఉంటాయి. వాటి యాంటీ ఏజింగ్ లక్షణాలు మీ చర్మాన్ని మృదువుగా, ప్రకాశవంతంగా ఉంచడంలో సహాయపడతాయి.

# వంటగదిలో మౌనం.. ఆరోగ్యానికి అసలైన ప్రాణం



వంట చేయడం అనేది కేవలం ఆకలి తీర్చుకోవడానికి చేసే పని మాత్రమే కాదు, అది ఒక అద్భుతమైన ధ్యాన ప్రక్రియ. మనం తీసుకునే ఆహారం మన ఆలోచనల మీద ప్రభావం చూపుతుంది కాబట్టి, వంట చేసేటప్పుడు మనసు ప్రశాంతంగా ఉండటం చాలా అవసరం. నిశ్శబ్దంగా, ఏకాగ్రతతో వంట చేయడం వల్ల మనస్సులోని ఒత్తిడి తగ్గి, ఒక రకమైన ప్రశాంతత లభిస్తుంది. అందుకే పూర్వీకులు వంట చేసేటప్పుడు అనవసరమైన మాటలు తగ్గించి, దైవచింతనతో లేదా మౌనంగా ఉండాలని సూచించేవారు.ప్రస్తుత ఉరుకుల పరుగుల జీవితంలో చాలామంది టీవీ చూస్తూనో లేదా ఫోన్ మాట్లాడుతూనో వంట పనులు కానిచ్చేస్తుంటారు. దీనివల్ల వంటపై ఉండాల్సిన ఏకాగ్రత దెబ్బతింటుంది, ఇది అటు శారీరక ఆరోగ్యానికి, ఇటు మానసిక స్థితికి ఏమాత్రం మంచిది కాదు. పరధ్యానంలో వంట చేయడం వల్ల పదార్థాల మోతాదులు మారడమే కాకుండా, ఆ వంటకాల్లో నాణ్యత కూడా లోపించే అవకాశం ఉంది. మౌనంగా ఉండి వంట చేసినప్పుడు మన చేతికి, మెదడుకి మధ్య సరైన సమన్వయం కూదిరి పనిలో వేగం పెరుగుతుంది.వంట చేసే వ్యక్తి ఎంత సంతోషంగా, ప్రశాంతంగా ఉంటే ఆ వంటకాలు అంత రుచికరంగా తయారవుతాయని నిపుణులు నమ్ముతారు. వంట చేసేటప్పుడు మనలో కలిగే సానుకూల భావనలు ఆ ఆహార పదార్థాల ద్వారా కుటుంబ సభ్యులకు అందుతాయి. మౌనం పాటిస్తూ వంట చేయడం వల్ల ఆ పని పట్ల గౌరవం పెరుగుతుంది, తద్వారా వంట వండటం అనేది ఒక భారంగా కాకుండా ఒక కళగా మారుతుంది. ఏకాగ్రతతో వండిన భోజనం రుచిలోనే కాదు, అందించే తృప్తిలో కూడా ప్రత్యేకంగా ఉంటుంది. సంపూర్ణ ఆరోగ్యం కేవలం మనం తినే తిండి మీద మాత్రమే కాదు, ఆ ఆహారాన్ని ఎలా వండాము అనే దానిపై కూడా ఆధారపడి ఉంటుంది. వంటగదిని ఒక పవిత్రమైన స్థలంగా భావించి, అక్కడ ప్రశాంత వాతావరణాన్ని అలవాటు చేసుకోవడం మన జీవనశైలిలో గొప్ప మార్పును తెస్తుంది. ఏకాగ్రతతో వంట చేయడం వల్ల అజాగ్రత్త వల్ల జరిగే ప్రమాదాలను కూడా నివారించవచ్చు. అందుకే రేపటి నుండి మీ వంట గదిలో ఫోన్లను పక్కన పెట్టి, మౌనంగా వంట చేసి ఆ తేడాను మీరే గమనించండి.

# ఆ సమస్యలకు దివ్యౌషధం



జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస్), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయి.. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది.. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుంద ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. జామ పండ్లు చవకగా లభించే పోషకాల గని.. అందుకే దీన్ని పేదవాడి ఆపిల్ అని కూడా పిలుస్తారు. దీనిలో ఎన్నో పోషకాలు దాగున్నాయి.. అయితే, జామ పండ్లతో పాటు దాని ఆకులు కూడా అనేక ఔషధ గుణాలను కలిగి ఉన్నాయని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఈ ఆకుల్లోని ఔషధ గుణాలను ఆధునిక పరిశోధనలు కూడా ధృవీకరిస్తున్నాయి. కొన్ని సాధారణ ఆరోగ్య సమస్యలకు జామ ఆకులతో ఇంట్లోనే చికిత్సలను తయారు చేసుకోవచ్చని ఆరోగ్య నిపుణులు పేర్కొంటున్నారు. జామ ఆకులు యాంటీఆక్సిడెంట్లు, విటమిన్ సి, యాంటీమైక్రోబయల్ గుణాలను కలిగి ఉన్నాయి.. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను తగ్గించడం, జీర్ణక్రియను మెరుగుపరచడం, బరువు తగ్గడం, నోటి ఆరోగ్యం, గుండె ఆరోగ్యానికి అద్భుతమైన ఔషధంగా పనిచేస్తాయని పేర్కొంటున్నారు. ముఖ్యంగా.. జామ ఆకులు ప్రధానంగా షుగర్ (డయాబెటిస్), కీళ్లనొప్పులు, నోటిపూత వంటి సాధారణ సమస్యలకు సమర్థవంతంగా పనిచేస్తాయని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు. డయాబెటిస్‌లో, జామ ఆకుల కషాయం రక్తంలోని గ్లూకోజ్ స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. కాంప్లెక్స్ కార్బోహైడ్రేట్లు గ్లూకోజ్‌గా మారే వేగాన్ని తగ్గిస్తుంది.కీళ్లనొప్పులు, ముఖ్యంగా వాపులతో కూడిన వాటికి, జామ ఆకుల ముద్దను గోరువెచ్చగా చేసి పట్టులా వేయడం వల్ల నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది.అంతేకాకుండా, జామ ఆకుల యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాల వల్ల పంటినొప్పి, చిగుళ్ల వాపు, నోటిపూత వంటి నోటి సంబంధిత సమస్యలకు ఇవి అద్భుతంగా పనిచేస్తాయి.ఆకుల కషాయంతో పుక్కిలించడం ద్వారా ఉపశమనం పొందవచ్చు. కడుపునొప్పి, వాంతులకు కూడా యాంటీ బ్యాక్టీరియల్ గుణాలున్న ఈ ఆకుల కషాయం ఉపయోగిస్తారు. ఈ విధంగా, జామ ఆకులతో అనేక ఆరోగ్య ప్రయోజనాలు దాగున్నాయి. అవసరాన్ని బట్టి వీటిని సరైన పద్ధతిలో ఔషధం కింద వాడుకోవడం ద్వారా ఆరోగ్యకరమైన జీవనాన్ని పొందవచ్చంటున్నారు ఆరోగ్య నిపుణులు. జామ ఆకులను టీ రూపంలో లేదా లేత ఆకులను నమలడం ద్వారా ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు.. అంతేకాకుండా.. వీటి రసాన్ని కూడా తీసుకోవచ్చు.. అయితే.. ఉదయాన్నే తీసుకుంటే మంచిది..

# గోళ్లు కొరుకుతున్నారా.. రోగాలు రావడం ఖాయం



ఖాళీగా ఉన్నప్పుడో, ఏదైనా దీర్ఘంగా ఆలోచిస్తున్నప్పుడో తెలియకుండానే వేళ్లు నోట్లోకి వెళ్తున్నాయా..? పళ్లతో గోళ్లను కొరుకుతున్నారా..? చాలామంది దీనిని లైట్ తీసుకుంటారు కానీ దీన్నివల్ల మీరు ప్రమాదంలో పడతారు. ఈ చిన్న వ్యసనం మీ శరీరాన్ని లోపల నుండి గుల్ల చేస్తుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనం రోజంతా మొబైల్ ఫోన్లు, కీబోర్డులు, తలుపు హ్యాండిల్స్, డబ్బు వంటి ఎన్నో వస్తువులను తాకుతాము. మన కంటికి కనిపించని వేలాది బ్యాక్టీరియా, క్రిములు గోళ్ల కింద చేరుతాయి. వాటిని కొరికినప్పుడు ఆ క్రిములు నేరుగా కడుపులోకి వెళ్లి విరేచనాలు, వాంతులు, తీవ్రమైన కడుపు నొప్పికి దారితీస్తాయి. నిరంతరం గోళ్లు కొరకడం వల్ల దంతాల ఆకారం దెబ్బతినడమే కాకుండా చిగుళ్లు బలహీనపడి ఇన్ఫెక్షన్లు వస్తాయి. మనస్తత్వవేత్తల అభిప్రాయం ప్రకారం.. ఇది కేవలం శారీరక అలవాటు మాత్రమే కాదు.. ఒక మానసిక సంకేతం. మెదడు ఒత్తిడికి గురైనప్పుడు ఇలాంటి పనులు చేయిస్తుంది. ఏమీ తోచనప్పుడు కూడా మనసు ఒక సౌకర్యవంతమైన చర్య కోసం గోళ్లను ఆశ్రయిస్తుంది.ఈ చెడు అలవాటుకు స్వస్తి పలకడం అసాధ్యమేమీ కాదు. గోళ్లు ఎప్పుడూ చిన్నగా, శుభ్రంగా ఉంటే కొరకడానికి అవకాశం ఉండదు. మెడికల్ షాపుల్లో దొరికే చేదుగా ఉండే నెయిల్ ఉత్పత్తులను వాడండి. నోట్లో వేలు పెట్టగానే ఆ చేదు వల్ల అలవాటు గుర్తుకొచ్చి ఆపేస్తారు.స్ట్రెస్ బాల్స్ లేదా పెన్నులతో ఆడటం ద్వారా చేతులకు పని చెప్పండి. దీంతో గోళ్ల జోలికి వెళ్లకుండా ఉంటారు. ఒత్తిడి వల్ల ఇలా చేస్తుంటే.. కాసేపు ప్రశాంతంగా గాలి పీల్చుకోవడం లేదా సంగీతం వినడం ద్వారా మనసును మళ్లించండి. గోళ్లు కొరకడం అనేది కేవలం అందానికి సంబంధించిన విషయం కాదు.. అది మీ ఆరోగ్యానికి సంబంధించిన ప్రశ్న. చిన్న వయసులోనే ఈ అలవాటును గుర్తిస్తే త్వరగా మానుకోవచ్చు. సమస్య తీవ్రంగా ఉంటే డాక్టర్‌ను సంప్రదించడం ఉత్తమం.

# మూడు కార్పొరేషన్లుగా మహానగరం

**హైదరాబాద్ :** హైదరాబాద్ మహానగర పాలనలో తెలంగాణ ప్రభుత్వం కీలక మార్పులకు శ్రీకారం చుట్టింది. పాలనా సౌలభ్యం, అధికార వికేంద్రీకరణ లక్ష్యంగా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ)ను మూడు కార్పొరేషన్లుగా విభజించింది. ఈ మేరకు బుధవారం అధికారికంగా ఉత్తర్వులు జారీ చేసింది. పునర్వ్యవస్థీకరించిన జీహెచ్ఎంసీతో పాటు, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (అఓఅ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఓఓఅ) పేరుతో రెండు కొత్త సంస్థలను ఏర్పాటు చేసింది. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని ప్రభుత్వం స్పష్టం చేసింది. నగర జనాభా, విస్తీర్ణం వేగంగా పెరుగుతున్న నేపథ్యంలో పౌర సేవలను ప్రజలకు మరింత చేరువ చేసేందుకు, జవాబుదారీతనాన్ని పెంచేందుకే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ప్రభుత్వం పేర్కొంది. జీహెచ్ఎంసీ చట్టం, 1955లోని సెక్షన్ 3(1) ప్రకారం ఈ విభజన ప్రక్రియను పూర్తి చేశారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్ ఈ ఉత్తర్వులపై సంతకం చేశారు. ప్రభుత్వం మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. ప్రస్తుత జీహెచ్ఎంసీ కమిషనర్‌గా ఉన్న ఆర్.వి. కర్ణన్‌ను అదే పదవిలో కొనసాగించింది. జీహెచ్ఎంసీ అదనపు కమిషనర్లుగా పనిచేస్తున్న జి. సృజనను సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా, టి. వినయ్ కృష్ణారెడ్డిని మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా నియమించింది. ఈ మూడు కార్పొరేషన్ల మధ్య సమన్వయం కోసం జయేష్ రంజన్‌ను ప్రత్యేక అధికారిగా నియమిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది. కొత్తగా ఏర్పడిన కార్పొరేషన్ల పరిధిని జోన్ల వారీగా స్పష్టంగా నిర్వచించారు.

జీహెచ్ఎంసీ: శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్లు.

సైబరాబాద్ కార్పొరేషన్: శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్లు.

మల్కాజ్‌గిరి కార్పొరేషన్: మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్.బి. నగర్ జోన్లు.

విభజన నేపథ్యం



గత ఏడాది డిసెంబర్‌లో 27 చుట్టుపక్కల పట్టణ స్థానిక సంస్థలను జీహెచ్ఎంసీలో విలీనం చేయడంతో దాని పరిధి సుమారు 2,000 చదరపు కిలోమీటర్లకు విస్తరించింది. ఈ నేపథ్యంలో వార్డుల సంఖ్యను 150 నుంచి 300కు, సర్కిళ్ల సంఖ్యను 30 నుంచి 60కి పెంచుతూ డిలిమిటేషన్ ప్రక్రియ చేపట్టారు. పెరిగిన పరిధికి అనుగుణంగా పాలనను సులభతరం చేసేందుకే తాజాగా ఈ మూడు కార్పొరేషన్ల ఏర్పాటుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. మొత్తం 60 సర్కిళ్లలో జీహెచ్ఎంసీకి 30, సైబరాబాద్‌కు 16, మల్కాజ్‌గిరికి 14 సర్కిళ్లను కేటాయించారు. ఈ విభజనతో మూడు కార్పొరేషన్లు ప్రత్యేక చట్టబద్ధ సంస్థలుగా తమ కార్యకలాపాలు నిర్వహిస్తాయి. కాగా, సైబరాబాద్ నూతన కమిషనర్‌గా జి. సృజన ఇప్పటికే బాధ్యతలు స్వీకరించారు. ఈ పునర్వ్యవస్థీకరణ ద్వారా మౌలిక సదుపాయాల కల్పన వేగవంతం కావడంతో పాటు, స్థానిక సమస్యలు త్వరితగతిన పరిష్కారమవుతాయని అధికారులు భావిస్తున్నారు.

# 'డిజిటల్ అరెస్ట్' పేరుతో రూ.1.07 కోట్ల మోసం

**ఢిల్లీ ముఠాను పట్టుకున్న హైదరాబాద్ పోలీసులు**

**మోసానికి సహకరించిన ఢిల్లీకి చెందిన ముగ్గురు సభ్యుల అరెస్ట్**

**ముంబై పోలీసులమంటూ బెదిరించి డబ్బులు కాజేసిన సైబర్ నేరగాళ్లు**

**అమాయకుల బ్యాంకు ఖాతాలను వాడుకొని మోసాలకు పాల్పడుతున్న ముఠా**

**అపరిచితులకు బ్యాంకు ఖాతాలు ఇవ్వొద్దని పోలీసుల హెచ్చరిక**

డిజిటల్ అరెస్ట్ పేరుతో నగరానికి చెందిన ఒక వ్యక్తిని భయపెట్టి రూ.1.07 కోట్లు కాజేసిన సైబర్ మోసంలో కీలకపాత్ర పోషించిన ముగ్గురు సభ్యులను అరెస్ట్ చేసినట్లు హైదరాబాద్ సిటీ సైబర్ క్రైమ్ డీసీపీ వి. అరవింద్ బాబు తెలిపారు. నిందితులు ఢిల్లీకి చెందినవారని, వీరు మోసగాళ్లకు బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తూ ఈ నేరానికి సహకరించారని ఆయన వెల్లడించారు. ఇటీవల నగరానికి చెందిన బాధితుడికి ఫోన్ చేసిన సైబర్ నేరగాళ్లు తాము ముంబై క్రైమ్ బ్రాంచ్ అధికారులమని పరిచయం చేసుకున్నారు. అతని ఆధార్ కార్డు, ఫోన్ నంబర్‌పై మనీ లాండరింగ్ కేసు నమోదైందని, వెంటనే అరెస్ట్ చేస్తామని బెదిరించారు. విచారణ పేరుతో "డిజిటల్ అరెస్ట్" చేసి, పలు దఫాలుగా రూ.1.07 కోట్లను వేర్వేరు బ్యాంకు ఖాతాల్లోకి బదిలీ చేయించుకున్నారు. బాధితుడి ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు, డబ్బు బదిలీ అయిన ఖాతాల ఆధారంగా



దర్యాప్తు చేపట్టారు. మొదట దీపక్, ప్రశాంత్ కుమార్ అనే ఇద్దరు ఖాతాదారులను అరెస్ట్ చేశారు. వారిచ్చిన సమాచారంతో, ఈ మోసానికి బ్యాంకు ఖాతాలను సరఫరా చేస్తున్న ప్రధాన సూత్రధారులు గుర్దీప్ సింగ్, హర్‌ప్రీత్ సింగ్, కుమార్ మోహిత్‌లను ఢిల్లీలో అరెస్ట్ చేశారు. ఈ ముఠా ఢిల్లీ, జైపూర్ వంటి నగరాల్లోని హోటళ్లలో ఉంటూ, డబ్బు అవసరం ఉన్నవారికి కమిషన్ ఆశ చూపి వారి బ్యాంకు ఖాతాలను సేకరించి మోసాలకు వాడుతున్నట్లు తేలింది. వీరికి గుజరాత్, కేరళ, మహారాష్ట్ర వంటి ఇతర రాష్ట్రాల్లో జరిగిన సైబర్ నేరాలతోనూ సంబంధాలున్నట్లు పోలీసులు గుర్తించారు. ఈ సందర్భంగా డీసీపీ అరవింద్ బాబు మాట్లాడుతూ, "అపరిచితులకు కమిషన్ ఆశతో బ్యాంకు ఖాతాలు ఇస్తే చట్టపరమైన చర్యలు తప్పవు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీ, ఆధార్ వంటివి ఎవరితోనూ పంచుకోవద్దు" అని ప్రజలను హెచ్చరించారు.

## సింగరేణి పెన్షన్ సవరణకు కీలక అడుగు

**పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ**



**పెద్దపల్లి :** సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల పెన్షన్ పెంపుదల కోసం చేస్తున్న ప్రయత్నాలకు కేంద్ర ప్రభుత్వం నుంచి కీలక స్పంద న వచ్చిందని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీ కృష్ణ మీడి యాకు తెలిపారు. యాక్చురియల్ రిపోర్ట్ ఆధారం గా సింగరేణి పెన్షన్ సవరణ చేపట్టేందుకు కేంద్ర బొగ్గు గనుల శాఖ ముందడు గు వేసిందని, ఈ అంశంపై ఎంపీ వంశీకృష్ణ గత 6 న కేంద్ర బొగ్గు గనుల శాఖకు లేఖ రాసి, పెన్షన్ పెంపు, యాక్చురియల్ రీఅసెస్మెంట్ నిర్వహించాలని కోరారు. ఈ లేఖకు తాజాగా స్పందించిన కేంద్ర బొగ్గు గనుల శాఖ అండర్ సెక్రటరీ రూపిందర్ బ్రార్, గతేడాది డిసెంబర్ 22న సీపీఎఫ్ఓ ట్రస్టీల సమావేశం నిర్వహిం చామని లేఖలో వెల్లడించారు. ఆ సమావేశం లో పెన్షన్ నిధి మూల్యాంకనంతో పాటు యాక్చురీని నియమించాలనే నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ యాక్చురీ పెన్షన్ పెంపు, నిధుల స్థితి, ఇతర కీలక అంశాలను సమగ్రంగా పరిశీ లించి నివేదిక అందించ నుందన్నా రు. ఆ యాక్చురీ రిపోర్ట్ ఆధారంగా సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్ సవరణ చేపట్టనున్నారు. దీంతో సింగరేణి రిటైర్డ్ కార్మికుల పెన్షన్‌ను రూ.10 వేల వరకు పెంచాలని శక్తివంచన లేకుం డా పోరాడుతున్నానని ఆయ న పేర్కొన్నారు. సింగరేణి రిటైర్డ్ కార్మికులకు మరోసారి మాట ఇస్తున్నానని మీ పెన్షన్ పెరిగే వరకు నా పోరాటం ఆగదని తెలిపారు. ఈ విషయంలో మీకు పూర్తి భరోసా ఇస్తున్నానని ఎంపీ గడ్డం వంశీ కృష్ణ స్పష్టం చేశారు.

## రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటాం

**రేవంత్ రెడ్డి సర్కార్ కు బ్రహ్మరథం.**

**ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు**



**కమాన్ పూర్ :** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా మున్సిపాలిటీలను కైవసం చేసుకుంటామని రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబు అన్నారు. బుధవారం ఉదయం కమాన్ పూర్ క్రాస్ రోడ్డు వద్ద ఆయన పలువురు కాంగ్రెస్ నాయకులతో కలిసి విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల జరిగిన సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తెలంగాణ వ్యాప్తంగా ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. అలాగే ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రామగుండం, కరీంనగర్, కార్పొరేషన్లను పూర్తిస్థాయిలో కాంగ్రెస్ కార్పొరేటర్ గెల్పొంది ఆయా రెండు పీఠాలను హస్తగతం చేసుకుంటామని స్పష్టం చేశారు. పెద్దపల్లి జిల్లాలోని సుల్తానాబాద్ మంథని పెద్దపల్లి అలాగే కరీంనగర్ జిల్లాలోని మొత్తం మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుంది అని అన్నారు. ముఖ్యంగా రేవంత్ రెడ్డి పాలనకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని ఇచ్చిన ఆరు గ్యారంటీలు పూర్తిస్థాయిలో అమలు చేయడం జరుగుతుందని స్పష్టం చేశారు. గతంలో గ్రామీణ ప్రాంతాల ప్రజలు సర్పంచ్ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థులను ఓటు వేశారని ఆయన స్పష్టం చేశారు. ప్రస్తుతం పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ హవా కొనసాగుతోందని పేర్కొన్నారు. అన్ని స్థానాల్లో స్థానాల్లో భారీ మెజార్టీతో గెలుపొందడం ఖాయమని అన్నారు. రాష్ట్రంలో రేవంత్ రెడ్డి పాలన లో ప్రజలు ఆనందంగా ఉన్నారని అలాగే మా టిపిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ నేతృత్వంలో కాంగ్రెస్ పార్టీ పూర్తిస్థాయిలో బలోపేతం అయిందని అన్నారు. ఇచ్చిన వాగ్దానాల్లో ఉచిత బస్సు, ఉచిత విద్యుత్తు, రైతులకు నాణ్యమైన విత్తనాలు అందజేయడం జరుగుతుందని అన్నారు. నేడు తెలంగాణలోని ప్రతి ఒక్కరి కళ్ళలో కాంగ్రెస్ పాలనలో ఆనందం వెల్లివిరుస్తోందని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో కమాన్ పూర్ సర్పంచ్ రంగు సత్యనారాయణ గౌడ్, మాజీ ఎంపీపీ కోలేటి మారుతి, మాజీ సింగల్ విండో చైర్మన్ ఇనగంటి భాస్కరరావు, పేరా పల్లి సర్పంచ్ బొంగుని సదయ్య గౌడ్, గుండారం ఉపసర్పంచ్ అంబిరి రాజేందర్, వార్డు సభ్యులు పిడుగు సది, గరిగంటి కృష్ణ,బొడ్డు రవి, పిడుగు కవిత, రాచకొండ రజిత, మాజీ సర్పంచ్ ఆకుల ఓదెలు , ఆడువాలా చంద్రయ్య తోపాటు నాయకులు పిడుగు శంకర్, మతిన్ ఖాన్ ఇక్బాల్, లల్లు, వడ్లకొండ శంకర్, తదితరులు పాల్గొన్నారు.

## పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన అదనపు కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో సిరిసిల్ల మున్సిపాలిటీ పరిధిలోని పలు పోలింగ్ కేంద్రాలను అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ బుధవారం పరిశీలించారు. కుసుమ రామయ్య ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ కేంద్రం, నెహ్రూనగర్ లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ఇందిరా నగర్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ సరళిని, హెల్ప్ డెస్క్, మెడికల్ క్యాంప్ ను పరిశీలించారు. పరిశీలనలో ఆర్డీఓ వెంకటేశ్వర్లు, తహసీల్దార్ మహేష్ కుమార్ తదితరులు ఉన్నారు.

## వెబ్ కాస్టింగ్ సెంటర్‌ను పరిశీలించిన ఇంచార్జి కలెక్టర్

**రాజన్న సిరిసిల్ల :** మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని సిరిసిల్ల, వేములవాడ మున్సిపల్ పరిధిలోని పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ ను జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో సెంటర్ ద్వారా ఇంచార్జి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి గరిమ అగ్రవాల్ బుధవారం పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్ కొనసాగుతుండగా, ఐడీఓసీలోని సెంటర్ ద్వారా పరిశీలించారు. సెంటర్ లోని సిబ్బందికి సూచనలు చేశారు. పరిశీలనలోఈడీఎం శ్రీనివాస్, కలెక్టరేట్ పర్యవేక్షకులు ప్రవీణ్, శ్రావణ్, సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పోలింగ్ కేంద్రాలను సందర్శించిన వరంగల్ పోలీస్ కమిషనర్

**వరంగల్ :** పోలీస్ కమిషనరేట్ పరిధిలోని ఐదు మున్సిపాలిటీలలో బుధవారం ఎన్నికలు జరుగుతుండడంతో, వర్ధన్నపేట మున్సిపల్ పరిధిలో ఎన్నికలు జరుగుతున్న రెండు పోలింగ్ కేంద్రాలతో పాటు ఘన్పూర్ మున్సిపల్ సంబంధించి రెండు పోలింగ్ కేంద్రాలను వరంగల్ పోలీస్ కమిషనర్ సన్ ప్రీతిసింగ్, సందర్శించి పోలింగ్ జరుగుతున్న తీరును పరిశీలించడంతో పాటు, ఎన్నికలను సజావుగా జరిగేందుకు పోలీస్ బందోబస్తు ఏర్పాట్లపై పోలీస్ కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించడంతో సంబంధిత పోలింగ్ స్టేషన్ ఇంచార్జ్ అయిన పోలీస్ అధికారులకు పలు సూచనలు చేశారు. పోలీస్ కమిషనర్ వెంట ట్రైనీ ఐపిఎస్ మనీషా నెహ్రా, ఏసీపీలు నర్సయ్య, భీం శర్మతో పాటు ఇన్స్ స్పెక్టర్లు, ఎస్.ఐ లు వున్నారు.

## టెట్ లో 51 శాతం ఉత్తీర్ణత

**హైదరాబాద్ :** తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష జనవరి 2026 ఫలితాలు విడుదలయ్యాయి. పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ డాక్టర్ ఇ. నవీన్ నికోలస్ మంగళవారం ఈ ఫలితాలను ప్రకటించారు. మొత్తం మీద 51.37 శాతం మంది అభ్యర్థులు అర్హత సాధించగా, ఈసారి ప్రభుత్వ ఉపాధ్యాయుల ఫలితాలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఉద్యోగంలో కొనసాగాలంటే టెట్ తప్పనిసరిగా పాస్ కావాలని సుప్రీంకోర్టు ఆదేశించిన నేపథ్యంలో వేలమంది ప్రభుత్వ టీచర్లు అర్హత సాధించలేకపోవడం చర్చనీయాంశంగా మారింది. తాజా ఫలితాల ప్రకారం పరీక్షకు హాజరైన ప్రభుత్వ ఉపాధ్యాయుల్లో 57.76 శాతం మంది (37,893 మంది) అర్హత సాధించారు. ఇతర అభ్యర్థుల ఉత్తీర్ణత శాతం (48.14 శాతం)తో పోలిస్తే ప్రభుత్వ టీచర్ల పనితీరు మెరుగ్గా ఉన్నప్పటికీ, గణనీయ సంఖ్యలో టీచర్లు విఫలమయ్యారు. మొత్తం మీద పరీక్ష రాసిన 1,95,181 మందిలో 1,00,270 మంది ఉత్తీర్ణులయ్యారు. టెట్ ప్రవేశపెట్టక ముందు నియమితులైన ప్రభుత్వ ఉపాధ్యాయులు రెండేళ్లలోపు టెట్‌లో అర్హత సాధించాలని గత ఏడాది సెప్టెంబర్‌లో సుప్రీంకోర్టు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది. ఈ గడువులోగా ఉత్తీర్ణత సాధించలేకపోతే ఉద్యోగం కోల్పోవాల్సి వస్తుందని హెచ్చరించింది. ఈ నేపథ్యంలో తాజా ఫలితాలు సర్వీసులో ఉన్న టీచర్లకు కీలకంగా మారాయి. టెట్‌లో అర్హత సాధించలేకపోయిన ఉపాధ్యాయులు తమ ఉద్యోగాలను నిలుపుకోవడానికి ఇంకా అవకాశం ఉంది. సుప్రీంకోర్టు నిర్దేశించిన రెండేళ్ల గడువులోపు జరిగే తదుపరి టెట్ పరీక్షల్లో వారు తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాల్సి ఉంటుంది. టెట్ క్వాలిఫైయింగ్ సర్టిఫికెట్‌కు జీవితకాల వ్యాలిడిటీ ఉండటంతో పాటు, ఉపాధ్యాయ నియామక పరీక్ష లో 20 శాతం వెయిటేజీ లభిస్తుంది.

## పోలింగ్‌లో ఉద్రిక్తత

**అదిలాబాద్ :** ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని 11వ వార్డు రాంనగర్ పోలింగ్ కేంద్రంలో బుధవారం ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఓటు వేసేందుకు వచ్చిన పర్వీన్ అనే మహిళను పోలీసులు తనిఖీ చేయగా, ఆమె వద్ద కత్తి లభ్యమైంది. వెంటనే స్పందించిన మహిళా పోలీసులు కత్తిని స్వాధీనం చేసుకుని, ఆమెను మావల పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఆమెతో పాటు ఆమె భర్తను సైతం అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్ కు తరలించి విచారణ చేపట్టారు. ఎన్నికల వేళ ఆయుధంతో రావడంతో తోటి ఓటర్లు భయాందోళనకు గురయ్యారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా 10 మున్సిపాలిటీలు, 1 కార్పొరేషన్ కు ఉదయం 7 గంటలకు ప్రారంభమైన మున్సిపల్ ఎన్నికల పోలింగ్ మందకొడిగా కొనసాగుతోంది. ఆదిలాబాద్ లో పలు చోట్ల ఓటర్లను ప్రలోభపెట్టేందుకు డబ్బులు పంచుతున్నారన్న సమాచారంతో పోలీసులు పలువురిపై కేసులు నమోదు చేశారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘిస్తూ డబ్బులు పంచుతున్న ఇద్దరిపై ఆదిలాబాద్ వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కాటిపెల్లి రాజారెడ్డి నుంచి రూ.3,440, మేకల కృష్ణ కుమార్ నుంచి రూ.2,700 నగదును స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సునీల్ కుమార్ తెలిపారు. పోలింగ్ కేంద్రాల సమీపంలో ఓటర్లను ప్రలోభపెట్టేందుకు ప్రయత్నించిన వీరిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నామన్నారు. కేసు దర్యాప్తులో ఉందని వెల్లడించారు. ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తూ ఓటర్లను ప్రలోభపెట్టే ఉద్దేశంతో అరటిపళ్ళు పంచుతున్న వ్యక్తిపై ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కె. నాగరాజు తెలిపారు. ఆదిలాబాద్ టూ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మివాడలో ఓటు వేయడానికి వెళ్తున్న ఓటర్లకు అరటిపళ్ళు పంచుతూ ప్రలోభపెడుతున్న ఆటో డ్రైవర్ మహమ్మద్ అర్షద్‌ను పోలీసులు గుర్తించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించినందుకు అతనిపై కేసు నమోదు చేసి, ఉపయోగించిన ఆటోను సీజ్ చేసినట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఓటర్లను నగదు, బహుమతులు లేదా ఇతర ప్రలోభాలతో ప్రభావితం చేయడం చట్టవిరుద్ధమని, ఇలాంటి చర్యలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తప్పవని సీఐ హెచ్చరించారు. ప్రజలు ఎటువంటి ప్రలోభాలకు లోనుకాకుండా స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఎక్కడైనా ఎన్నికల నియమావళి ఉల్లంఘనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.

## సంగారెడ్డిలో జగ్గారెడ్డి ఫైర్

**మెదక్ :** మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సంగారెడ్డిలో తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. విధుల్లో ఉన్న ఓ సీఐ.. కాంగ్రెస్ అభ్యర్థి కాలర్ పట్టుకున్నట్లు ఆరోపణలు రావడం పెను దుమారానికి కారణం అయింది. విషయం తెలుసుకుని అక్కడికి చేరుకున్న మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి.. పోలీసులతో తీవ్ర వాగ్వాదానికి దిగారు. బీఆర్ఎస్ రిగ్గింగ్‌కు సీఐ సహకరిస్తున్నారని సంచలన ఆరోపణలు చేసిన జగ్గారెడ్డి.. సీఐని సస్పెండ్ చేయకపోతే.. ఎన్నికలను బహిష్కరిస్తామని హెచ్చరికలు చేశారు. రాష్ట్రవ్యాప్తంగా మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతంగా జరుగుతోంది. అక్కడక్కడా చెదురుముదురు ఘటనలు మినహా పోలింగ్ సాధారణంగానే సాగుతోంది. అయితే సంగారెడ్డిలో మాత్రం తీవ్ర ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలింగ్ స్టేషన్ వద్ద ఉన్న ఓ పోలీస్.. కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి పట్ల దురుసుగా ప్రవర్తించారని.. పైగా అతని కాలర్ పట్టుకున్నారని స్వయంగా కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ ఎమ్మెల్యే జగ్గారెడ్డి .. ఆందోళనకు దిగడం పెను దుమారం రేపింది. పోలింగ్ బూత్‌లోకి వెళ్లేందుకు ప్రయత్నించిన జగ్గారెడ్డిని పోలీసులు అడ్డుకోవడంతో అక్కడ పరిస్థితి ఒక్కసారిగా తీవ్ర ఉద్రిక్తంగా మారిందిసంగారెడ్డి మున్సిపాలిటీ పరిధిలోని 34వ వార్డు పోలింగ్ స్టేషన్ వద్ద ఈ సంఘటన చోటు చేసుకుంది. 34 వార్డులో కాంగ్రెస్ పార్టీ తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థి పట్ల.. అక్కడ విధులు నిర్వర్తిస్తున్న సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శివకుమార్ (సీఐ) కాలర్ పట్టుకున్నారని ఆరోపించిన.. జగ్గారెడ్డి పోలింగ్ కేంద్రం వద్దకు చేరుకుని తీవ్రంగా మండిపడ్డారు. పోలింగ్ జరగకుండా ఆపేస్తామని పేర్కొంటూ బలవంతంగా బూత్‌లోకి వెళ్లే ప్రయత్నం చేశారు. ఈ క్రమంలోనే ఆయనను పోలీసులు అడ్డుకోవడంతో.. అక్కడ తీవ్ర వాగ్వాదం, తోపులాట చోటు చేసుకున్నాయి. దీంతో ఆ పోలింగ్ స్టేషన్ వద్దకు కాంగ్రెస్ పార్టీ శ్రేణులు భారీగా తరలి రావడంతో అక్కడ పరిస్థితులు హీటెక్కాయి. 34వ వార్డులో పోటీ చేస్తున్న బీఆర్ఎస్ అభ్యర్థి రిగ్గింగ్ చేసేందుకు ప్రయత్నించగా.. దానికి సీఐ శివకుమార్ సపోర్ట్ చేస్తున్నారని.. జగ్గారెడ్డి పోలీసులపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధర్మఘంట

## బిజినెస్

## వాహనాల రిటైల్ అమ్మకాలకు జీఎస్టీ బూస్ట్



దేశీయ వాహన పరిశ్రమలో కంపెనీలు సరికొత్త రికార్డు అమ్మకాలను సాధించాయి. ఈ ఏడాది జనవరిలో దేశీయ ఆటో పరిశ్రమ రిటైల్ అమ్మకాలు దాదాపు 18 శాతం పెరిగి 27 లక్షల యూనిట్లకు చేరాయని డీలర్ల సంఘం ఫాడా మంగళవారం ప్రకటనలో వెల్లడించింది. గతేడాది పండుగ సీజన్‌కు ముందు కేంద్రం ప్రకటించిన జీఎస్టీ సంస్కరణలకు దోహదపడ్డాయి. గత నెలలో పంటకోత, వివాహ వేడుకల సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో గిరాకీ సానుకూలంగా ఉండటం వంటి అంశాలు కూడా అమ్మకాలు పెరిగేందుకు ప్రధాన కారణాలు. ఫాడా డేటా ప్రకారం, జనవరిలో మొత్తం రిటైల్ అమ్మకాలు 27,22,558 యూనిట్లకు చేరాయి. గతేడాది ఇదే నెలలో 23,14,940 యూనిట్లతో పోలిస్తే ఇది 17.61 శాతం పెరిగింది. ఇందులో ప్యాసింజర్ వాహనాల రిటైల్ అమ్మకాలు 7 శాతం పెరిగి 5,13,475 యూనిట్లుగా నమోదయ్యాయి. మెట్రో ప్రాంతాల్లో కంటే గ్రామీణ ప్రాంతాల్లో అమ్మకాలు 14.43 శాతం పెరిగాయి. పట్టణ ప్రాంతాల్లో మాత్రం 2.75 శాతం వృద్ధి నమోదైంది. ముఖ్యంగా ఎస్‌యూవీ, కాంపాక్ట్ ఎస్‌యూవీ, ఎంట్రీ-లెవల్ కార్లకు తిరిగి డిమాండ్ కనిపిస్తోందని ఫాడా అధ్యక్షుడు సీ ఎస్ విఘ్నేశ్వర్ పేర్కొన్నారు. ద్విచక్ర వాహన విభాగంలో 18,52,870 యూనిట్లు, త్రీ-వీలర్ విభాగంలో 19 శాతం, కమర్షియల్ విభాగంలో 15 శాతం అమ్మకాలు పెరిగాయి. ట్రాక్టర్ అమ్మకాలు అధికంగా 23 శాతం పెరిగాయని ఫాడా వెల్లడించింది.

## గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు




దేశీయ గోల్డ్ ఈటీఎఫ్‌లలో భారీ పెట్టుబడులు పోగవుతున్నాయి. గత కొన్ని నెలలుగా రికార్డు స్థాయిలో ధరలు పెరుగుతుండటంతో గోల్డ్ ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లోకి నిధులు వరదలా వచ్చి చేరుతున్నాయి.
జూ7
మ్యూచువల్ ఫండ్స్ అసోసియేషన్ యాంఫీ విడుదల చేసిన డేటా ప్రకారం, ఈ ఏడాది జనవరి నెలకు సంబంధించి గోల్డ్ ఈటీఎఫ్ విభాగంలో ఏకంగా రూ. 24,039.96 కోట్ల పెట్టుబడులు వచ్చాయి. ఇది గతేడాది జనవరిలో వచ్చిన రూ. 11,647 కోట్ల కంటే రెట్టింపు కావడం విశేషం.అంతేకాకుండా ఇదే నెలలో ఈక్విటీ మ్యూచువల్ ఫండ్లలోకి వచ్చిన రూ. 24,028 కోట్ల కంటే కూడా కూడా ఎక్కువ గోల్డ్ ఈటీఎఫ్‌లలోకి నిధులు రాడం విశేషం. ఇక, ఈక్విటీ మ్యూచువల్ ఫండ్ పెట్టుబడులకు సంబంధించి జనవరి నెలలో నిధులు 14 శాతం తగ్గి రూ. 24,028 కోట్లు వచ్చాయి. ఇవి వరుసగా రెండో నెలా తగ్గుముఖం పట్టాయి. గ్లోబల్ మార్కెట్లలో నెలకొన్న స్తబ్ధత, భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల కారణంగా ఇన్వెస్టర్లు ఈక్విటీల్లో మదుపు చేసేందుకు జాగ్రత్త పడ్డారు. ఇదే సమయంలో బంగారం ధరలు పుంజుకోవడం వల్లనే గోల్డ్ ఈటీఎఫ్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు మొగ్గు చూపారు. దీంతో మ్యూచువల్ ఫండ్ సంస్థల(ఏఎంసీ) నిర్వహణలో ఉన్న మొత్తం ఆస్తుల విలువ రూ. 81.01 లక్షల కోట్లకు చేరింది.

# కాసులు కురిపిస్తోన్న స్టాక్ ఇదే
# లక్ష పెడితే రూ.5.16 లక్షలు

దేశీయ స్టాక్ మార్కెట్లో ప్రస్తుతం తీవ్ర ఒడుదొడుకులకు లోనవుతున్నాయి. అంతర్జాతీయంగా నెలకొన్న అనిశ్చితులు, దేశాల మధ్య యుద్ధాలతో పాటు విదేశీ మదుపరులు భారీగా అమ్మకాలకు దిగుతుండడంతో భారీగా పడుతూ లేస్తూ ట్రేడింగ్ చేస్తున్నాయి.ఇలాంటి అనిశ్చిత పరిస్థితుల్లోనూ ఓ స్టాక్ అదరగొడుతోంది. తమ ఇన్వెస్టర్లపై కాసుల వర్షం కురిపిస్తోంది. కేవలం 6 నెలల కాలంలోనే ఈ స్టాక్ 416 శాతం మేర పెరిగి మల్టీబ్యాగర్ స్టాక్స్‌లో ఒకటిగా నిలిచింది. అదే టేక్ సొల్యూషన్స్ లిమిటెడ్ స్టాక్. ఇది ఒక స్మాల్ క్యాప్ కేటగిరీ స్టాక్. రూ.50 ధర లోపే లభించే మల్టీబ్యాగర్ స్మాల్ క్యాప్ స్టాక్ అయిన టేక్ సొల్యూషన్స్ షేరు దూసుకెళ్తోంది. ఫిబ్రవరి 10వ తేదీన 4.51 శాతం మేర లాభపడి సరికొత్త ఆల్ టైమ్ హై స్థాయిని తాకింది. ఈ స్టాక్ 52 వారాల గరిష్ఠ ధర రూ.46.93 స్థాయిని ఇవాళే టచ్ చేయడం గమనార్హం. ఈ స్టాక్ 52 వారాల కనిష్ఠ ధర రూ.6.51గా ఉంది. అంటే ఏడాదిలోపే దాదాపు 600 శాతం మేర పెరిగింది. దీంతో ఇన్వెస్టర్లకు భారీ లాభాలు అందాయని చెప్పవచ్చు. ఇంట్రాడేలో ఈరోజు స్టాక్ మార్కెట్ సూచీలైన సెన్సెక్స్, నిఫ్టీ 50లూ 0.2 శాతం మేర పెరిగాయి. అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన సానుకూల సంకేతాలు, ఇండియా- యూఎస్ ట్రేడ్ డీల్ ద్వారా సానుకూల ప్రభావంతో కొనుగోళ్ల మద్దతు



కనిపించింది. దీంతో ఈ కంపెనీ స్టాక్ మరింత పెరిగింది. ఈ స్మాల్ క్యాప్ స్టాక్ టేక్ సొల్యూషన్స్ లిమిటెడ్ 52 వారాల కనిష్ఠ స్థాయి రూ.6.51ని 2025 ఏప్రిల్ నెలలోనే టచ్ చేసింది. ఆ తర్వాత వేగంగా కోలుకుని 591 శాతం మేర పెరిగింది. ఈ స్టాక్ తమ ఇన్వెస్టర్లకు మల్టీబ్యాగర్ రిటర్న్ అందించింది. గత ఏడాది కాలంలో ఈ స్టాక్ 303 శాతం మేర లాభాలు ఇచ్చింది. ఇక గత ఆరు నెలల్లో చూసుకుంటే 416 శాతం మేర లాభపడింది. ఆరు నెలల క్రితం లక్ష రూపాయలు పెట్టి షేర్లు కొనుగోలు చేసి ఉంటే ఇప్పుడు ఆ విలువ రూ.5.16 లక్షలకు పైగా అవుతాయి. అలాగే గత 3 నెలల కాలంలోనే పెట్టుబడిని దాదాపు డబుల్ చేసింది. 96 శాతం మేర లాభపడింది. ఇక గత నెల రోజుల్లో ఈ స్టాక్ 9 శాతం లాభాలు ఇచ్చింది. టేక్ సొల్యూషన్స్ ఇటీవలే ఫ్యూచర్ ప్లాన్స్ ప్రకటించింది. ఏఐ ఆధారిత స్మార్ట్ డయాగ్నోస్టిక్ అండ్ ప్రివెంటివ్ హెల్త్ కేర్ యూనిట్ వన్ మినట్ క్లినిక్ ఏర్పాటు చేస్తామని తెలిపింది. భారతీయ ప్రీవెంటివ్ హెల్త్ కేర్ రంగంలో తమ వ్యాపార విస్తరణ చేపట్టే దీర్ఘకాలిక ప్రణాళికల్లో భాగంగా ఈ ఏఐ స్మార్ట్ డయాగ్నోస్టిక్ సెంటర్ ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు సెబీ వద్ద దాఖలు చేసిన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ఈ క్రమంలోనే ఈ స్టాక్ మళ్లీ ఫోకస్ లోకి వచ్చింది. దీంతో ఈరోజు దాదాపు 5 శాతానికిపైగా పెరిగింది.

# హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ నుంచి మరో కొత్త స్కీమ్

దేశంలోని దిగ్గజ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీల్లో ఒకటైన హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ మరో కొత్త స్కీమ్ తీసుకొచ్చింది. చాలా తక్కువ పెట్టుబడితోనే మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసేందుకు అవకాశం కల్పిస్తోంది.అదే హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్. భారత దేశ దీర్ఘకాల వినియోగ వృద్ధి నుంచి ప్రయోజనం పొందే కంపెనీల్లో ఇన్వెస్ట్ చేయడం ద్వారా పెట్టుబడిదారులకు లాభాలు అందించడమే లక్ష్యంగా ఈ న్యూ ఫండ్ ఆఫర్ డిజైన్ చేసినట్లు హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ తెలిపింది. మరి ఈ కొత్త స్కీమ్ గురించిన వివరాలు తెలుసుకుందాం. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ ఫండ్ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 4, 2026 రోజునే ప్రారంభమైంది. ఈ సబ్‌స్క్రిప్షన్ ఫిబ్రవరి 13, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. ఈ స్కీమ్ బెంచ్ మార్కెట్ ఇండెక్స్ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఇండెక్స్ గా ఉంటాయి. దేశీయ వినియోగంపై ఆధారపడే కంపెనీలను అనుసరిస్తూ లాభాలు అందుకోవడమే ఈ స్కీమ్ ప్రధాన లక్ష్యం. ఈ ఇండెక్స్‌లో ఎఫ్ఎంసీజీ, ఆటోమొబైల్, ఆటో కాపొనెంట్స్, కన్స్యూమర్ సర్వీసెస్, కన్స్యూమర్ డ్యూరబుల్స్, హెల్త్ కేర్, టెలికాం వంటి 30 కంపెనీల స్టాక్స్ ఉంటాయి. ఆయా కంపెనీలకు వచ్చే ఆదాయంలో 50 శాతానికిపైగా దేశీయంగానే సమకూరుతోంది. దీంతో దేశీయ వినియోగంపైనే ఆ కంపెనీల వృద్ధి అనేది ఆధారపడుతుంది. హెచ్‌డీఎఫ్‌సీ నిఫ్టీ ఇండియా కన్సంప్షన్ ఫండ్ మేనేజర్లుగా నందితా మెనెజెస్, అరుణ్ అగర్వాల్ పేర్లను కంపెనీ వెల్లడించింది. న్యూ ఫండ్ ఆఫర్ సమయంలో ఇన్వెస్టర్లు కనీసం రూ. 100 ఉన్నా చేరవచ్చు. ఆ తర్వాత రిటైల్ మార్కెట్లోకి ఈ స్కీమ్ వచ్చిన తర్వాత సబ్‌స్క్రిప్షన్, రిడంప్షన్ కోసం సైతం రూ. 100 నుంచి ఇన్వెస్ట్ చేసే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు తెలుస్తోంది. గరిష్ఠంగా ఎంతైనా ఇన్వెస్ట్ చేయవచ్చు. అప్లికేషన్ స్టాంప్ డ్యూటీ సహా ఇతర ట్యాక్సులను కట్ చేసిన తర్వాత యూనిట్ల అలాట్మెంట్ ఉంటుందని కంపెనీ తెలిపింది.




హెచ్‌డీఎఫ్‌సీ అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ లిమిటెడ్ అనేది హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ ఇన్వెస్ట్‌మెంట్ మేనేజర్. దేశంలోని అతిపెద్ద మ్యూచువల్ ఫండ్లలో ఒకటి. ఈ కంపెనీని 1999, డిసెంబర్ 10న ఏర్పాటు చేశారు. అయితే, హెచ్‌డీఎఫ్‌సీ మ్యూచువల్ ఫండ్ కోసం అసెట్ మేనేజ్మెంట్ కంపెనీగా వ్యవహరించేందుకు 2000, జూలై 3న సెబీ నుంచి అనుమతులు ఇచ్చారు. దేశంలోని ప్రముఖ ఏఎంసీల్లో హెచ్‌డీఎఫ్‌సీ ఒకటి. లక్షల మంది ఇందులో పెట్టుబడులు పెడుతున్నారు.

# టీ20 వరల్డ్‌కప్‌లో సూపర్ థ్రిల్లర్..
# రెండో సూపర్ ఓవర్‌లో నెగ్గిన దక్షిణాఫ్రికా

**అహ్మదాబాద్:** టీ20 వరల్డ్‌కప్‌లో ఆఫ్ఘనిస్తాన్, దక్షిణాఫ్రికా మధ్య జరిగిన మ్యాచ్‌లో హైడ్రామా చోటుచేసుకున్నది. సూపర్ థ్రిల్లింగ్‌గా సాగిన ఈ మ్యాచ్‌లో రెండు సార్లు సూపర్ ఓవర్ వరకు వెళ్లింది. చివరకు దక్షిణాఫ్రికా రెండో సూపర్ ఓవర్‌లో 4 రన్స్ తేడాతో విక్టరీ నమోదు చేసింది. ఈ వరల్డ్‌కప్‌లో సూపర్ ఓవర్ వరకు వెళ్లిన తొలి మ్యాచ్ ఇదే. భారీ పవర్ హిట్టర్లు ఉన్న రెండు జట్లు.. మ్యాచ్‌పై చివరి వరకు తమ పట్టును కోల్పోలేదు. ఈ మ్యాచ్‌లో సిక్సర్ల వర్షం కురిసింది. ఫస్ట్ మ్యాచ్‌లో రెండు జట్లు కలిపి 20 సిక్సర్లు కొట్టాయి. ఇక సూపర్ ఓవర్స్‌లో మరో 10 సిక్సర్లు బాదాయి. అహ్మదాబాద్ స్టేడియం బౌండరీల మోతతో హోరెత్తింది. ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా నిర్ణీత ఓవర్లలో ఆరు వికెట్ల నష్టానికి 187 రన్స్ చేసింది. క్వింటెన్ డికాక్ 59, రికల్టన్ 61 రన్స్ చేశారు. అయితే చేజింగ్ మొదలుపెట్టిన ఆఫ్ఘనిస్తాన్‌కు గుర్బాజ్ మంచి స్టార్ట్ ఇచ్చాడు. అతను 42 బంతుల్లో 84 రన్స్ చేశాడు. అజ్మతుల్లా, రషీద్ ఖాన్ కూడా చెలరేగిపోయారు. దీంతో మ్యాచ్ ఆఫ్ఘన్ గెలుస్తుందనుకున్నారు. కానీ ఆఖరి ఓవర్లో 13 రన్స్ అవసరం కాగా .. మ్యాచ్ టై అయ్యింది. 19.4 ఓవర్లలో 187 రన్స్ చేసి ఆఫ్ఘనిస్తాన్ ఆలౌటైంది. మ్యాచ్ టై కావడంతో సూపర్ ఓవర్‌కు వెళ్లింది. ఇక ఫస్ట్ సూపర్ ఓవర్‌లో ముందుగా ఆఫ్ఘనిస్తాన్ బ్యాటింగ్ చేసింది. ఆ ఓవర్‌లో 17 రన్స్ చేసింది ఆఫ్ఘనిస్తాన్. అజ్మతుల్లా 5 బంతుల్లో 16 రన్స్ చేశాడు. అయితే ఆ టార్గెట్‌ను అనూహ్య రీతిలో ఛేజ్ చేసింది దక్షిణాఫ్రికా. ఆఖరి బంతికి



భారీ సిక్సర్ కొట్టిన స్టబ్స్ ఫస్ట్ సూపర్ ఓవర్‌ను తమ ఖాతాలో వేసుకున్నాడు. రెండో సూపర్ ఓవర్‌లో ఫస్ట్ బ్యాటింగ్ చేసిన దక్షిణాఫ్రికా 23 రన్స్ చేసింది. స్టబ్స్ ఓ సిక్సర్ బాదగా, మిల్లర్ రెండు భారీ సిక్సర్లు కొట్టేశాడు. ఇక చేజింగ్‌లో గుర్బాజ్ వరుసగా మూడు సిక్సర్లు కొట్టి దక్షిణాఫ్రికాను వణికించాడు. కానీ ఆఖరి బంతికి క్యాచ్ అవుట్ కావడంతో 4 రన్స్ తేడాతో సఫారీలు విక్టరీ కొట్టారు.

## పాక్ స్పిన్నర్‌కు అశ్విన్ మద్దతు.. నెటిజన్స్ ఫైర్



పాకిస్తాన్ స్పిన్నర్ ఉస్మాన్ తారిఖ్‌కు టీమిండియా స్పిన్ దిగ్గజం రవిచంద్రన్ అశ్విన్ అండగా నిలిచాడు. అతడి బౌలింగ్ యాక్షన్‌ను పెద్దగా తప్పుబట్టాల్సిన పనిలేదన్నాడు. క్రీజు వద్ద కాస్త ఆగి బంతిని రిలీజ్ చేయడంలో తప్పులేదని.. అది అతడి సహజ శైలి అని మద్దతుగా నిలిచాడు.
పాకిస్తాన్ తరఫున గతేడాది అరంగేట్రం చేసిన ఉస్మాన్ తారిఖ్ రైటార్మ్ ఆఫ్ బ్రేక్ స్పిన్నర్. టీ20 ప్రపంచకప్-2026 టోర్నీలో ఆడే పాక్ జట్టులో చోటు దక్కించుకున్న అతడు.. మంగళవారం అమెరికాతో మ్యాచ్‌లో పాల్గొన్నాడు. కొలంబో వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో ఉస్మాన్ తారిఖ్ నాలుగు ఓవర్ల కోటా పూర్తి చేసి 27 పరుగులే ఇచ్చి మూడు వికెట్లు పడగొట్టాడు. అయితే, ఉస్మాన్ ప్రదర్శన కన్నా అతడి బౌలింగ్ యాక్షన్ తీరే నెట్టింట వైరల్‌గా మారింది. సందేహాస్పద రీతిలో అతడు బౌలింగ్ చేశాడంటూ విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో భారత క్రికెటర్ శ్రీవత్స్ గోస్వామి ఘాటుగా స్పందించాడు. "పెనాల్టీ రన్ అప్ సమయంలో ఫుట్‌బాల్‌లో కూడా ఇలాంటివి అనుమతించరు. అతడి బౌలింగ్ యాక్షన్ ఏవిధంగా సమంజసం? సరే సరిగ్గానే బౌలింగ్ చేశాడనుకుందాం. మరి పాజ్ (కాసేపు ఆగడం) ఎందుకు ఇచ్చినట్లు? అది కూడా బంతిని రిలీజ్ చేసే సమయంలో ఇలా ఎందుకు చేశాడు? ఇది కొనసాగకూడదు" అని శ్రీవత్స్.. ఉస్మాన్ బౌలింగ్ చేస్తున్న దృశ్యాన్ని పంచుకున్నాడు. ఇందుకు అశ్విన్ స్పందిస్తూ..
"నిజమే.. ఫుట్‌బాల్‌లో కూడా ఇలాంటివి అనుమతించరు. మరి ఓ బ్యాటర్ స్విట్ హిట్ లేదంటే రివర్స్ షాట్ ఆడుతున్నపుడు అంపైర్ లేదంటే బౌలర్‌కు సమాచారం ఇవ్వకుండానే షాట్లు ఆడతారు కదా. అలాంటపుడు బ్యాటర్ మీద లేని ఆంక్షలు బౌలర్ మీదే ఎందుకు? నిజం చెప్పాలంటే బౌలర్ తన చేతివాటాన్ని మార్చే ముందు కచ్చితంగా అంపైర్‌కు సమాచారం ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నిబంధనను తొలుత మార్చాలి. ఏదేమైనా ఉస్మాన్ బౌలింగ్ యాక్షన్ చట్టబద్ధమా? కాదా? అన్నది ఐసీసీ బౌలింగ్ యాక్షన్ టెస్టింగ్ సెంటర్‌లో మాత్రమే తెలుతుంది.

## స్పోర్ట్స్

## గ్యారీ సోబర్స్‌కి కార్బన్ కాపీ ఈ పిల్లాడు: ఇంగ్లండ్ మాజీ స్టార్ ప్రశంసలు



భారత యువ క్రికెటర్ వైభవ్ సూర్యవంశీపై ఇంగ్లండ్ మాజీ బ్యాటర్ మార్క్ బుచర్ ప్రశంసల వర్షం కురిపించాడు. పద్నాలుగేళ్ల ఈ పిల్లాడిని దిగ్గజ గ్యారీ సోబర్స్‌తో పోల్చాడు. కాగా ఫార్మాట్‌లకు అతీతంగా ధనాధన్ దంచికొడుతూ క్రికెట్ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నాడు వైభవ్. హర్యానాకు చెందిన ఈ కుర్రాడు గతేడాది ఐపీఎల్‌లో సత్తా చాటాడు. అనంతరం ఆస్ట్రేలియా, ఇంగ్లండ్, దక్షిణాఫ్రికా గడ్డ మీద భారత అండర్-19 జట్టు తరఫున అదరగొట్టాడు. యూత్ వన్డేలు, యూత్ టెస్టుల్లో విధ్వంసకర శతకాలు బాది రికార్డులు నెలకొల్పాడు.

### ఫైనల్లోనూ భారీ శతకం

ఇక ఇటీవల ఐసీసీ అండర్-19 వరల్డ్‌కప్-2026 ఫైనల్లోనూ ఇంగ్లండ్‌పై భారీ శతకం (175) బాది టీమిండియాకు టైటిల్ అందించాడు. ఈ నేపథ్యంలో ఇంగ్లండ్ మాజీ క్రికెటర్ మార్క్ బుచర్ వైభవ్ సూర్యవంశీ (ఝఅఎష్ఘుజ రాబతీఝుఝుఅంష్ట్రఱ) ఆట తీరు తనకు వెస్టిండీస్ లెజెండ్ గ్యారీ సోబర్స్‌ను గుర్తుకు తెస్తోందన్నాడు.

### గ్యారీ సోబర్స్‌కి కార్బన్ కాపీ

విజ్డన్ క్రికెట్ వీక్లీ పాడ్‌కాస్ట్‌తో మాట్లాడుతూ.. "వైభవ్‌ను చూడగానే నాకు తొలుత గ్యారీ సోబర్స్ జ్ఞప్తికి వచ్చాడు. విధ్వంసకర రీతిలో బ్యాట్‌ను స్వింగ్ చేయడం.. ఆ టైమింగ్, పరిపూర్ణత సూపర్. అతడి హ్యాండ్ స్పీడ్, క్రీజులో కదిలే విధానం అన్నీ ఆ దిగ్గజం మాదిరే ఉంటాయి. అచ్చం సోబర్స్ లాగే అతడు బ్యాటింగ్ చేస్తున్నాడు. ఇప్పటి వరకు ఏ తరంలోని ఆటగాడు కూడా ఇలా సోబర్స్‌ను నాకు గుర్తుచేయలేదు. అయితే, వైభవ్ మాత్రం తన బ్యాటింగ్ తీరుతో నన్ను కళ్లు తిప్పుకోనివ్వకుండా చేస్తున్నాడు. ముఖ్యంగా బ్యాట్ స్వింగ్ కోసం అతడు కాళ్లను కదిలించే విధానం సూపర్" అని మార్క్ బుచర్ వైభవ్ సూర్యవంశీని కొనియాడాడు.

ధర్మఘంట



# సుహాస్ నాకు ఇండస్ట్రీలో మోస్ట్ సపోర్టీవ్ పర్సన్

టాలీవుడ్ యంగ్ హీరో సుహాస్ కథానయకుడిగా నటిస్తున్న తాజా సినిమా 'హే భగవాన్'. గోపి అచ్చర దర్శకత్వం వహిస్తున్న ఈ మూవీలో శివాని నాగారం హీరోయిన్‌గా నటిస్తోంది. త్రిశూల్ విజనరీ స్టూడియోస్ బ్యానర్ పై బి.నరేంద్ర రెడ్డి నిర్మిస్తున్న ఆ సినిమాకు వివేక సాగర్ సంగీతాన్ని సమకూర్చారు. ఇక వెన్నెల కిశోర్, సుదర్శన్, అన్నపూర్ణమ్మ, యాంకర్ స్రవంతి వంటి ప్రముఖులు కీలక పాత్ర పోషిస్తున్న ఈ సినిమా షూటింగ్ కంప్లీట్ చేసుకుని ప్రజెంట్ పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుపుకుంటుంది. అయితే ఈ సినిమా ఫిబ్రవరి 20న థియేటర్లలో గ్రాండ్‌గా రిలీజ్ కానుంది. దీంతో ప్రమోషన్స్ స్టార్ట్ చేసిన మూవీ టీమ్ వరుస ఇంటర్వ్యూలలో పాల్గొంటూ సినిమాపై ఆసక్తి పెంచుతున్నారు. ఈ క్రమంలో తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న హీరోయిన్ శివాని అక్కడ హీరో సుహాస్ పై ఇంట్రెస్టింగ్ కామెంట్స్ చేసింది. ఆమె మాట్లాడుతూ.. 'నాకు సుహాత్‌తో ఇది రెండో సినిమా. వెరీ స్పెషల్ ఈ మూవీ నాకు.. ఎందుకంటే అంబాజిపేటలో సుహాస్ నాకు అన్ని విషయాల్లో చాలా సపోర్టీవ్‌గా ఉన్నాడు. నాకు ఇండస్ట్రీలో చాలా సపోర్టీవ్ పర్సన్ అంటే సుహాసే. అతను నాకు చాలా హెల్ప్ చేశాడు. ఇప్పుడు ఈ సినిమా నాకు చాలా చాలా స్పెషల్‌గా.. అండ్ అతనితో మరో సారి స్క్రీన్ షేర్ చేసుకోవడం వెరీ వెరీ హ్యాపీగా ఉంది' అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఆమె చేసిన కామెంట్స్ నెట్టింట వైరల్‌గా మారాయి.

# నిన్న, మొన్న జరిగినట్లే ఉంది.. ఎంత అందమైన అనుభూతి!

ఎంతటి దూర ప్రయాణమైనా ఒక్క అడుగుతోనే మొదలవుతుంది. ఒక్క అడుగు పడిందంటే ఎంతో కొంత విజయం లభించినట్లే! అలా తన సినీ ప్రస్థానానికి పునాది వేసిన తొలి సినిమాను గుర్తు చేసుకున్నారు మెగాస్టార్ చిరంజీవి. 1979లో వచ్చిన పునాదిరాళ్లు సినిమాతో చిరంజీవి నటప్రస్థానం మొదలైంది. తొలి మెట్టుకే విజయాన్ని అందుకుని గుండె నిండా ధైర్యంతో ముందడుగు వేశారు. తనను తాను చెక్కుకుంటూ అంచెలంచెలుగా ఎదిగి పేరు ప్రఖ్యాతలు సంపాదించారు.

**చందమామ కథలాంటి అనుభూతి**

తాజాగా ఆయన పునాదిరాళ్లు సెట్‌లో అడుగుపెట్టిన జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. "ఈరోజు "పునాదిరాళ్లు" సినిమా కోసం జీవితంలో కెమెరా ముందు నిలిచిన తొలి రోజు. ఆ రోజు నాలో కలిగిన ఆతృత, ఆనందం, బాధ్యత, భావోద్వేగం మాటల్లో వర్ణించలేను. ఆ క్షణం ఇప్పటికీ నిన్న, మొన్న జరిగిందేమో అన్నట్టు అనిపిస్తుంది. ఒక అందమైన చందమామ కథ లాంటి అనుభూతి.

**నట జీవితానికి పునాది రాళ్లు**

ఈ ప్రత్యేక సందర్భంలో, నాకు ఆ తొలి అవకాశం ఇచ్చిన ఆ చిత్ర దర్శక, నిర్మాతలకు హృదయపూర్వకంగా కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నాను. వారి నమ్మకం, ప్రోత్సాహంతో వచ్చిన అవకాశంతో నటనలో నా ప్రయాణానికి పునాది రాళ్లు పడ్డాయి. ఆ రోజు నుంచి ఈ రోజు వరకూ నన్ను ఆదరిస్తూ, ఆశీర్వదిస్తున్న ప్రేక్షకులందరికీ నా కృతజ్ఞతలు" అని ట్వీట్ చేశారు. తన ఫస్ట్ మూవీ చిత్రీకరణ సమయంలో దిగిన ఫోటోలను ఈ పోస్ట్‌కు జత చేశారు.




# వెంకీ మామ కోసం స్క్రిప్ట్ వర్క్‌లో అనుదీప్.. గ్రీన్ సిగ్నల్ ఇచ్చేనా?

టాలీవుడ్‌లో కామెడీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే విక్టరీ వెంకటేష్, తనదైన మార్క్ 'సెటైరికల్' హాస్యంతో ప్రేక్షకులను అలరించే దర్శకుడు కేవీ అనుదీప్ చేతులు కలపబోతున్నట్లు తెలుస్తోంది. 'జాతిరత్నాలు' సినిమాతో సెన్సేషన్ క్రియేట్ చేసిన అనుదీప్, ప్రస్తుతం మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌తో తెరకెక్కించిన 'ఫంకీ' సినిమాను విడుదలకు సిద్ధం చేస్తున్నాడు. ఈ సినిమా ప్రమోషన్స్ సందర్భంగా అనుదీప్ తన తదుపరి చిత్రాలపై స్పందిస్తూ, వెంకటేష్ గారి కోసం ఒక ప్రత్యేకమైన కథను సిద్ధం చేస్తున్నట్లు స్వయంగా వెల్లడించారు. గతంలో అనుదీప్ వెంకటేష్‌కు ఒక కథను వినిపించగా, ఆయన సానుకూలంగా స్పందించారని సమాచారం. అయితే, స్క్రిప్ట్‌లో మరిన్ని మెరుగులు దిద్దాలని వెంకీ సూచించడంతో, ప్రస్తుతం అనుదీప్ ఆ పనుల్లో నిమగ్నమై ఉన్నట్లు తెలుస్తోంది. ఫైనల్ వెర్షన్ సిద్ధమయ్యాక మరోసారి నేరేషన్ ఇచ్చి గ్రీన్ సిగ్నల్ తీసుకోవాలని దర్శకుడు ప్లాన్ చేస్తున్నట్లు తెలుస్తుంది. ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ సితార ఎంటర్టైన్మెంట్స్ నిర్మించే అవకాశం ఉందని టాక్ వినిపిస్తోంది. వెంకీమామ ప్రస్తుతం వరుస ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. మాటల మాంత్రికుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ దర్శకత్వంలో 'ఆదర్శ కుటుంబం' అనే ఫ్యామిలీ క్రైమ్ కామెడీ సినిమాలో నటిస్తున్నారు. దీనితో పాటు అనిల్ రావిపూడి డైరెక్షన్‌లో ఒక ఎంటర్‌టైనర్, అలాగే 'దృశ్యం 3' కూడా లైన్‌లో ఉన్నాయి. ఈ ప్రాజెక్టులన్నీ పూర్తయిన తర్వాతే అనుదీప్ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉంది.



# కొత్త సినిమా రూమర్స్‌పై స్పందించిన అనిల్ రావిపూడి



టాలీవుడ్ దర్శకుడు అనిల్ రావిపూడి తన తదుపరి సినిమాపై వస్తున్న పుకార్లకు తనదైన శైలిలో స్పందించారు. 'మన శంకర వరప్రసాద్' సినిమా 300 కోట్ల క్లబ్‌లో చేరిన తర్వాత, నాగార్జున లేదా వెంకటేష్‌తో సినిమా చేయనున్నారనే వార్తలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. అయితే ట్విట్టర్ వేదికగా స్పందించిన అనిల్, తాను ఇంకా స్క్రిప్ట్ కూడా మొదలుపెట్టలేదని, నటీనటులు, కథ, టైటిల్ అప్పుడే ఖరారు చేశారంటూ వస్తున్న వార్తలపై సెటైర్ వేశారు. త్వరలోనే అధికారిక ప్రకటన చేస్తానని హామీ ఇచ్చారు. బాక్సాఫీస్ వద్ద భారీ అంచనాలున్న ఈ ప్రాజెక్ట్ పై ఫిబ్రవరి చివరి నాటికి స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఈ ఊహాగానాలపై ఎక్స్ (ట్విట్టర్) వేదికగా స్పందించిన అనిల్ రావిపూడి,వ్యంగ్యంగా ఓ ట్వీట్ చేశారు."నేను ఇంకా కాగితం మీద కలం కూడా పెట్టలేదు. అప్పుడే కథ,నటీనటులు,టైటిల్ వరకు ఫిక్స్ చేసేశారు. ఇదే స్పీడ్ కొనసాగితే మీరే యాక్షన్...కట్ కూడా చెప్పేస్తారేమో!"అంటూ సెటైర్ వేశారు. తన పేరుతో వస్తున్న ఈ వార్తల్లో ఎలాంటి నిజం లేదని ఆయన స్పష్టంచేశారు. తన తదుపరి సినిమా ఎవరితో, ఏ కథతో ఉండబోతుందన్న విషయాలను త్వరలోనే అధికారికంగా ప్రకటిస్తానని తెలిపారు."నేను చేయబోయే సినిమా ఏది,ఎవరితో అనేది పూర్తి నిజమైన వివరాలతో అతి త్వరలో మీ ముందుకు తీసుకొస్తాం" అని అభిమానులకు భరోసా ఇచ్చారు.ప్రస్తుతం ఆయన చేసిన ఈ ట్వీట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

# మీరు లేకుండా మేము ఏమీ చేయలేము



టాలీవుడ్ స్టార్ హీరోయిన్ సమంత గురించి స్పెషల్‌గా చెప్పాల్సిన పనిలేదు. 'ఏమాయ చేశావే' మూవీతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిన్నది.. ఇండస్ట్రీకి వచ్చిన అనతికాలంలోనే స్టార్ హీరోయిన్ రేంజ్‌కి వెళ్లిపోయింది. ఇక అక్కినేని హీరో నాగచైతన్యతో ప్రేమలో పడి అతన్నే మ్యారేజ్ చేసుకున్న ఈ బ్యూటీ ఇద్దరి మధ్య మనస్పర్థలు రావడంతో విడాకులు తీసుకొని విడిపోయారు. ఆ తర్వాత రీసెంట్‌గా బాలీవుడ్ దర్శకుడు రాజ్ నిడిమోరుతో పెళ్లిపీటలెక్కింది. కోయంబత్తూరులోని ఈషా ఫౌండేషన్‌లో యోగా ఆశ్రమంలో ఉన్న లింగ భైరవి ఆలయంలో వీరి పెళ్లి జరిగింది. ఇక మ్యారేజ్ తర్వాత మళ్లీ తమ ప్రొఫెషనల్ వర్క్‌లో బిజీ అయిపోయింది సమంత. 'శుభం' సినిమాతో నిర్మాతగా సక్సెస్ అందుకున్న సామ్ ఇప్పుడు 'మా ఇంటి బంగారం' సినిమాలో నటిస్తోంది. ఈ సినిమాకు కూడా సామ్‌నే నిర్మాతగా వ్యవహరిస్తోంది. దీనికి లేడీ డైరెక్టర్ నందిని రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. అయితే ఇందులో బాలీవుడ్ ప్రముఖ నటుడు కాంతార విలన్ గుల్షన్ దేవయ్య, దివ్యేందు కీలక పాత్రలో నటిస్తున్నారు. ఇదిలా ఉంటే.. నిత్యం సోషల్ మీడియాలో యాక్టీవ్‌గా ఉంటూ అభిమానులకు దగ్గరవుతూ ఉంటుంది సామ్. ఈ క్రమంలో ఈ భామకు సంబంధించిన ఇన్‌స్టా స్టోరీ నెట్టింట వైరల్‌గా మారింది. తాజాగా సమంత తన ఇన్‌స్టాలో ఓ ఎమోషనల్ స్టోరీ పెట్టింది. పిక్ బాల్ స్పోర్ట్స్ టీమ్‌తో తీసుకున్న ఫోటోను షేర్ చేస్తూ.. మీరు లేకుండా ఇది నేను చేయలేను' అని రాసుకొస్తూ చెన్నై సూపర్ చాంపియన్స్‌తో పాటు కర్నాటేరియా అనే వ్యక్తిని ట్యాగ్ చేసింది.

Printed, Published, Owned by & Editor: MEDE SHANTHI KUMAR, Printed at SPOORTHI PRINTERS, Published From SPOORTHI PUBLICATIONS,
# : 7-8-94/2, Sri Nagar Colony, Panagal Road, Nalgonda, Telangana - 508001, # : F-7, Cherukuri Mini Towers, Road No.4, Jadges colony, Vanasthalipuram, Hyderabad-500070.
epaper.dharmaganta.com, www.dharmaganta.com, dharmagantasp@gmail.com, +919440994108, +919885826108, +919440828108

# తండ్రి కేసీఆర్ భాషనూ తనయుడు కేటీఆర్ నేర్చుకోలేకపోయారే?

**ఆయనేం మాట్లాడుతు న్నారో? ఆయనకే అర్థం కానట్లుగా తిట్లు?**
**మాట్లాడితే ఆవేశపడకుండ మంట పెట్టేలా ఉండే కేసీఆర్ ప్రసంగ శైలి**
**మాజీ సీఎం కేసీఆర్ భాషకు ప్రస్థుత సీఎం రేవంత్ భాషకుపోలికెక్కడ!**
**రేవంత్ రెడ్డి ప్రస్తావన వస్తే కేటీఆర్ మండిపోతూ ఫైర్!**
**తండ్రి కేసీఆర్ దగ్గర కేటీఆర్ నేర్చుకోవాల్సింది చాలాఉంది**

చెన్నూరి అన్వేషి
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్





కేటీఆర్ ఇప్పుడు ఫైర్ మీద ఉన్నారు. రేవంత్ రెడ్డి ప్రస్తావన వస్తే మండిపోతున్నారు. ఆయనేంమాట్లాడుతున్నారో? ఆయనకే అర్థం కానట్లుగా తిట్లు వచ్చేస్తున్నాయి. మాట్లాడితే ఆవేశ పడకుండా మంట పెట్టేలా ఉండే కేసీఆర్ ప్రసంగ శైలి అయితే రాజకీయాల్లో ఉండాల్సింది ఇది కాదు. మాట్లాడితే ఆవేశ పడకుండా. మంట పెట్టేలా ఉండాలి. అది కేసీఆర్ వద్ద పుష్కలంగా ఉంది. కానీ ఆయన వారసుడిగా కేటీఆర్ ఆ ఆయుధాన్ని అందుకోలేకపోతున్నారు.

**మాజీ సీఎంకేసీఆర్ రేవంత్ భాషకు పోలికెక్కడ?**

తెలంగాణ ఉద్యమ ప్రస్థానంలో కేసీఆర్ వాడిన భాష ఒక ప్రత్యేకమైన అస్త్రం. ఆయన మాటల్లో వాడి ఉండేది, వేడి ఉండేది అది అవతలి వ్యక్తిని తాకినప్పుడు ఒక రకమైన సెగ పుట్టేది. ఆయన తిట్టినా అందులో ఒక తెలంగాణా యాస, ఒక లోతైన వ్యంగ్యం, ఒక రాజకీయ వ్యూహం ఉండేవి. బూతులు వాడినా అవి ఉద్యమ ప్రయోజనాల కోసం వాడినట్లుగా ప్రజలు భావించేవారు. కానీ, ప్రస్తుత బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తన తండ్రి నుంచి రాజకీయ వ్యూహాలే కాదు. ఆ మాటల మాంత్రికుడి భాషా ప్రావీణ్యాన్ని కూడా వంటబట్టించుకోలేకపోయారనే విమర్శలు ఇప్పుడు పార్టీ క్యాడర్ నుంచే వినిపిస్తున్నాయి.

**రేవంత్ రెడ్డి ప్రస్తావన వస్తే కేటీఆర్ ఇప్పుడు ఫైర్!**

ఇటీవలి కాలంలో కేటీఆర్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని లక్ష్యంగా చేసుకుని వాడుతున్న పదజాలం, కేసీఆర్ మార్కు విమర్శలకు ఏమాత్రం సరిపోలడం లేదు. కేసీఆర్ భాషలో ఒక రకమైన టార్గెటెడ్ ఎనర్జీ ఉండేది, అది తన అనుచరుల్లో ఉత్సాహాన్ని నింపేది. ఇటీవల ఆయన ప్రెస్మీట్ లో ఎవర్నీ తిట్టలేదు. కానీ అగ్గి మాత్రం రాజుకునేలా మాట్లాడారు. ఇప్పుడు కేటీఆర్ విమర్శల్లో కేవలం ఆగ్రహం, అసహనం మాత్రమే కనిపిస్తున్నాయి. అది ఎదుటివారిని ఇబ్బంది పెట్టడం కంటే, తనకే మైనస్ అవుతోందనే నిట్టూర్పు బీఆర్ఎస్ నాయకుల్లోనే వ్యక్తమవుతోంది. కేసీఆర్ తిడితే అది ఒక పొలిటికల్ పంచ్ లా ఉండేది, కానీ కేటీఆర్ మాటలు కేవలం వ్యక్తిగత దూషణల్లా మారుతున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. రాజకీయాల్లో వారసుడిగా కేటీఆర్ తండ్రి స్థాయి నాయకత్వాన్ని అందుకుంటారని అందరూ భావించారు. అయితే, విపక్షంలో ఉన్నప్పుడు వాడాల్సిన భాషలో కేసీఆర్ చూపిన పరిణతి కేటీఆర్‌లో లోపించిందనేది కేడర్ ఆవేదన. రేవంత్ రెడ్డిని ఎంత తిట్టినా అది ప్లస్ కాకపోవడానికి కారణం, అందులో కేసీఆర్ స్థాయిలో ఉన్న లాజిక్, లోకల్ ఫ్లేవర్ లేకపోవడమే. కేసీఆర్ ఒక మాట అంటే దాని వెనుక ఒక పెద్ద చరిత్రనో లేదా ఒక సామెతనో ఉండేది. కానీ కేటీఆర్ భాషలో ఆ లోతు కనిపించడం లేదని, కేవలం ఆధునిక తిట్లు మాత్రమే వినిపిస్తున్నాయి. తండ్రి కేసీఆర్ దగ్గర కేటీఆర్ నేర్చుకోవాల్సింది చాలానే ఉంది కేసీఆర్ దగ్గర కేటీఆర్ నేర్చుకోవాల్సింది చాలా ఉందని, ముఖ్యంగా వ్యూహాల్లో, భాషా ప్రయోగంలో ఆ మాటల మాంత్రికుడి వారసత్వాన్ని అందిపుచ్చుకోవడంలో ఆయన విఫలమయ్యారనే చర్చ జోరుగా సాగుతోంది. తండ్రి తిట్టినా జనం చప్పట్లు కొట్టారు, కానీ కొడుకు తిడుతుంటే జనం ఎందుకు పెదవి విరుస్తున్నారు అనే ప్రశ్న ఇప్పుడు బీఆర్ఎస్ అంతర్గత చర్చల్లో ప్రధానాంశమైంది. వారసత్వంగా ఆస్తులు, హోదాలు రావచ్చు కానీ, ఆ వాగ్ధాటిని తెచ్చుకోవడం మాత్రం కేటీఆర్ వల్ల కావడం లేదన్నది వాస్తవం.

# రేవంత్ సర్కార్ సంచలన నిర్ణయం హైదరాబాద్ జీహెచ్ఎంసీ విభజన

**ఇక నుండి గ్రేటర్ హైదరాబాద్ మూడు కార్పొరేషన్లు**
**ఈ మేరకు ప్రభుత్వ ఉత్తర్వులుజారీ**
**కార్పొరేషన్లకు కమిషనర్ల నియామకం**

చెన్నూరి అన్వేషి
ఎగ్జికూటివ్ ఎడిటర్






తెలంగాణ ప్రభుత్వం గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేష (జీహెచ్ఎంసీ)ని మూడు ప్రత్యేక కార్పొరేషన్లుగా విభజించింది. జీహెచ్ఎంసీతో పాటు తాజాగా, సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ), మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ (ఎంఎంసీ) రెండు కార్పొరేషన్లను ఏర్పాటు చేసింది. మేరకు బుధవారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. మూడు కార్పొరేషన్లకు కమిషనర్లను నియమించింది. జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్వీ కర్ణన్‌ను యథాతథం గా కొనసాగించింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌కు శ్రీజన, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్‌కు వినయ్ కృష్ణారెడ్డిని కమిషనర్లుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ ప్రత్యేక కార్యదర్శి జయేశ్ రంజన్‌ను మూడు కార్పొరేషన్లకు ప్రత్యేక అధికారిగా నియమించింది. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్‌లో శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్ జోన్‌లు ఉండగా, మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో మల్కాజ్‌గిరి, ఉప్పల్, ఎల్బీనగర్ జోన్‌లు ఉంటాయి. శంషాబాద్, రాజేంద్రనగర్, చార్మినార్, గోల్కొండ, ఖైరతాబాద్, సికింద్రాబాద్ జోన్‌ల పరిధిలోని ప్రాంతాలు జీహెచ్ఎంసీ పరిధిలోకి వస్తాయి. కొత్తగా ఏర్పడిన రెండు కార్పొరేషన్‌ల లో ఒక్కో కార్పొరేషన్‌లో సుమారు 35 లక్షల జనాభా ఉంటుంది. జీహెచ్ఎంసీ పరిధిలో 70 లక్షల జనాభా ఉంటుంది. తెలంగాణలోని ఏడు కార్పొరేషన్లు, 116 మునిసిపాలిటీలలో ఎన్నికలకు పోలింగ్ జరుగుతున్న రోజున జీహెచ్ఎంసీని మూడు కార్పొరేషన్లుగా విభజిస్తూ జీవో జారీ చేయడం గమనార్హం. జీహెచ్ఎంసీ సహా, రెండు కొత్త కార్పొరేషన్లకు ఏప్రిల్, మే నెలల్లో ఎన్నికలు జరిగే అవకాశం ఉంది.

## మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించిన పోలీస్ కమిషనర్ సిపి గౌష్ ఆలం.





క్రిటికల్ పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు.

**ధర్మఘంట, ఫిబ్రవరి 11, కరీంనగర్:** కరీంనగర్ మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ప్రజలు ప్రశాంతమైన వాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకునేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేసినట్లు పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం తెలిపారు. బుధవారం జిల్లాలోని పలు పోలింగ్ కేంద్రాలను పోలీస్ కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి, భద్రతా తీరుగతులను స్వయంగా పర్యవేక్షించారు. ముఖ్యంగా క్రిటికల్ (సమస్యాత్మక) పోలింగ్ కేంద్రాలను సందర్శించిన సీపీ, అక్కడ ఏర్పాటు చేసిన అదనపు బలగాల మోహరింపును తనిఖీ చేశారు. ఏవైనా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందస్తుగా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై క్షేత్రస్థాయి అధికారులకు పలు సూచనలు చేశారు.పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని, వృద్ధులు మరియు దివ్యాంగులకు ప్రాధాన్యతనివ్వాలని ఆదేశించారు. నిఘా పటిష్టం: ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద సిసి కెమెరాల నిఘా నిరంతరం ఉండాలని, అనుమానిత వ్యక్తులపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు.విధుల్లో ఉన్న పోలీసులు ఎల్లవేళలా అప్రమత్తంగా ఉండాలని, విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహించే వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.ప్రజలతో మర్యాదగా ప్రవర్తిస్తూనే, శాంతిభద్రతల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు.ఈ పర్యటనలో సీపీ వెంట ట్రైనీ ఐపిఎస్ సోహం, పలువురు ఉన్నతాధికారులు మరియు స్థానిక పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకు కట్టుదిట్టమైన బందోబస్తు కొనసాగుతుందని, ప్రజలు ఎటువంటి భయాందోళనలు చెందకుండా ఓటు వేయాలని సీపీ గౌష్ ఆలం పిలుపునిచ్చారు.

## ప్రధాని ఆదేశాలతో పరామర్శ కోసం ఇక్కడికి వచ్చాం



**మృతుని కుటుంబానికి అండగా ఉంటాం కేంద్రమంత్రి కిషన్ రెడ్డి**
**రాష్ట్రంలో బెదిరింపు,హత్యా రాజకీయాలు ఇక నిలువవు**

చెన్నూరి అన్వేషి
ఎగ్జికూటివ్ ఎడిటర్

తెలంగాణ రాష్ట్రంలో హత్య బెదిరింపు రాజకీయాలు జరుగుతున్నాయి. ఇలాంటి రాజకీయాలు నిలువవు అని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వ వార్డు బీజేపీ అభ్యర్థి మహదేవ్ ఆత్మహత్యకు పాల్పడిన నేపథ్యంలో బుధవారం ఉదయం ఎంపీ డీకే అరుణ, ఇతర పార్టీ నాయకులతో కలిసి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

## ఎన్నికల బందోబస్తు పర్యవేక్షణ పోలింగ్ ప్రక్రియపై ఆరా..



**మున్సిపల్ పోలింగ్ కేంద్రాలను సందర్శించిన రామగుండం పోలీస్ కమిషనర్.**

ధర్మఘంట,ఫిబ్రవరి11,రామగుండం :

రామగుండం పోలీస్ కమీషనరేట్ పరిధిలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌ను రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన ఎన్టీపీసీ లోనీ ప్రభుత్వ హైస్కూల్,టీటీఎస్, మంచిర్యాల పట్టణంలోని ఆర్బీహెచ్‌వీ, క్రిస్ట్ స్కూల్ తదితర పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన పోలీస్ బందోబస్తు, భద్రతాచర్యలు, క్యూలైన్ల నిర్వహణ, వృద్ధులు మరియు దివ్యాంగుల కోసం కల్పించిన ప్రత్యేక సదుపాయాలను కమిషనర్ పరిశీలించారు. పోలింగ్ అనంతరం బ్యాలెట్ బాక్సులను స్ట్రాంగ్ రూమ్‌కు తరలించే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేదా గొడవలు జరగకుండా అప్రమత్తంగా ఉండాలని అధికారులకు, సిబ్బందికి సూచించారు.ప్రతి పోలింగ్ కేంద్రంలో ఎన్నికల ప్రక్రియ నిష్పక్షపాతంగా, శాంతియుతంగా కొనసాగుతుందా అనే అంశంపై కమిషనర్ ప్రత్యక్షంగా ఆరా తీసి, పోలింగ్ అధికారులతో మాట్లాడి అవసరమైన సూచనలు చేశారు. అలాగే ఓటర్లతో కూడా మాట్లాడి,ఏవైనా ఇబ్బందులు ఎదురైతే వెంటనే పోలీస్ సిబ్బందిని సంప్రదించాలని సూచించారు.ఎన్నికల శాంతి భద్రతల కోసం పూర్తి స్థాయి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు,ఓటర్లు భయభ్రాంతులు లేకుండా తమ ఓటు హక్కును వినియోగించుకునేలా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల డీసీపీ ఏ. భాస్కర్,మంచిర్యాల ఏసీపీ ఆర్.ప్రకాష్, మంచిర్యాల పట్టణ ఇన్‌స్పెక్టర్ ప్రమోద్ రావు,ఎన్టీపీసీ ఎస్ఐ ఉదయ్ కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## 13వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని ముళ్లపాటి విజయలక్ష్మి ఎన్నికల సరళిని పరిశీలించిన..



**జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ.**

ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 11 ధర్మ ఘంట

వైరా మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా 13వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ముళ్ళపాటి విజయలక్ష్మి సీతారాములు ఓటింగ్ సరళిని జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు నూతి సత్యనారాయణ పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు రంగా జనార్ధన్, మున్సిపాలిటీ వైస్ చైర్మన్ మాజీ ముళ్లపాటి సీతారాములు తదితరులు కాంగ్రెస్ పార్టీ నాయకులు ఉన్నారు.





## ఈనెల 13న రవాణా శాఖ సేవలు బంద్..



**వాహనదారులు గమనించాలని విజ్ఞప్తి..**
**జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్**

ఖమ్మం ఫిబ్రవరి 11 ధర్మ ఘంట

ఈనెల 13న, రవాణా శాఖ సిబ్బంది వాహన్ పోర్టల్ పై శిక్షణ కొరకు నిమిత్తం హైదరాబాద్ వెళ్తున్న సందర్భంగా ఖమ్మం రవాణా శాఖ సిబ్బందిని, వైరా ఆర్టీఏ కార్యాలయంలో ఈ నెల 13న ఎటువంటి సేవలు అందుబాటులో ఉండవు, ఖమ్మం, సత్తుపల్లి ఆర్టిఏ కార్యాలయంలో పాక్షికంగా సేవలు అందుబాటులో ఉంటాయి, ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్, దరఖాస్తుదారులు,కార్యాలయంలో స్లాట్ బుక్ చేసుకునే వినియోగదారులు, ఈ విషయాలను గమనించి సహకరించవలసిందిగా , ఖమ్మం జిల్లా రవాణా శాఖ అధికారి ధర్మపురి జగదీష్ కోరారు.

ధర్మఘంట

# సమాజ అభివృద్ధికి బాటలు వేసేది సుపరిపాలన...!

**సమాజ అభివృద్ధి కైనా మూలస్తంభం సుపరిపాలన (గుడ్ గవర్నన్స్).ఏ సమాజమైనా ఆర్థిక, సామాజిక,సాంస్కృతిక, నైతికత దృష్ట్యా అభివృద్ధి చెందాలంటే, పాలనా వ్యవస్థ బలంగా, న్యాయబద్ధంగా,పారదర్శకంగా పనిచేయాలి .ప్రపంచదేశాల అనుభవాలు,ఐక్యరాష్ట్ర సమితి (యుఎన్) ,ప్రపంచ బ్యాంకు వంటి సంస్థల అధ్యయనాలు కూడా సుపరిపాలన లేకుండా స్థిరమైన అభివృద్ధి అసాధ్యమని ఒకే విషయాన్ని చెబుతున్నాయి.**



### సుపరిపాలన అంటే ఏమిటి?

సుపరిపాలన అంటే కేవలం పాలకులు లేదా అధికారులు ఏదో చేయడం కాదు.అది ప్రజల అవసరాలను తీర్చడం, వనరులను సమర్థవంతంగా వినియోగించడం,న్యాయం అందరికీ సమానంగా అందుబాటులో ఉంచడం వంటివి నిష్పక్షపాతంగా జరగాలి.దీనికి ప్రజలు ముఖ్యంగా మహిళలు, యువత,వెనుకబడిన వర్గాలు భాగస్వామ్యం (పార్టిసిపేషన్) ఉండాలి.నిర్ణయాల తీసుకోవడంలో ఈ వర్గాలు ప్రాధాన్యత కలిగి ఉండాలి.గ్రామ సభలు,పంచాయతీలు,పౌర సంఘాల ద్వారా ఇది సాధ్యమవుతుంది.ప్రభుత్వ ఖర్చులు, నిర్ణయాలు, టెండర్లు అందరికీ తెలిసేలా పారదర్శకంగా (ట్రాన్సపారెన్సీ) జరగాలి.ఆర్టీఐ చట్టం ఇందుకు ఒక ఉదాహరణగా చూడొచ్చు. దాచిపెట్టే పాలన అభివృద్ధిని అడ్డుకుంటుంది. జవాబుదారీతనం (అకౌంటెబిలిటీ) ద్వారా సుపరిపాలన ఇవ్వొచ్చు. అధికారులు,ఎన్నికైన ప్రజాప్రతినిధులు తమ నిర్ణయాలకు జవాబుదారీ కావాలి.లోక్‌పాల్,కాగ్,ఎన్నికల సంఘం వంటివి దీనికి సహాయపడాలి.

### సమర్థత మరియు సామర్థ్యం

పాలనా వ్యవస్థలో అన్ని స్థాయిల్లో సమర్థత మరియు సామర్థ్యం(ఎఫెక్టివేనెస్ అండ్ ఏఫిసైన్సీ) పెరగాలి.తక్కువ ఖర్చుతో ఎక్కువ ఫలితాలు ఇవ్వాలి.డిబిటి (డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్) ద్వారా లీకేజీలు తగ్గి డబ్బు నేరుగా ప్రజల ఖాతాలోకి వెళ్ళాలి.న్యాయబద్ధత మరియు చట్టపాలన (రూల్ ఆఫ్ లా)చట్టం అందరికీ సమానంగా అందాలి. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే శిక్ష పడాలి, అదిపాలకుడైనా, అధికారైనా,సామాన్యుడైనా ఒక్కటే రూల్ ఉండాలి.ఈ విషయంలో స్పందనాత్మకత(రెస్పాన్సివేనెస్)ప్రజల సమస్యలకు త్వరగా స్పందించాలి.సంక్షేమ పథకాలు, విపత్తుల సమయంలో సహాయం వేగంగా అందాలి.

### సమానత్వం మరియు సమగ్రత

సమాజంలో లింగం,కులం, మతం,ఆర్థికస్థితి ఆధారంగా వివక్ష ఉండకూడదు.అందరూ అభివృద్ధి ఫలితాల్లో భాగస్వాములు కావాలి. దీర్ఘకాలిక దృక్పథంతో ముందుకు పోవాలి.తాత్కాలిక లాభాల కోసం కాకుండా తరతరాల అభివృద్ధిని దృష్టిలో పెట్టుకోవాలి.వివిధ వర్గాల మధ్య ఏకాభిప్రాయం కోసం ప్రయత్నించాలి.భారత దేశంలో డిజిటల్ ఇండియా,ఆధార్ లింక్, యూపీఐ వంటివి పారదర్శకత, సమర్థతను పెంచాయి.స్వచ్ఛ్ భారత్,జల్ జీవన్ మిషన్ వంటివి సమగ్ర అభివృద్ధికి ఉదాహరణలుగా చూడొచ్చు. అయితే అవినీతి,రాజకీయ జోక్యం,న్యాయ వ్యవస్థలో ఆలస్యం వంటివి ఇంకా సవాళ్లుగానే ఉన్నాయి. పాలనా వ్యవస్థ మాత్రమే కాదు అందరి భాగస్వామ్యం ఉండాలి సమాజ అభివృద్ధి అనేది ప్రభుత్వం ఒక్కటే చేయలేదు. ప్రజలు,సివిల్ సొసైటీ,మీడియా, వ్యాపార సంస్థలు కలిసి పనిచేస్తేనే సాధ్యం.కానీ,ఆ కలయికకు మూలస్తంభం సుపరిపాలన అవుతుంది. సుపరిపాలన ఉన్న చోట నమ్మకం పెరుగుతుంది, పెట్టుబడులు వస్తాయి, ఆవిష్కరణలు జరుగుతాయి, అసమానతలు తగ్గుతాయి. మొత్తం మీద సమాజం సంతోషంగా,సమృద్ధిగా జీవిస్తుంది.సుపరిపాలన కేవలం ఒక భావన కాదు,అది సమాజం బతకడానికి,ఎదగడానికి,వికసించడానికి అవసరమైన ఆక్సిజన్ లాంటిది.

**గంట సోమన్న,సీనియర్ జర్నలిస్ట్.**

## మర్రిగూడ మండల కేంద్రంలో వెలుగులు..



**ఎమ్మెల్యే సహకారంతో 58 వీధిలైట్లు ఏర్పాటు**
**చీకటి వీధుల్లో వెలుగులు నింపిన సర్పంచ్**

**ధర్మ ఘంట,ఫిబ్రవరి 11మర్రిగూడ :**
నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా అభివృద్ధి పనులు ముమ్మరంగా సాగుతున్నాయి.సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్ పర్యవేక్షణలో,ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి సహకారంతో మండల కేంద్రంలోని పలు వార్డుల్లో 58 నూతన వీధిలైట్లను ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ..మర్రిగూడను ఆదర్శవంతమైన మండల కేంద్రంగా తీర్చిదిద్దేందుకు నిరంతరం కృషి చేస్తామన్నారు.ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డి సహకారంతో గ్రామంలో సిమెంట్ రోడ్లు,డ్రైనేజీ వంటి ఇతర పెండింగ్ పనులను కూడా త్వరలోనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు.చీకటితో నిండిన వీధుల్లో ఇప్పుడు వెలుగులు నిండటంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.ప్రజా సమస్యలపై తక్షణమే స్పందిస్తున్న సర్పంచ్ వీరమల్ల శిరీష లోకేష్‌కు,ఎమ్మెల్యే రాజగోపాల్ రెడ్డికి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మాస నీలిమ చంద్రశేఖర్, సీనియర్ జర్నలిస్టు మహేశ్వరం సతీష్, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు పొనుగోటి శేఖర్,వార్డు మెంబర్లు మహమ్మద్ జమీర్,జరుపుల హనుమంతు, సిలువేరు కల్పన రవి, ఎస్టీ సెల్ అధ్యక్షుడు శ్రీను నాయక్,పగడాల లింగయ్య,నజీర్,రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## మద్యం,మత్తు పదార్థాలపై ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అవగాహన






**సాయిరెడ్డిగూడెం ఇంటింటి సర్వేతో గ్రామస్తులకు చైతన్యం**
**మత్తు పదార్థాల వలన కలిగే నష్టాలను వివరించిన విద్యార్థులు**

**ధర్మఘంట ఫిబ్రవరి 11 కందుకూరు:**
వ్యక్తిగత ఆరోగ్యాన్ని,కుటుంబాల ఆర్థిక పరిస్థితిని నాశనం చేస్తున్న మద్యం,ఇతర మత్తు పదార్థాలకు ప్రతి ఒక్కరూ దూరంగా ఉండాలని ఎన్ఎస్ఎస్ యూనిటీ 1,2,3 ప్రోగ్రాం ఆఫీసర్స్ డాక్టర్ బాబురావు,డాక్టర్ శశికళ, డాక్టర్ సరితరాణి అన్నారు. బుధవారం రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం సాయిరెడ్డిగూడెం గ్రామంలో హైదరాబాద్ లోని ఫలక్ నామా ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గ్రామ సర్పంచ్ కొంగల అనితకృష్ణ అధ్యక్షతన ప్రత్యేక క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు
గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి ఆర్థిక పరిస్థితులు, కుటుంబ సమస్యలను అడిగి సేకరించారు.ఇంటిలో ఉన్న ప్రతి వ్యక్తికీ మత్తు పదార్థాల వలన ఎదురయ్యే పరిస్థితులను వివరించారు.యువత చెడుదోవ పట్టకుండా మత్తు పదార్థాలను కట్టడి చేసేందుకు గ్రామస్తులందరూ ఒక్కతాటి పైకొచ్చి,బెల్ట్ షాపుల భరతం పట్టాలని గ్రామస్తులను చైతన్యం చేశారు.గ్రామంలో ఎక్కువ మంది వ్యవసాయ కూలీలు కాగా పనిచేస్తూ ఉండగా,కొంతమంది వివిధ రకాల ఫ్యాక్టరీల్లో పనులు చేస్తూంటారని,గ్రామానికి చెందిన చాలామంది మద్యానికి బానిసై జీవితాలు నాశనం చేసుకుంటున్నారని,యువత మత్తు పదార్థాలకు అలవాటుపడి భవిష్యత్తును కోల్పోతున్నారని,తగాదాలతో కుటుంబాలకు దూరమవుతున్నారని సర్వేలో తేలిందని చెప్పారు.గ్రామంలో నెలకొన్న పరిస్థితులపై ఎన్ఎస్ఎస్ విద్యార్థులు మద్యపానం మత్తు పదార్థాల దుష్ఫలితాలపై నాటికను ప్రదర్శించి,మత్తు వల్ల కలిగే చెడును కళ్లకు కట్టినట్టు చూపించారు.ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి పంతు నాయక్, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రశాంత వాతావరణంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్...





**పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసిన పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి**

**ధర్మఘంట,ఫిబ్రవరి11,రామగుండం :**
పెద్దపల్లి జిల్లాలో జరుగుతున్న మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంత వాతావరణంలో కొనసాగుతోందని పెద్దపల్లి డీసీపీ బి. రామ్ రెడ్డి తెలిపారు. మంథని, రామగిరి, గోదావరిఖని టూటౌన్, వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోనీ పోలింగ్ ప్రక్రియను, పోలింగ్ కేంద్రాలను సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.ఈ సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో భద్రతా ఏర్పాట్లు, పోలింగ్ సిబ్బంది విధులు, ఓటర్లకు కల్పించిన సౌకర్యాలపై డీసీపీ అధికారులతో సమీక్షించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా కట్టుదిట్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజలు ఎటువంటి భయాందోళనలకు గురికాకుండా స్వేచ్ఛగా, నిష్పక్షపాతంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని డీసీపీ పిలుపునిచ్చారు. ఎక్కడైనా సమస్యలు తలెత్తితే వెంటనే పోలీస్ అధికారులకు సమాచారం అందించాలని సూచించారు.పోలింగ్, బ్యాలెట్ బాక్స్ స్ట్రాంగ్ రూమ్ చేరే వరకు ప్రక్రియ పూర్తయ్యే వరకు అధికారులు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని, భద్రతాచర్యలు కొనసాగుతాయని, శాంతియుత ఎన్నికల నిర్వహణే పోలీస్ శాఖ ప్రధాన లక్ష్యమని డీసీపీ స్పష్టం చేశారు.డీసీపీ వెంట గోదావరిఖని ఏసిపి ఎం రమేష్, రామగుండం సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రవీణ్ కుమార్, ఎస్ ఐ లు ఉన్నారు.

## వైరా మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరవేయడం కాయం..





**వైరా ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 11 ధర్మ ఘంట**
మున్సిపల్ ఎన్నికలలో వైరా మున్సిపాలిటీ పై కాంగ్రెస్ జెండా ఎగరేయటం ఖాయమని ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్ అన్నారు ఖమ్మం జిల్లా వైరా మున్సిపాలిటీ ఐదో వార్డు పోలింగ్ బూత్ లో ఎమ్మెల్యే మాలోత్ రాందాస్ నాయక్ ఓటు హక్కు వినియోగించుకున్నారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైరా మున్సిపాలిటీలో జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ జండా ఎగరవేయటం ఖాయమని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలు మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్కు పట్టం కట్టారని అన్నారు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కు సారధ్యంలో పేదలకు ఎన్నో సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టారని అన్నారు పేదల కోసం కళ్యాణ లక్ష్మి షాది ముబారక్ వృద్ధులకు వికలాంగులకు పెన్షన్లు మహిళలకు వడ్డీ లేని రుణాలు ఉచిత బస్సు ఉచిత విద్యుత్ రైతులకు రుణమాఫీ రైతుబంధు పథకం నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని అన్నారు ప్రభుత్వం ఇస్తున్న సంక్షేమ పథకాలు పేదలకు అందే విధంగా కృషి చేస్తామని తెలిపారు. తెలంగాణలో జరిగే మున్సిపల్ కార్పొరేషన్లు ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంటుందని ఆయన అన్నారు. వైరా మున్సిపాలిటీ 20 వార్డులకు 20 కాంగ్రెస్ గెలుచుకు తీరుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమం లో జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నూతి సత్యనారాయణ మాజీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ళ దుర్గాప్రసాద్ జిల్లా కాంగ్రెస్ నాయకులు శీలం వెంకట నర్సిరెడ్డి డాక్టర్ కాపా మురలీకృష్ణ కౌన్సిలర్ అభ్యర్థులు డాక్టర్ చంద్రకళ మిట్టపల్లి రాఘవరావు పాల్గొన్నారు.

## పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి,పోలింగ్ సరళిని పరిశీలించిన జిల్లా ఎస్పీ రోహిత్ రాజు..







**ఉమ్మడి జిల్లా బ్యూరో ఖమ్మం ఫిబ్రవరి 11 ధర్మ ఘంట**
మున్సిపల్ ఎన్నికల పోలింగ్ సందర్భంగా జిల్లా ఎస్పీ రోహిత్ రాజు పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించారు. కొత్తగూడెం,ఇల్లందు అశ్వరావుపేటలలోని పోలింగ్ కేంద్రాల వద్ద పోలింగ్ సరళని పరిశీలించి అక్కడ విధుల్లో ఉన్న అధికారులు సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలింగ్ కేంద్రాలతో పాటు ఇల్లందులో స్ట్రాంగ్ రూమ్ ల వద్ద బందోబస్తును పరిశీలించారు.మూడు మున్సిపాలిటీల పరిధిలో ఎన్నికల ప్రక్రియ సజావుగా సాగేందుకు పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు.

## ఏదులా పురం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ విజయకేతనం ఎగురవేసి చేస్తుంది..

**కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీను**
**ఖమ్మం ఫిబ్రవరి వైరా 11 ధర్మ ఘంట**



ఏదులా పురం మున్సిపాలిటీ లో కాంగ్రెస్ విజయకేతనం ఎగరవేస్తుందని కాంగ్రెస్ జిల్లా నాయకులు పరికపల్లి శ్రీను జోస్యం చెప్పారు. రాష్ట్ర ముఖ్యంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వం లో రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పాలేరు నియోజవర్గం లో కోట్లాది రూపాయలు అభివృద్ధి పనులు చేపట్టి అభివృద్ధిని పరుగులు పెట్టిస్తున్నారని పేద ప్రజలకు ప్రజా పభుత్వం లో పథకాలు అందుతున్నాయని సొంత ఇంటికల ఇందిరమ్మ ఇళ్ల తో నెరవేర్చారని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల ప్రజలు పూర్తి విశ్వాసం తో ఉన్నారని వైరా ఎమ్మెల్యే మాలోతూ రాందాస్ నాయక్ నేతృత్వం లో వైరా మున్సిపాలిటీ లో కాంగ్రెస్ కైవసం పక్కా అని తెలిపారు. ఖమ్మం జిల్లాలో అన్ని మున్సిపాలిటీలు కాంగ్రెస్ వశం చేసుకుంటుంది అని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ కి ఓటువేసిన ప్రతి ఒక్కరికీ పార్టీ కోసం పని చేసిన కార్యకర్త కు నాయకులకు ధన్యవాదములు కృత్షతలు తెలిపారు

## క్రిటికల్ పోలింగ్ స్టేషన్లలో పోలీస్ బందోబస్త్ ను పర్యవేక్షిస్తున్న అడిషనల్ డీసీపీ లా& అర్డర్..





**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 11 ధర్మ ఘంట**
వైరా మున్సిపాలిటీలో కొనసాగుతున్న ఎన్నికల నేపథ్యంలో పలు క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను అడిషనల్ డీసీపీ (లా &ఆర్డర్) ప్రసాద్ రావు సందర్శించి పోలీస్ బందోబస్త్ పర్యవేక్షిస్తున్నారు. పల్లిపాడు లో ఎన్నికల భద్రత ఏర్పాట్లను పరిశీలించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా పోలీస్ అధికారులకు దిశా నిర్దేశం చేశారు. పోలింగ్ కేంద్రాల వద్ద క్యూలైన్ పాటించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్నికలు పూర్తిగా ప్రశాంత వాతావరణంలో స్వేచ్ఛా యుతంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలను తీసుకోవాలని, అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలు శాంతియుతవాతావరణంలో తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

## 20వ వార్డు కౌన్సిలర్ అభ్యర్థిని ఉంద్రు వరలక్ష్మి ఎన్నికల సరళిని పరిశీలించిన..

**మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకని జైపాల్, కోసూరి శ్రీను..**

**ఉమ్మడి ఖమ్మం జిల్లా బ్యూరో ఫిబ్రవరి 11 ధర్మ ఘంట**
వైరా మున్సిపాలిటీ ఎన్నికల సందర్భంగా 20వ వార్డు కౌన్సిలర్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ఉంద్రు వరలక్ష్మి ఓటింగ్ సరళిని వైరా మున్సిపాలిటీ మాజీ చైర్మన్ సూతకని జైపాల్, జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు కోసూరి శ్రీనివాసరావు వారు పరిశీలించారు. ఆయన వెంట కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ ఉంద్రు శ్యాంబాబు, మాజీ కౌన్సిలర్ లక్ష్మీబాయి, పలువురు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మహిళలు తదితరులు ఉన్నారు.



# ఢిల్లీలో సీఎం రేవంత్ రెడ్డి బిజీ! షెడ్యూల్ టీ కాంగ్రెస్‌లో ఉత్కంఠం

ముఖ్యమంత్రి పర్యటనలో
**అధిష్టానంతో భేటీపై నేతల్లో ఆసక్తి?**
**మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు కేంద్ర నిధులు కోరే అవకాశం**

చెన్నూరి అన్వేషి
ఎగ్జిక్యూటివ్ ఎడిటర్



సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పర్యటన రాష్ట్ర రాజకీయాల్లో ఇంట్రెస్టింగ్‌గా మారింది. ఇవాళ ఉదయం మున్సిపల్ ఎన్నికల్లో తన ఓటు హక్కు వినియోగించుకున్న ముఖ్యమంత్రి అనంతరం నేరుగా ఢిల్లీకి పయనమయ్యారుహస్తిన చేరుకున్న ఆయన అక్కడ బిజీ బిజీగా గపడపోతున్నారు. ఇవాళ సాయంత్రం 7 గంటలకు ఏఐసీసీ చీఫ్ మల్లికార్జున ఖర్గేతో భేటీ కాబోతున్నట్లు సమాచారం. రేపు రైల్వే, ఎరువులు రసాయననాలు, జలవనరుల శాఖ మంత్రులను కలిసే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

**ఢిల్లీ ముఖ్యమంత్రి పర్యటనలో అధిష్టానంతో భేటీపై నేతల్లో ఆసక్తి?**

ఢిల్లీ పర్యటలో భాగంగా రేవంత్ రెడ్డి ఏఐసీసీ పెద్దలతో భేటీ కానుండటం రాష్ట్ర కాంగ్రెస్‌లో ఆసక్తి రేపుతోంది. ఈ సందర్భంగా ప్రభుత్వం, పార్టీలోని తాజా పరిణామాలను సీఎం అధిష్టానం దృష్టికి తీసుకువెళ్లనున్నట్లు తెలుస్తోంది. ముఖ్యంగా పార్టీ సంస్థాగత నిర్మాణంతో పాటు మంత్రివర్గ విస్తరణపై చర్చించే అవకాశం ఉందనే టాక్ వినిపిస్తోంది. రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పాటై రెండేళ్లు పూర్తి కావడంతో పాటు కేబినెట్‌లో మరో బెర్త్ ఖాళీగా ఉంది. మున్సిపల్ ఎన్నికల్లో సరైన రీతిలో పని చేయని మంత్రులపై చర్యలు తప్పవని సీఎం సీరియస్ వార్నింగ్ ఇచ్చారనే టాక్ ఇటీవల పొలిటికల్ సర్కిల్స్ లో వినిపించింది. ఈ నేపథ్యంలో మంత్రి విస్తరణ మరోసారి ఉండబోతోందా? ప్రస్తుత మంత్రుల పనితీరు ఆధారంగా కేబినెట్‌లో మార్పులు చేర్పులు ఉండబోతున్నాయా అనేది ఉత్కంఠగా మారింది.

**మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టుకు కేంద్ర నిధులు కోరే అవకాశం**

రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మూసీ పునరుజ్జీవం ప్రాజెక్టు విషయంలో రాష్ట్ర ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. మూసీ రివర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నది పరివాహక ప్రాంతాల అభివృద్ధికి కోసం ప్రభుత్వం భూసేకరణ ప్రక్రియను ప్రారంభించింది. ఇందుకు సంబంధించి ఇవాళ తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్‌ను సైతం జారీ చేసింది. ఈ నేపథ్యంలో ఈ ప్రాజెక్టుకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ పెద్దలను కలిసి నిధులు కోరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. అలాగే రెండు తెలుగు రాష్ట్రాల మధ్య ఉన్న నీటి సమస్యలపై కేంద్రం దృష్టికి తీసుకువెళ్లే చాన్స్ కనిపిస్తోంది.

# కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ విజయం

**నల్లగొండను అభివృద్ధి చేసి ప్రజల రుణం తీర్చుకుంటా...**
**మేయర్ ఎన్నిక పూర్తయిన తర్వాత ప్రతి డివిజన్లో ప్రజా దర్బార్**
**మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి**

ధర్మ ఘంట ఫిబ్రవరి 11,




నల్లగొండ: రాష్ట్రంలో జరుగుతున్న కార్పొరేషన్ మున్సిపాలిటీ ఎన్నికల్లో అత్యధిక స్థానాలలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని రాష్ట్ర రోడ్లు భవనాలు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు.నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా బుధవారం నల్లగొండ పట్టణంలోని 33వ డివిజన్ మీర్ బాగ్ కాలనీ నల్లగొండ పబ్లిక్ స్కూల్లో ఓటు హక్కు వినియోగించుకున్నారు.అనంతరం మంత్రి విలేకరులతో మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వం పదేళ్లలో ఒక్క రేషన్ కార్డు ఇవ్వలేదని, పేదల సంక్షేమం గురించి పట్టించుకోలేదని విమర్శించారు.గతంలో విద్యాశాఖ మంత్రిగా ఉన్న వ్యక్తి ఎంజి యూనివర్సిటీ పట్టించుకున్న దాఖలాలు లేవన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన భవనాలకు 200 కోట్లు కేటాయించడంతో పాటు, ఇటీవల నూతనంగా ఫార్మసీ కోర్సులను మంజూరు చేయించడం జరిగిందని అన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాతనే సంక్షేమ పథకాలు అమలవుతున్నాయని స్పష్టం చేశారు.నల్లగొండలో అన్ని విధాలుగా అభివృద్ధి చేసి ఇక్కడి ప్రజల రుణం తీర్చుకుంటానని తెలిపారు.పేదలకు ఏ సమస్య వచ్చినా వారికి ఎల్లవేళలా అండగా ఉంటానని, నేను బతికున్నంత కాలం పేద ప్రజలను గుండెల్లో పెట్టుకుంటానని పేర్కొన్నారు.మేయర్ ఎన్నిక పూర్తి అయిన తర్వాత ప్రతి డివిజన్లో ప్రజా దర్బారు నిర్వహించి కార్పొరేటర్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించడం జరుగుతుందని అన్నారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ లో 100 ఎకరాల భూమిని సేకరించి దేవరకొండ రోడ్ లో 4000, నార్కట్పల్లి రోడ్ లో 4,000 ఇందిరమ్మ ఇండ్లను 75 గజాలలో కట్టించి పేదలకు అందజేస్తామని తెలిపారు.నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు పేదోళ్లకు సంబంధించిన ఎన్నికలని తెలిపారు.ఈ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిస్తే అన్ని డివిజన్లో సమస్యలన్నీ పరిష్కారం అవుతాయని, పేద ప్రజలకు న్యాయం జరుగుతుందని అన్నారు.త్వరలోనే నల్గొండ మున్సిపల్ కార్పొరేషన్ లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలన్నింటిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తానని, అంగన్వాడీలకు సొంత భవనాలు నిర్మిస్తామని స్పష్టం చేశారు.ప్రభుత్వ పాఠశాలలో మౌలిక సదుపాయాలు కల్పించిన నాణ్యమైన విద్యను అందించే విధంగా చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలను మోడల్ కాలేజీ గా మారుస్తామని తెలిపారు.తక్కువ సమయంలో ఎక్కువ అభివృద్ధి జరుగుతుందని చెప్పారు.జిల్లా గ్రంథాలయాన్ని మోడల్ గ్రంథాలయంగా అభివృద్ధి చేస్తామని తెలిపారు.రూ. 10 కోట్లతో అధునాతన షాదీ ఖానా నిర్మిస్తామని అన్నారు.పట్టణ ప్రజలకు 24 గంటలు తాగునీరు వచ్చే విధంగా 12 ఓవర్ హెడ్ వాటర్ ట్యాంకులు నిర్మిస్తున్నామని,ఇప్పటికే కొన్ని పూర్తయ్యాయని తెలిపారు. దీంతో త్వరలో అన్ని కాలనీలకు 24 గంటల తాగనీరు అందుతుందని అన్నారు.ఈ విలేకరుల సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ డాక్టర్ ఎంఏ హఫీజ్ ఖాన్, నల్గొండ మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్ రెడ్డి,33 వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్ అభ్యర్థి రేగట్టే అండాలు లింగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## రైలు ద్వారా అరటి ఎగుమతిని చేపట్టేందుకు తగిన సహకారం అందిస్తాం..

**ఎగుమతిదారులు అరటి ఎగుమతి వీలైనంత త్వరగా ప్రారంభించాలి**
**జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్**

రైలు ద్వారా అరటి ఎగుమతిని చేపట్టేందుకు తగిన సహకారం అందిస్తామని, ఎగుమతిదారులు అరటి ఎగుమతి వీలైనంత త్వరగా ప్రారంభించాలని జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ పేర్కొన్నారు. బుధవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ నుంచి రైల్వే ద్వారా తాడిపత్రి నుండి జెఎన్‌పిటి పోర్టుకు అరటి ఎగుమతులను ప్రారంభించడానికి తీసుకోవాల్సిన చర్యలపై ఉద్యాన శాఖ అధికారులు, అరటి ఎగుమతిదారులు, వాటాదారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.– ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం నుంచి రీఫర్ కంటైనర్‌కు రూ.10,000/– ప్రోత్సాహకాన్ని అందించడానికి సిద్ధంగా ఉందని, ఇందుకోసం కోటి రూపాయలు ఇన్సెంటివ్లను ప్రభుత్వం అందజేయనుందని, ఎగుమతిదారులు రైలు ద్వారా అరటిపండ్ల రవాణాను వీలైనంత త్వరగా ప్రారంభించాలని ఆదేశించారు. గౌరవ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు తాడిపత్రి నుంచి రైలు ద్వారా అరటిపండ్ల ఎగుమతి చేపట్టేందుకు, అవసరమైన సహకారం అందించేందుకు ఆసక్తిగా ఉన్నారన్నారు. ఇటీవల జరిగిన మంత్రులు, కార్యదర్శుల కాన్ఫరెన్స్ లో అరటి ఎగుమతులు పెంచాలని ముఖ్యమంత్రి చెప్పారన్నారు. ప్రభుత్వం నుంచి అవసరమైన సబ్సిడీ ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని, ఇన్సెంటివ్ విషయమై హార్టికల్చర్ ఉన్నతాధికారులతో మాట్లాడడం జరిగిందన్నారు. అరటి రైలు ఒకసారి విజయవంతం అయితే దీర్ఘకాలికంగా ఎంతో ప్రయోజనం ఉంటుందని, ఎగుమతి దారులు రైలు ద్వారా అరటి పండ్ల ఎగుమతిని వీలైనంత త్వరగా ప్రారంభించాలన్నారు. అరటి నాణ్యత పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నామని, అన్ని గ్రామాల్లోనూ ఉద్యాన శాఖ ద్వారా రైతులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. ఇరాన్, ఇరాక్, యుఎఇ మరియు ఇతర మధ్యప్రాచ్య దేశాలకు ఎగుమతి చేయడానికి తాడిపత్రి నుండి జెఎన్‌పిటి పోర్టు వరకు అరటి ఎగుమతులకు సంబంధించి అన్ని ఎగుమతిదారులతో సంభాషించారు. రైలు ద్వారా అరటి రవాణాలో పరిష్కరించాల్సిన అంశాలపై చర్చించారు.లిఈ సమావేశంలో హార్టికల్చర్ డిడి ఉమాదేవి, అరటి ఎగుమతిదారులు, వాటాదారులు పాల్గొన్నారు.

## అసెంబ్లీకి వచ్చి చర్చించాలి

**వైసీపీకి ఎమ్మెల్యే పరిటాల సునీత సూచన**
**బడ్జెట్ సమావేశాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే సునీత**
**ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే**

వైసీపీ నాయకులకు నిజాయతీ ఉంటే సమస్యలపై అసెంబ్లీకి వచ్చి చర్చించాలని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత సూచించారు. బుధవారం నుంచి ప్రారంభమైన అసెంబ్లీ సమావేశాల్లో ఆమె సహసర సభ్యులతో కలసి పాల్గొన్నారు. ఉభయ సభలనుద్దేశించి గవర్నర్ అబ్దుల్ నజీర్ చేసిన ప్రసంగం తర్వాతా ఎన్డీఏ శాసనసభా పక్ష సమావేశంలో సహచర సభ్యులతో కలిసి పాల్గొన్నారు. అంతకముందు అసెంబ్లీ లాబీలో మంత్రి నారా లోకేష్ గారితో మహిళా ఎమ్మెల్యేలు కలిసి పలు అంశాలపై చర్చించుకున్నారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే సునీత మాట్లాడుతూ అసెంబ్లీలో ఎలా వ్యవహరించాలన్న దానిపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక సూచనలు చేశారన్నారు. వైసీపీ నాయకులు అసెంబ్లీకి ఇలా వచ్చి అలా వెళ్లిపోవడం సరైంది కాదన్నారు. తిరుమల లడ్డూ సహా ఏ అంశమైనా సరే వారిలో నిజాయతీ ఉంటే అసెంబ్లీకి వచ్చి చర్చించాలన్నారు. ప్రజా సమస్యలపై చర్చించే అంశంలో ఈ ప్రభుత్వం ఎప్పటికీ ముందుంటుందని ఎమ్మెల్యే సునీత స్పష్టం చేశారు..



## చంద్రబాబు తప్పుడు వ్యాఖ్యలు భక్తుల మనోభావాలు దెబ్బతినేలా ఉన్నాయి: మాజీ ఎమ్మెల్యే సత్తి

**లడ్డూలో ఎటువంటి కల్తీ లేదని క్లీన్ చిట్**

తిరుమల లడ్డూ ప్రసాదం లో జంతువుల కొవ్వు, పంది కొవ్వు, గొడ్డుమాంసం కలిసిందని సిఎం చంద్రబాబు, పవన్ కళ్యాణ్ చేసిన వ్యాఖ్యలు మాజీ ఎమ్మెల్యే, అనపర్తి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణ రెడ్డి తీవ్రంగా ఖండించారు.మంగళవారం అనపర్తి వైసిపి కార్యాలయంలో మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ అబద్ధపు ప్రచారం తో తిరుమల తిరుపతి వెంకటేశ్వర స్వామి ప్రతిష్ట, కోట్లాది మంది భక్తుల మనోభావాలు దెబ్బతిన్నాయని ఆగ్రహం వ్యక్తంచేశారు.దేశంలోనే అత్యంత ప్రతిష్టాత్మక సంస్థలు ఎన్ డి ఆర్ఐ, ఎన్ డిడి బి ల్యాబ్ లు లడ్డూ ప్రసాదం లో ఎటువంటి కొవ్వు, గొడ్డుమాంసం కలవలేదని నిర్ధారణ చేయడం జరిగిందని ఆయన తెలిపారు.నిజాలు వెలుగులోకి వచ్చిన తర్వాత కూడా దుష్ట ప్రచారం తగదని హితవు పలికారు. ముఖ్యమంత్రి స్థాయిలో ఉన్న వ్యక్తి ఎంతో పవిత్రమైన లడ్డూ పై కల్తీ అంటూ ఆరోపణలు చేయడం తగదని అన్నారు.సుప్రీమ్ కోర్టు ఆదేశాలతో ఏర్పాటైన సిబీఐ చిట్ ఎటువంటి కల్తీ క్లీన్ చిట్ ఇచ్చిందని మాజీ ఎమ్మెల్యే సత్తి చెప్పారు. తాను చేసిన వ్యాఖ్యలు నిజం కాకపోవడంతో చంద్రబాబు "బాత్ రూమ్"లకు వాడే కెమికల్స్ వాడారంటూ మరోసారి నిరాధార వ్యాఖ్యలు చేయడం పట్ల మాజీ ఎమ్మెల్యే తీవ్ర ఆగ్రహం వ్యక్తంచేశారు.రాజకియ లబ్ది కోసం దేవుడు, ప్రసాదాన్ని వాడుకోవడం మహాపాపమని విశ్వాసం రాజకీయ సాధనంగా మారకూడదని మాజీ ఎమ్మెల్యే సత్తి పేర్కొన్నారు.ద్రాక్షరామంలో శివలింగ ఛేదన ఘటన, విజయవాడ లో దేవాలయాలు కూల్చివేత సింహాచలం ప్రసాదం లో నత్త అన్నవరం ప్రసాదం లో ఎలుకలు వంటి సంఘటనలు చంద్రబాబు పాలనలో జరిగాయని అవి బయటపడకుండా బెదిరింపులకు దిగింది వాస్తవం కాదా అని మాజీ ఎమ్మెల్యే సత్తి ప్రశ్నించారు.తాను చేసిన తప్పుని అంగీకరించి ప్రజలు శ్రీ వారి భక్తులకు చంద్రబాబు క్షమాపణ చెప్పాలని మాజీ ఎమ్మెల్యే సత్తి సూర్యనారాయణ రెడ్డి డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో పార్టీ అనపర్తి మండల కన్వీనర్ సత్తి రామకృష్ణారెడ్డి (రాంబాబు), నల్లమిల్లి మురళీమోహన్ బాలకృష్ణారెడ్డి, కొండేటి భీమేష్, ఇంకా పలువురు నేతలు ఉన్నారు.

## బీజేపీ ఎస్సీ మోర్చా కమిటీ విస్తరణలో బాగంగా సింహాచలానికి కీలక బాధ్యతలు




అనపర్తి నియోజకవర్గం, బిక్కవోలు మండలం, బలభద్రపురం గ్రామానికి చెందిన కాటే సింహాచలం ని తూర్పు గోదావరి జిల్లా బీజేపీ ఎస్సీ మోర్చా కమిటీ కార్యవర్గ సభ్యుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. క్షేత్రస్థాయిలో పార్టీని బలోపేతం చేయడంలో, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన సేవలు మరింత అవసరమని పేర్కొన్నారు.ఈ సందర్భంగా నియామకానికి సంబంధించిన అధికారిక సర్టిఫికెట్‌ను జిల్లా బీజేపీ అధ్యక్షులు పిక్కిన నాగేంద్ర చేతుల మీదుగా కాటే సింహాచలం కి అందజేశారు. పార్టీ సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు మరింత చేరువ చేయాలని ఆయన సూచించారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర బీజేపీ కార్యదర్శి మట్టడి రమణ, గోదావరి జోన్ ఇంచార్జి దున్న సుమన్ బాబు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. పార్టీ కోసం పనిచేసే నిజాయితీ గల కార్యకర్తలకు తగిన గుర్తింపు లభిస్తోందని వారు పేర్కొన్నారు. ఇలాంటి నియామకాలు పార్టీకి మరింత బలం చేకూరుస్తాయని అభిప్రాయపడ్డారు.అలాగే నూతనంగా పదవులు పొందిన ఇతర నాయకులు, పెద్ద సంఖ్యలో బీజేపీ కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని కాటే సింహాచలం ని అభినందించారు. పార్టీ పట్ల మరింత అంకితభావంతో పనిచేస్తామని సింహాచలం ఈ సందర్భంగా తెలిపారు.ఈ నియామకం ద్వారా అనపర్తి నియోజకవర్గం, బిక్కవోలు మండలంలో బీజేపీ ఎస్సీ మోర్చా కార్యకలాపాలు మరింత విస్తరిస్తాయని, రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాలు మరింత వేగంగా సాగుతాయని నాయకులు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారు.

## జీవితంలో మరువలేని అనుభూతి

సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు










దాదాపు 35 ఏళ్ల తర్వాత గుంటూరులోని శ్రీ వెంకటేశ్వర విజ్ఞాన మందిరంలో తొలి వరుసలో కూర్చున్న ఆ సీటు తనకు ఎప్పటికీ మరువలేనిదిగా మిగిలిపోతుందని సీనియర్ జర్నలిస్టు నిమ్మరాజు చలపతిరావు తెలిపారు. అప్పట్లో దాసరి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ప్రముఖ దర్శకుడు కే. విశ్వనాథ్, సినీనటుడు చంద్రమోహన్ పక్కన కూర్చోవడం జరిగింది. తాజాగా చిరకాల మిత్రులు, కళాకారులు, జర్నలిస్ట్ ముత్తవరపు సురేష్ బాబు ఆధ్వర్యంలో అంతర్జాతీయ నాటకోత్సవాలు 5 రోజులపాటు వైభవంగా జరిగాయి. ఇప్పుడు, మళ్లీ అదే వేదికపై, ముగింపు సభలో తొలి వరుసలోనే తన చిరకాల మిత్రులు రాజశేఖర్, డి. సూర్యప్రకాశ్ (ఎస్పీ), జర్నలిస్టులు రామారావు, ప్రసాద్ తదితరులతో కలిసి పాల్గొనడం తనకు అదృష్టంగా భావిస్తున్నానని తెలిపారు. కాలం మారినా, ఆ సీటు ఇచ్చిన స్ఫూర్తి మాత్రం మారలేదని ఆయన అన్నారు.

## జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను కలిసిన నూతన నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు..




అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో బుధవారం జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ ను నూతన నగర పాలక సంస్థ కమిషనర్ జశ్వంత్ రావు మర్యాద పూర్వకంగా కలిసి పూలమొక్క అందజేశారు. అలాగే అసిస్టెంట్ కలెక్టర్ సచిన్ రహర్ ను నూతన నగర పాలక సంస్థ కమిషనర్ కలిసి పూలమొక్క అందించారు.

ధర్మఘంట

# మర్రిగూడలో ఏటీఎం తిప్పలు..నగదు కోసం జనం పాట్లు..!బ్యాంకులు ఉన్నా ఏటీఎంల్లేవు..

**అవస్థల్లో వినియోగదారులు**
**శివన్నగూడలో ఏటీఎం ఉన్నా లేనట్టే..**
**అధికారుల నిర్లక్ష్యంపై వినియోగదారులు ఆగ్రహం**

**ధర్మ ఘంట,ఫిబ్రవరి 11 మర్రిగూడ :**

నల్లగొండ జిల్లా మర్రిగూడ మండల కేంద్రంలో ఏటీఎం సేవలు అందుబాటులోలేకపోవడంతో స్థానిక ప్రజలు, వ్యాపారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మర్రిగూడలో సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,తెలంగాణ గ్రామీణ బ్యాంక్ వంటి ప్రధాన బ్యాంకులు ఉన్నప్పటికీ,కనీసం ఒక్క ఏటీఎం కేంద్రం కూడా లేకపోవడం గమనార్హం.అవసరానికి నగదు కావాలంటే బ్యాంకులు తెరిచే వరకు వేచి చూడాల్సి వస్తోంది.సెలవు దినాల్లో లేదా అత్యవసర సమయాల్లో నగదు కావాలంటే నాంపల్లి,చండూరు,మాల్ ఇతర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని మండల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.మండల పరిధిలోని శివన్నగూడలో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం ఉన్నప్పటికీ,అది తరచూ సాంకేతిక సమస్యలతో పనిచేయని స్థితిలో ఉంటోంది.“ ఏటీఎం ఉన్నా నో క్యాష్“ బోర్డులే దర్శనమిస్తుండటంతో




వినియోగదారులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.మండల కేంద్రంలో బ్యాంకులు ఉన్నా ఏటీఎంలు లేకపోవడం దారుణమని,అత్యవసర సమయంలో నగదు కోసం ప్రైవేట్ వ్యక్తులను ఆశ్రయించాల్సి వస్తోంది,లేదా పక్క మండలాలకు వెళ్లాల్సి వస్తోందిని మండల ప్రజలు ఆరోపిస్తున్నారు.డిజిటల్ లావాదేవీలు పెరిగినప్పటికీ,గ్రామీణ ప్రాంతాల్లో చిన్న,చిన్న అవసరాలకు నగదు తప్పనిసరి.మండల కేంద్రంలో కనీసం రెండు,మూడు ఏటీఎంలు ఉండాల్సిన చోట,ఉన్న ఒక్కటి కూడా మూతపడటంపై అధికారుల నిర్లక్ష్యం స్పష్టంగా కనిపిస్తోందని వినియోగదారులు మండిపడుతున్నారు. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా బ్యాంకు అధికారులు స్పందించి,మర్రిగూడ మండల కేంద్రంలో వెంటనే ఏటీఎం కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని,అలాగే శివన్నగూడలోని ఏటీఎంను పునరుద్ధరించాలని మండల ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

## నేడు జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో పెద్ద ఎత్తున కార్మిక వర్గం పాల్గొనాలి




**కార్మిక సంఘాల పిలుపు**

**ధర్మ ఘంట ఫిబ్రవరి 11,సూర్యాపేట :**

మోడీ ప్రభుత్వం 29 కార్మిక చట్టాలను నాలుగు లేబర్ కోడ్ లుగాగా మార్చి కార్మిక హక్కులను హరించి వేయడాన్ని,విత్తన చట్టం, విద్యుత్ సవరణ చట్టం ను రద్దు చేయాలని, మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని, కార్మికుల కనీస వేతనాలను 26 వేల రూపాయలకు పెంచాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ, అమ్మకాన్ని నిలిపివేయాలని జరిగే దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెలో కార్మిక వర్గం నేడు సూర్యాపేట జిల్లా కేంద్రంలోని వాణిజ్య భవన్ నుండి ఉదయం 10:30 కు ర్యాలీ ప్రారంభమవుతుందని పెద్ద ఎత్తున పాల్గొనాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి నెమ్మది వెంకటేశ్వర్లు, ఐఎఫ్ టి యు జిల్లా ప్రధాన కార్యదర్శి గంటా నాగయ్య, బి ఆర్ టి యు జిల్లా అధ్యక్షులు వెంపటి గురూజీ, ఐఎఫ్టియు జిల్లా నాయకులు సామ నర్సిరెడ్డి పిలుపునిచ్చారు.

## అందని బకాయిలు ఆగుతున్న విశ్రాంత ఉద్యోగుల గుండెలు...!

**సకాలంలో అందని రిటైర్మెంట్ బెనిఫిట్స్**
**మనోవేదనతో ఆగిన సయ్యద్ హుస్సేన్ సార్ గుండె**
**పట్టణంలో అలుముకున్న విషాదఛాయలు**
**బకాయిలు వెంటనే చెల్లించాలని బకాయిల సాధన కమిటీ డిమాండ్**

**ధర్మఘంట ఫిబ్రవరి 11 సూర్యాపేట:**

ప్రభుత్వ పెద్దలారా...రిటైర్డ్ ఉద్యోగస్తుల బకాయిలు చెల్లించి వారి చావులను ఆపండని రిటైర్డ్ ఉద్యోగుల,ఉపాధ్యాయుల బకాయిల సాధన కమిటీ మరియు పలువురు పెద్దలు ప్రభుత్వాన్ని కోరారు.రిటైర్మెంట్ బెనిఫిట్స్ అందక అప్పుతెచ్చి కూతురు వివాహం చేసి,అప్పుల పాలై మనోవేదనతో గుండె ఆగి అనంతలోకాలకు చేరిన విశ్రాంత ఉపాధ్యాయుని మృతదేహాన్ని చూసి పలువురు కన్నీటి పర్యంతమయ్యారు.ఈ విషాద సంఘటన మంగళవారం జిల్లా కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే...సూర్యాపేట పట్టణంలోని తిలక్ నగర్ ప్రభుత్వ హైస్కూల్ లో స్కూల్ అసిస్టెంట్ (బయోలాజికల్ సైన్స్) గా విధులు నిర్వహించిన సయ్యద్ హుస్సేన్ సార్ 2025 అక్టోబర్ 31న పదవీ విరమణ పొందారు.స్వగ్రామం సూర్యాపేట జిల్లా ఆత్మకూరు (ఎస్)కాగా, ప్రస్తుత సూర్యాపేటలోని శ్రీరామ్ నగర్ లో నివాసం ఉంటున్నారు. ఆయనకు ఇద్దరు కూతుర్లు కావడంతో ఇటీవల చిన్న కూతురు వివాహం చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ వస్తాయనే ఆశతో అప్పులు చేసి కూతురు వివాహం జరిపించారు.కానీ, ఎంతకాలం ఎదురుచూసినా బకాయిలు రాకపోవడంతో తెచ్చిన అప్పుల భారం ఎక్కువై, మానసికంగా కృంగిపోయి, మనోవేదనతో కుమిలిపోతూ భరించలేని ఒత్తిడికి గురై,ఫిబ్రవరి 10 సాయంత్రం హార్ట్ స్ట్రోక్ తో మరణించారు.బుధవారం ఆయన స్వగ్రామం ఆత్మకూరు (ఎస్) మండల కేంద్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించారు.ఈ కార్యక్రమానికి రిటైర్డ్ ఉద్యోగస్తుల అసోసియేషన్ తెలంగాణ బకాయిల సాధన కమిటీ సూర్యాపేట జిల్లా ప్రధాన కార్యదర్శి సుభాని షేక్ సహా అనేకమంది రిటైర్డ్ ఉద్యోగస్తులు హాజరై,వారికి అంతిమ నివాళులర్పించి,కుటుంబానికి ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.ఈ సందర్భంగా సుభాని షేక్ మాట్లాడుతూ రిటైర్డ్ ఉద్యోగుల బకాయిలు సకాలంలో అందక అనేకమంది అర్ధాంతరంగా మరణిస్తున్నారని, ఇప్పటికే 60 మందికి పైగా రిటైర్డ్ ఉద్యోగులు,ఉపాధ్యాయులు మానసిక ఆవేదనతో చనిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.ఇది శోచనీయమని, అత్యంత విచారకరమని ప్రభుత్వ తీరును తీవ్రంగా ఖండించారు.ఇప్పటికైనా ప్రభుత్వం సమస్య యొక్క తీవ్రతను గుర్తించి వెంటనే ఏక మొత్తంగా రిటైర్మెంట్ ఉద్యోగస్తుల,ఉపాధ్యాయుల బకాయిలను అందరికీ చెల్లించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.అనంతరం సీనియర్ రిటైర్డ్ ఉపాధ్యాయులు షేక్ సైదులు,సంఘం గౌరవ అధ్యక్షులు దశరథ రామారావు, పోతురాజు నరసయ్య,తదితర రిటైర్డ్ ఉద్యోగులు, ఉపాధ్యాయులు భౌతికకాయాన్ని సందర్శించి శ్రద్ధాంజలి ఘటించి,వారికి వెంటనే బకాయిలు మంజూరు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.రిటైర్డ్ ఉద్యోగస్తుల కష్టాలను,బాధలను గమనించి రిటైర్మెంట్ బకాయిలను తక్షణం చెల్లించాల్సిందిగా ప్రభుత్వాన్ని కోరారు.



## ఓట్ల లెక్కింపు కేంద్రాన్ని సందర్శించిన పురపాలక పరిపాలన శాఖ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి..




**ధర్మఘంట,ఫిబ్రవరి11,రామగుండం:**

జగిత్యాల , మంచిర్యాల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాల మునిసిపల్ ఎన్నికల పర్యవేక్షణ అధికారి,పురపాలక పరిపాలనా శాఖ జాయింట్ డైరెక్టర్ వేణుగోపాల్ రెడ్డి బుధవారం రామగుండం లో సశీదర్శించారు. ఈ సందర్భంగా అడిషనల్ కలెక్టర్ స్థానిక సంస్థలు,రామగుండం నగర పాలక సంస్థ కమీషనర్ జె.అరుణశ్రీ ఓట్ల లెక్కింపు ప్రక్రియ సజావుగా నిర్వహించేందుకు రామగుండం నగరపాలక సంస్థ చేసిన ఏర్పాట్లను వివరించారు.ఎలక్షన్ మెటీరియల్ రిసెప్షన్ కౌంటర్ తో పాటు ఎన్ టి పి సి టౌన్ షిప్ లోని సెయింట్ కేర్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పోలింగ్ కేంద్రశీ, ఓట్ల లెక్కింపు కేంద్రమైన గోదావరిఖని ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా నగర పాలక సంస్థ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ పి వి రామన్, ఎ సి పి శ్రీహరి, టి పి ఎస్ నవీన్ తదితరులు ఉన్నారు.

## బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను పరిశీలించిన జిల్లా ఎస్పీ..

**ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి ..**
**ఎస్పీ రోహిత్ రాజు**

**ఖమ్మం ఫిబ్రవరి 10 ధర్మ ఘంట**



జిల్లాలోని కొత్తగూడెం కార్పొరేషన్,ఇల్లందు, అశ్వారావుపేట మున్సిపాలిటీలకు బుధవారం జరగనున్న పోలింగ్ నేపథ్యంలో పటిష్టమైన పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ రోహిత్ రాజు తెలిపారు.ఇందులో భాగంగా పాల్వంచలోని అనుబోస్ ఇంజనీరింగ్ కళాశాల నందు ఏర్పాటు చేసిన బ్యాలెట్ బాక్సుల పంపిణీ కేంద్రాలను జిల్లా ఎస్పీ పరిశీలించారు. అక్కడ విధులలో ఉన్న అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా పోలింగ్ కేంద్రాల వద్ద 1200 మందితో భద్రతా ఏర్పాట్లు చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.పోలింగ్ కేంద్రాల పరిసరాలలో నిరంతర నిఘా కొరకు ప్రత్యేక బృందాలను నియమించడం జరిగిందన్నారు.ఓట్ల లెక్కింపు కేంద్రమైన పాల్వంచ అనుబోస్ కళాశాల పరిసర ప్రాంతాలను డాగ్స్ స్క్వాడ్,బాంబుస్క్వాడ్ తో నిరంతరం తనిఖీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు.నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు తీసుకోబడతాయని అన్నారు.ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు.

## మున్సిపల్ ఎన్నికల్లో వార్ వన్ సైడ్!

**90 శాతం మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు కాంగ్రెస్ ఖాతాలో:**
**టీపీసీసీ అధ్యక్షుడు ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్**

**ధర్మఘంట. ఫిబ్రవరి 11. హైదరాబాద్.**



తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించిన మున్సిపల్ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించబోతోందని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ శ్రీ మహేష్ కుమార్ గౌడ్ ధీమా వ్యక్తం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో జరిగిన పోలింగ్ సరళిని పరిశీలిస్తే సుమారు 90 శాతం స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఆధిక్యం సాధించబోతోందని ఆయన పేర్కొన్నారు.సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అమలవుతున్న ప్రజా పాలన ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు పట్టణ ఓటర్లు పట్టం కట్టారని ఆయన తెలిపారు. ప్రజల అవసరాలను గుర్తించి తీసుకుంటున్న వేగవంతమైన నిర్ణయాలు, పారదర్శక పరిపాలన, సామాజిక న్యాయానికి కట్టుబడి... ఇవన్నీ కలిపి కాంగ్రెస్ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత బలపరిచాయని ఆయన అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలు సంతృప్తిగా ఉన్నారనే విషయాన్ని ఈ ఫలితాలు స్పష్టం చేస్తున్నాయి” అని అన్నారు.ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీల అమలు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతులకు రుణమాఫీ, ఇందిరమ్మ ఇళ్లు, పట్టణాభివృద్ధికి ప్రత్యేక నిధుల కేటాయింపు వంటి కార్యక్రమాలు ప్రజల మనసులను గెలుచుకున్నాయని ఆయన వివరించారు.ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీలు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య వ్యవస్థ మెరుగుదలపై ప్రభుత్వం తీసుకున్న చర్యలు ఓటర్లలో సానుకూల భావనను కలిగించాయని చెప్పారు.ఈ ఎన్నికల ద్వారా కాంగ్రెస్ పార్టీపై ప్రజలు ఉంచిన విశ్వాసం భవిష్యత్‌లో మరింత బాధ్యతగా పని చేయాలని సూచిస్తోందని మహేష్ గౌడ్ గారు పేర్కొన్నారు.

“ప్రజలు ఇచ్చిన ఈ మద్దతు మా బాధ్యతను పెంచింది. ప్రతి మున్సిపాలిటీ, ప్రతి కార్పొరేషన్‌లో పారదర్శకతతో, ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి కార్యక్రమాలను అమలు చేస్తాం” అని ఆయన హామీ ఇచ్చారు.ప్రతిపక్ష పార్టీలు ప్రచారం చేసిన అసత్యాలు, అవాస్తవాలను ప్రజలు నమ్మలేదని ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇచ్చి నిలబడే ప్రభుత్వమని, ప్రజల సమస్యల పరిష్కారమే ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు.

మహేష్ కుమార్ గౌడ్ పార్టీ శ్రేణులకు, అభ్యర్థులకు, కార్యకర్తలకు అభినందనలు తెలిపారు. ఎన్నికల్లో కష్టపడి పనిచేసిన ప్రతి కార్యకర్తకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజలు ఇచ్చిన తీర్పును గౌరవిస్తూ, పట్టణాల సమగ్రాభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తుందని ఆయన పేర్కొన్నారు. మొత్తానికి తెలంగాణలో మున్సిపల్ ఎన్నికలు కాంగ్రెస్ హవాను మరింత బలపరిచాయి. ప్రజా పాలనపై ప్రజల విశ్వాసమే ఈ విజయానికి మూలకారణమని పార్టీ నాయకత్వం అభిప్రాయపడుతోంది.

## ఓటు హక్కు వినియోగించుకున్న జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవర్

**ధర్మ ఘంట ఫిబ్రవరి 11,సూర్యాపేట:**




మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌లో భాగంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. బుధవారం స్థానిక కృష్ణానగర్ కాలనీ లో ఏర్పాటు చేసిన వార్డు నంబర్ 14, పోలింగ్ స్టేషన్ నంబర్ 49 వద్ద ఓటు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత శక్తివంతమైనదని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు. ప్రతి ఓటరు పోలింగ్ కేంద్రానికి చేరుకుని నిర్భయంగా ఓటు వేయాలని, స్థానిక స్వపరిపాలనలో భాగస్వాములు కావాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఎన్నికల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రశాంతం : జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి.

**ధర్మఘంట, ఫిబ్రవరి 11, కరీంనగర్:**

రెండవ సాధారణ మున్సిపల్ ఎన్నికలు-2026 లో భాగంగా కరీంనగర్ జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి, మున్సిపాలిటీలకు బుధవారం నిర్వహించిన పోలింగ్ ప్రక్రియ ప్రశాంతంగా ముగిసింది. జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి పలు పోలింగ్ కేంద్రాలను సందర్శించి పోలింగ్ ప్రక్రియను పరిశీలించారు. కరీంనగర్ మున్సిపల్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా ఎన్నికల సరళని పర్యవేక్షించారు. వెబ్ కాస్టింగ్ ద్వారా కలెక్టరేట్ నుండి ఎన్నికల తీరును పరిశీలిస్తూ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కౌంటింగ్ ప్రక్రియ కోసం ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ సెంటర్ ను పరిశీలించారు. కరీంనగర్ లోని రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయం, జ్యోతినగర్ లోని ఎస్సార్ ఉన్నత పాఠశాల పోలింగ్ స్టేషన్లను కలెక్టర్ సందర్శించారు. సెయింట్ ఆల్ఫోన్స్ హై స్కూల్లో ఏర్పాటు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్ ను పరిశీలించారు. ఈ కేంద్రంలో ఓటు వేసేందుకు వచ్చిన వారికి మొక్కలు అందజేశారు.పోలింగ్ నిర్వహణను, ఏర్పాట్లను పరిశీలించి సిబ్బందికి తగు సూచనలు చేశారు. పోలింగ్ స్టేషన్ ఆవరణలో పోటీలో ఉన్న అభ్యర్థుల జాబితాను పరిశీలించారు. ఓటరు జాబితాలో ఓటర్ల క్రమ సంఖ్య సరిచూసుకొని ఓటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ప్రిసైడింగ్ అధికారులకు సూచించారు. డివిజన్ పరిధిలో ఓటర్ల సంఖ్య, అప్పటి వరకు నమోదైన పోలింగ్ శాతాన్ని అడిగి తెలుసుకున్నారు. ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఓటింగ్ శాతం ఎప్పటికప్పుడు నిర్దేశిత ఫార్మాట్లో నమోదు చేయాలనీ, ఆన్లైన్లో నివేదికలు సమర్పించాలని రిటర్నింగ్ అధికారిని ఆదేశించారు. సాయంత్రం 5 గంటల్లోపు పోలింగ్ కేంద్రం ఆవరణలో ఓటు వేసేందుకు క్యూలో ఉన్న వారందరికీ ఓటు సద్వినియోగం చేసుకునేందుకు అవకాశం కల్పించాలన్నారు.రోడ్లు భవనాల శాఖ ఎస్ ఈ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పోలింగ్ స్టేషన్ లో జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి తన ఓటు హక్కును వినియోగించుకున్నారు. ఈ లొకేషన్ లో ఉన్న పలు పోలింగ్ స్టేషన్లను సందర్శించి ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు.పోలింగ్ సరళిని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి వెబ్ కాస్టింగ్ ద్వారా పరిశీలించారు. జిల్లాలోని కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్, చొప్పదండి, జమ్మికుంట, హుజురాబాద్ మున్సిపాలిటీలకు పోలింగ్ జరుగుతున్న నేపథ్యంలో అన్ని పోలింగ్ స్టేషన్లలో వెబ్ కాస్టింగ్ ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన వెబ్ కాస్టింగ్ స్క్రీన్ ల ద్వారా జిల్లా ఎన్నికల అధికారి పరిస్థితిని ఎప్పటికప్పుడు సమీక్షించారు. రిటర్నింగ్ అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు.కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలోని ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ ద్వారా పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికల ప్రక్రియను పరిశీలించారు. గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల ఆవరణలో ఏర్పాటు చేసిన సిసి కెమెరాలు ద్వారా అక్కడి పరిస్థితిని సమీక్షించారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ ప్రక్రియ సజావుగా ముగియడంతో ఈనెల 13న జరిగే కౌంటింగ్ ప్రక్రియ ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో కలిసి పరిశీలించారు. ఎస్.ఆర్.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటుచేసిన కౌంటింగ్ హాల్ పరిశీలించి పలు సూచనలు చేశారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనల ప్రకారం కౌంటింగ్ ప్రక్రియను నిర్వహించాలని ఆదేశించారు. ఎప్పటికప్పుడు ఓట్ల లెక్కింపు వివరాలను నిర్దిష్ట ఫార్మాట్లో నమోదు చేయాలని అన్నారు. కౌంటింగ్ కోసం అన్ని ఏర్పాట్లు పకడ్బందీగా పూర్తి చేయాలని ఆదేశించారు.

## ఎన్నికల విధుల్లో మానవత్వం చాటుకున్న కరీంనగర్ రూరల్ పోలీస్.

**ధర్మఘంట, ఫిబ్రవరి 11, కరీంనగర్:**



కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల సందర్భంగా, ఆరేపల్లి ఒకటవ డివిజన్‌లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాల పోలింగ్ కేంద్రం వద్ద పోలీసులు తమ ఉదారతను చాటుకున్నారు.ఓటు వేయడానికి వచ్చిన ఒక వికలాంగుడైన వృద్ధుడు నడవలేని స్థితిలో ఉండటాన్ని గమనించిన కరీంనగర్ రూరల్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి, వెంటనే స్పందించి వీల్ చైర్ ఏర్పాటు చేశారు. స్వయంగా ఆ వృద్ధుడిని వీల్ చైర్ సహాయంతో పోలింగ్ స్టేషన్ లోనికి పంపించి, ఆయన తన ఓటు హక్కును వినియోగించుకునేలా సహకరించారు.ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రతి ఓటరుకు సులభంగా ఓటు వేసే అవకాశం కల్పించడం తమ బాధ్యతని, ముఖ్యంగా దివ్యాంగులు మరియు వృద్ధులకు అవసరమైన సహాయం అందించేందుకు పోలీస్ యంత్రాంగం సిద్ధంగా ఉందని తెలిపారు.